ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



యుగశక్తి



గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 16 - సంచిక 1
**జూన్ 2011**

**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

*Please send Drafts & Money Orders in favour of*
**"SRI VEDAMATA GAYATRI TRUST"**
**GAYATRI CHETANA KENDRAM**
H.P. Road, Moosapeta, Near Aswini House, Hyderabad-18.

# అంతా నీవే

'నేను' అనే భ్రాంతి వలన సమస్తమైన భ్రాంతులు తలెత్తుతాయి. నేను అనేదానిమీద ఎవరికైతే అధికంగా అభిమానముంటుందో వారికి కూడా ఈ 'నేను' అనేది ఏమిటనే విషయము సరిగ్గా తెలియదు. రోగం, వ్యాధి, శక్తిహీనతకు లోనయ్యే ఈ శరీరమే 'నేనా'? బాల్యము, యవ్వనము, వృద్ధాప్య దశలుగా మారే ఈ శరీరమేనా నేను? లేక క్షణక్షణమూ ఊహలలో, ఆలోచనలలో, భావనలలో మునిగితేలే మనస్సా నేను? అనుభవజ్ఞులైన వారిలా అంటారు – ఈ "నేను" అనేది ఆత్మ భ్రమవశాత్తు ప్రకృతితో వేసుకున్న ఒక ముడి. ఈ ముడి దుఃఖాన్ని, బాధను ఇస్తుంది. ఎరుక కలిగినప్పుడే ఈ ముడి విడివడుతుంది.

జీవితము యొక్క అంతులేని అనంత ప్రవాహమునందు ఈ 'నేను' అనే ముడి యొక్క బంధనము సంపూర్ణ జీవన ప్రవాహములో అనేక రకాలుగా ఇబ్బందులను కలిగిస్తూనే ఉంటుంది. 'నేను' అను ఈ నీటిబుడగ శక్తి ప్రవాహము నుండి 'తాను' వేరు అనుకుంటుంది. ఈ బుడగకు వేరే శక్తి ఏమీలేదు. దానికి ఏ కేంద్రము లేదు. అది సముద్రానిదే! సాగరమే దాని జీవితము. సముద్రం నుండి 'నేను వేరు' అనే భావనయే దాని అజ్ఞానము. నీటి బుడగ మూలములో కూడా సముద్రమునందుగల అనంతమగు జలరాశి శక్తి ఉంది.

సూఫీ సంతులు ఒక కథ చెపుతారు. ప్రేయసి తలుపును ఒక ప్రేమికుడు తడతాడు. లోపలనుండి 'వచ్చినవారెవరు?' అనే మాట వినిపించగా బయట నిలబడిన వ్యక్తి 'నేను' అని జవాబిచ్చాడు. దానికి సమాధానము ఈవిధంగా వినిపించింది. 'ఈ ఇంట్లో నేను, నీవు అను ఇద్దరికి స్థానం లేదు. మూసిన ద్వారాలు మూసినట్లే ఉన్నాయి. ప్రేమికుడు అడవిలోకి వెళ్ళి తపస్సు, ఉపాసన చేసి భక్తితో తనను తాను భగవంతునికి సమర్పించుకున్నాడు. చాలా సంవత్సరాల తరువాత అతను మరల అదే ఇంటికి వచ్చి తలుపు తట్టగా మరల 'బయట ఎవరున్నారు' అనే ప్రశ్న అడగబడినది. కానీ ఈసారి తలుపు తెరువబడినది. దానికి కారణము 'నీవే ఉన్నది' అన్న జవాబు వచ్చింది. 'నీవే ఉన్నది' అన్న ఈ సమాధానము సమస్త ఆధ్యాత్మిక జీవితం యొక్క సారము. ఎందుకనగా ఇందులో క్షుద్రమైన 'నేను' ను సర్వవ్యాపియైన పరమాత్మసత్తాలో విలీనము చేసుకున్న దివ్యానుభూతి లభిస్తుంది.

పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు. **9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**

ఏమి చెయ్యాలి అని తెలుసుకోవడాన్ని విషయ పరిజ్ఞానం అంటారు.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** అంతా నీవే 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** ఆలోచనల అద్భుత శక్తి 2
3. **వేదమంత్రం :** జీవన లక్ష్యం 3
4. **గాయత్రీ విద్య-10 :** గాయత్రి సాధన అనేక సిద్ధుల జనని 4
5. **యుగ గీత-11 : మూడవ అధ్యాయం కర్మయోగం మొదటి భాగం:** కర్మ చేయకుండా ఎలా ఉండగలరు? 7
6. **సూర్య విజ్ఞానం - 10 :** రిద్ధి సిద్ధుల ద్వారం నాభిచక్రం - సూర్యచక్రం 10
7. **గురుపూర్ణిమ ప్రత్యేకం :** సద్గురు కృప అవతరించిన మహా పర్వదినం 13
8. **వ్యక్తి నిర్మాణం :** మనోయోగంతో ప్రతిభ 15
9. **ఆదిశక్తి లీలా కథలు-13 :** వేదోక్త రాత్రిసూక్తం మరియు తంత్రోక్త రాత్రిసూక్తం 18
10. **మనం - మన ఆరోగ్యం :** గుండె జబ్బులను మనమే స్వయంగా ఆహ్వానిస్తున్నాము 20
11. **వృక్ష జగత్తు :** మొక్కలు కూడా స్పందిస్తాయి 22
12. **జన్మశతాబ్ది ప్రత్యేకం :** వృక్ష గంగా మహోత్సవాన్ని ఇలా జరుపుకోవాలి 25
13. **పూజ్య గురుదేవుల అమృతవాణి :** బ్రహ్మవర్చస్సును అభివృద్ధి చేసే సాధన గాయత్రీ ఉపాసన 27
14. **పూజ్య గురుదేవుల అమృత వాణి-2 :** గురుపూర్ణిమ సందేశం 29
15. **యుగ ఋషి, వేదమూర్తి, తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది:** హృదయపూర్వక ఆహ్వానం 31
16. నా వారితో నా మాట: **2011-2012 జన్మశతాబ్ది సంవత్సర వేడుకల విశేషాలు :** గొప్ప సమయం వచ్చింది 34
17. **ఆరోగ్యమే మహాభాగ్యం-8 :** హోమియో వైద్య సేవ 36
18. **వేమన వేదం - నవజీవన నాదం - 9** 38
19. **2011 ఆగష్టు 1 నుండి 30 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జన్మశతాబ్ది రథ యాత్ర కాలసూచిక** 40
20. **9 రోజుల సంజీవని సాధనా శిబిరముపై సమీక్ష** 45
21. **వార్తలు** 47
22. **అక్షరాల ఆట :** పదగాయత్రి-9 48




## సద్గురు వచనామృతం

### ఆలోచనల అద్భుత శక్తి

మనిషి ఎలా ఆలోచిస్తాడో అలాగే రూపొందుతాడు. ఏ ఏ వస్తువుల గురించి ఆలోచిస్తామో, చింతన చేస్తామో అవి మన దగ్గరకు వచ్చి తీరుతాయి. కనుక, మనం పొందాలనుకున్న వాటిని గురించే ఎల్లప్పుడూ ఆలోచించాలి. ఈ ఆలోచలను నిర్మలం చేసే రెండు గొప్ప గుణాలను మన శాస్త్రాలు ప్రశంసించాయి. అవి - **దయ, క్షమ. దయవలన ఆలోచనలకు నిర్మలత్వం వస్తుంది. క్షమ వలన నిర్మలత్వానికి స్థిరత్వం లభిస్తుంది.** దయ, క్షమ అనే భావములు లేకుండా ఎవరికి ఎన్నడూ శాంతి లభించదు.

సదాలోచన, సద్భావన ఇవే మన సంపదలు. ఆలోచనా శక్తిని గురించిన సరైన అవగాహనకు వచ్చిన రోజున అనేక అనుమానాలూ, సమస్యలూ వాటికవిగా పరిష్కారం అవుతాయి. **మంచి పనులు చేయటం ద్వారా కూడా మంచి ఆలోచనలలోని సంస్కారాలను పెంచే శక్తి తీవ్రతరమవుతుంది.** మనిషి ఎలాంటి ఆలోచనలు చేస్తే అలాంటి ఆలోచనలకు అనుగుణంగా కొద్దికాలం తర్వాత వాతావరణం తయారవుతుంది. ఏ ఏ పరిస్థితులు వస్తువుల గురించి ఆలోచన తరచు చేస్తాడో అవి అతని దగ్గరకు వస్తాయి. మనిషి తన ఆలోచనల ద్వారానే ఉన్నత స్థితిని కాని, నీచ స్థితిని కాని పొందుతాడు. ఆలోచనలే ప్రేరణ నిచ్చే శక్తి. ఆలోచనకూ, కర్మకూ మధ్య సన్నిహిత సంబంధమున్నది.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1954*

*అనువాదం : శ్రీ ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

## పండుగలు

**జులై 2011**

| | |
|---|---|
| 15-07-2011 | గురుపూర్ణిమ |

**ఆగస్టు 2011**

| | |
|---|---|
| 13-08-2011 | శ్రావణ పూర్ణిమ - రాఖీ |
| 15-08-2011 | భారత స్వాతంత్ర్య దినోత్సవం |
| 23-08-2011 | శ్రీకృష్ణాష్టమి |

ఎలా చెయ్యాలి అని నేర్చుకోవడాన్ని నైపుణ్యం అంటారు.

వేద మంత్రం

# జీవన లక్ష్యం

**స వి జానామి యది వేదమస్మి**
**నిణ్యః సన్నద్ధో మనసా చరామి ।**
**యదా మాగన్ప్రథమజా ఋతస్యాదిద్వాచో**
**అశ్నువే భాగమస్యాః ॥ (ఋగ్వేదం 1/164/37)**

**భావార్థం :** మనుష్యుడు తనను తాను తెలుసుకోలేదు. ఇది ఎంత పెద్ద పొరపాటు. అతడు, భాష సాహిత్యం మొదలైన వాటిలో ఏ సామర్థ్యం పొందాడో దానితో శరీరము, జీవాత్మల జ్ఞానము ప్రాప్తించుకోవాలి.

**సందేశము :** ఈ మనుష్య శరీరము మళ్ళీ మళ్ళీ లభించేది కాదు. మన పరమ లక్ష్యమైన ప్రభుప్రాప్తికి ఒక పనిముట్టుగా ఇది లభించింది. కానీ అజ్ఞాన వశమున ప్రాపంచిక భోగ విలాసాలలో దారితప్పి మనం ఈ సదవకాశమును పోగొట్టు కొంటున్నాము. ధనము, సంపద, సాధనాలు - సంపత్తి, భార్యాబిడ్డలు, బంధువులు స్నేహితులు మనకు అక్కరకు రారు. సత్కర్మలు మాత్రమే అక్కరకు వస్తాయి. మనం ఈ ప్రపంచం నుండి ఏదో ఒక రోజు వెళ్ళిపోతాం అనేది మనం మరచి పోతుంటాము. ఈ శరీరాన్ని ఎంతో ముద్దుమురిపెంతో ప్రేమతో అలంకరించుకోవటానికి మనం నిజం-అబద్ధం, మోసం-దగా, నీతి-అవినీతి అన్నింటిని ఉపయోగించుకుంటాం. ఏమేమి పాపాలు చేస్తామో తెలియదు. ఈ దేహం చివరికి అగ్నిలో కాలి భస్మమై పోతుంది. ఒక్క క్షణానికి కూడా భరోసా లేదు. మన సమస్త జ్ఞానము, విజ్ఞానము, ప్రతిభ, సామర్థ్యము, చదువులు విద్య అన్నీ భౌతిక విషయాలకే పరిమితమయ్యాయి. ఈ శరీరంలో ఉన్న ఈ శరీరపు యజమాని అయిన ఆత్మను మరచిపోయాము. ఈ ఆత్మయే పరమాత్మ యొక్క అంశ, దీనిని తెలుసుకోలేకపోతే మనం అంధకారంలో దారి తప్పి, ఎప్పుడూ దుఃఖిస్తూ ఉంటాము.

ఆత్మను గుర్తించి, సత్యమార్గంలో నడిచే బుద్ధి మనకు లభిస్తే మానవ జీవితం సార్థకమవుతుంది. సాధారణంగా బుద్ధి రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి దుర్బుద్ధి, అది మనలను స్వార్థం, మోహం లోభం మొదలైన పాపకర్మలవైపు లాగుతుంది. రెండవది సద్బుద్ధి, మన హితానికి కావలసిన కర్మలవైపు ప్రేరేపించి, పాపకర్మల నుండి కాపాడుతుంది. వీటి కంటే పైన ఉన్నది మేధస్సు, ఇది మంచి-చెడుల మధ్య తేడా తెలుసుకొనే సామర్థ్యాన్ని వికసింపచేస్తుంది. **మేధస్సు కంటే పైస్థాయి ప్రజ్ఞ, వివేకానుసారము లోకహిత కార్యాలకు ప్రేరణనిస్తుంది. దీనివలన తమోగుణం నశించి, మనుష్యుడు స్వార్థం వైపు వెళ్ళడు. ప్రజ్ఞ కంటే వికసించిన స్థాయి ప్రతిభ. దీనినే ఆత్మ దృష్టి అని అనవచ్చు. ఈ విలక్షణమైన బౌద్ధికశక్తి ఆధారంగా మనుష్యుడు ప్రపంచంలోని అత్యంత గూఢమైన రహస్యాలు తెలుసుకోగలడు.** బుద్ధి యొక్క సర్వోత్తమ రూపం ఋతంభరా బుద్ధి. దీనిలో కేవలం సత్వ గుణమే మిగిలి ఉంటుంది. దీని వెలుగులో ప్రతి వస్తువు ఉన్నదున్నట్లుగా కన్పించి, భ్రమ సంశయము మటుమాయం అవుతాయి.

నేడు మనుష్యుడు రకరకాలైన జ్ఞానము, విజ్ఞానము, భాష మొదలైనవి అధ్యయనం చేసి వాటిని అనేకానేక రంగాలలో వినియోగిస్తున్నాడు. సుఖ, సౌకర్యాల పరికరాల రాశిని ప్రోగుచేస్తున్నాడు. ఒక స్విచ్ నొక్కగానే ప్రపంచములోని ఏ మూలలోనైనా, ఏ కార్యమైనా చేయగలిగే స్థితికి చేరుకున్నాడు. మనుష్యుడు ఈ స్థితితో పరమాత్మకంటే కూడా తాను గొప్పవాడనుకొనేంత మూర్ఖత్వానికి చేరుకున్నాడు. ఈ మానవ శరీరం ఇందుకొరకే ప్రాప్తించిందా? ఈ బుద్ధి యొక్క ఉపయోగం ఇదేనా? జీవనలక్ష్యం ఇదేనా?

మనము మన బుద్ధిని వికసింపచేసుకుంటూ, మానవ జీవితం వాస్తవిక లక్ష్యాన్ని గుర్తించి, ఆ దిశలో ముందుకు వెళ్ళాలి.

★★★

## ఏకాగ్రత మహత్తు

*నెపోలియన్ చదివే క్లాసులో 58 విద్యార్థులుంటే ఈయన ర్యాంకు 42. ఆయనను చాలా వెనుకబడిన విద్యార్థిగా భావించేవారు. చార్లి చాప్లిన్ విదూషకుల ప్రారంభిక పోటీలలో ఘోరంగా ఓడిపోయేవాడు. ఇటలి నాయకుడు గారిబాల్డీ చాలా వెనుకబడిన పేద కుటుంబంలో జన్మించాడు. ఐన్‌స్టీన్ విద్యార్థి జీవితంలో లెక్కల్లో చాలా వెనుకబడి ఉండేవాడు. తోటి విద్యార్థులు ఇతనికి లెక్కలు రావని హేళన చేసేవారు.*

*ఈ ఉదాహరణలు కేవలం ఏకాగ్రత ద్వారా అద్భుతమైన సాఫల్యాలు పొందిన వారివి. వీరి జీవితాలు ప్రారంభంలో సాధారణ స్థాయి కంటే అధ్వాన్నంగా ఉండేవి.*

- ప్రజ్ఞా పురాణం నుండి

**ఉత్పాదకత మన సామర్థ్యానికి అద్దం పడుతుంది.**

గాయత్రీ విద్య-10

# గాయత్రీ సాధన అనేక సిద్ధులకు జనని



సృష్టివికాసక్రమము ఒక కేంద్ర బిందువు నుండి మొదలై అన్నివైపులా విస్తరించిందనే విషయాన్ని పాశ్చాత్య విద్వాంసులు, భారతీయ దార్శనికులు అంగీకరిస్తారు. ప్రారంభంలో మహత్ తత్త్వము ఒక్కటే ఉందని ఖగోళశాస్త్రజ్ఞులు కూడా అభిప్రాయపడతారు. అందులో విస్ఫోటన జరిగి పదార్థముల ప్రవాహము మొదలైంది. అక్కడినుండి గ్రహ నక్షత్రములతో కూడిన సృష్టిరచన ప్రారంభించబడింది. ఈ విధమైన భౌతికవాదములో పదార్థమునకు స్థానమున్నది కాని చేతనత్వమునకు ఎటువంటి స్థానము లేదు. అందుచేత అది పరిపూర్ణము కాలేదు.

భారతీయ మనీషుల పరిశోధనలు ఇంతకంటే చాలా విలువైనవి. వారి అభిప్రాయము ప్రకారము ప్రారంభంలో సత్ తత్త్వముతో కూడిన బ్రాహ్మీచేతన ఒక్కటే ఉంది. ఆయన నాభిప్రదేశములో ఒక స్ఫురణ కలిగింది. అదే **'ఏకోహం బహుశ్యామ'.** నేను ఒక్కడినే అనేకము కావాలి. ఆ ఇచ్ఛయే శక్తిగా మారి విశ్వవ్యాప్తమైన మహాప్రకృతిగా పిలువబడింది. ఆ శక్తియే గాయత్రి. ఈ శక్తి, సత్వము-రజస్సు-తమస్సు అనే మూడు శక్తులుగా విడిపోయింది. గాయత్రీమహావిజ్ఞాన్‌లో దానినే 'హ్రీం' అనగా జ్ఞానశక్తి లేదా సరస్వతి రూపంగా, 'శ్రీం'ను సాధనములు అంటే లక్ష్మీరూపంగా, 'క్లీం'ను శక్తి ప్రధానమైన కాళీరూపంగా వివరించారు. పరమేశ్వరుడు, ప్రకృతి యొక్క సంయోగముతో ఉత్పన్నమైన శక్తిని జీవము అంటారు. తల్లిదండ్రుల గుణ సూత్రములు (chromosomes) రెండూ పిల్లలలోనూ ఉంటాయి. పిల్లలు ఎక్కువగా తమ తల్లిని ఆధారంగా చేసుకునే జీవిస్తారు. ఇదేవిధంగా జీవసత్తాలో తన తల్లిదండ్రుల ఇరువురి శక్తి ఉంటుంది. అందుచేతనే గాయత్రీ సాధనకు అంతటి మహత్త్వాన్నిచ్చారు. అందులో కర్మ, జ్ఞాన, వైరాగ్యాలన్నీ కలిసి ఉండుట చేత గాయత్రీ తత్త్వజ్ఞానం ఇహలోక-పరలోకముల రెండింటికి సహాయపడుతుంది.

ఆద్యశక్తి గాయత్రి నుండి ఉత్పన్నమై సరస్వతి, లక్ష్మి, దుర్గగా విడిపోయేదే సూక్ష్మప్రకృతి. సర్వత్రా వ్యాపించియున్న శక్తి ప్రవాహము పంచతత్త్వములకంటే ఎక్కువ సూక్ష్మంగా ఉంటుంది. నదీప్రవాహములోని నీటి అలలు గాలివీచడం వల్ల ఎలా గలగలధ్వనులు చేస్తాయో అదే విధంగా సూక్ష్మప్రకృతిలోని శక్తిధారలు మూడురకాల ధ్వనులు చేస్తాయి. సత్ అనే ప్రవాహములో 'హ్రీం' అనే ధ్వని, రజోప్రవాహములో 'శ్రీం' అనే ధ్వని, తమోప్రవాహములో 'క్లీం' అనే ధ్వని ఉత్పన్నమౌతాయి. వీటన్నింటికంటే సూక్ష్మమైనది బ్రహ్మయొక్క (ॐ) ఓంకార ధ్వని. నాదయోగసాధన చేసేవారు ధ్యాన నిమగ్నులై ఈ ధ్వనులను పట్టుకుంటారు. వీటి సహాయంతో బ్రహ్మసాయుజ్యము పొందుతారు.

**ప్రాచీనకాలంలో మన ఋషులు యోగము ద్వారా శరీరములోని విభిన్న అంగాలలో దాగియున్న శక్తి కేంద్రాలను, చక్రాలను, గ్రంథులను, మాతృకలను, జ్యోతులను, భ్రమరములను జాగృతపరచేవారు.** ఆ జాగరణవల్ల శక్తి ప్రవాహము ఉత్పన్నమౌతుంది. రేడియోస్టేషనులోని ట్రాన్స్‌మీటర్ యంత్రానికి మన రేడియోను అనుసంధానం చేస్తే రెండు విద్యుత్‌శక్తులు సమస్థితిలోకి వచ్చి కార్యక్రమాలు మనకు వినపడతాయి. అదే విధంగా **సాధనతో శరీరంలో నిద్రాస్థితిలో దాగియున్న కేంద్రాలను జాగృతపరచి సూక్ష్మప్రకృతిలోని శక్తి ప్రవాహాలతో సంబంధం స్థాపించుకుంటే మనిషికి, ఆద్యశక్తికి మధ్య సంబంధము ఏర్పడుతుంది. అప్పుడు మనిషి ఆద్యశక్తి గర్భములో దాగియున్న అనేక రహస్యాలను అర్థం చేసుకొని తనకు ఇష్టమైన విధంగా ఉపయోగించుకొని లాభం పొందుతాడు.** అంతేకాక ఈ ప్రపంచంలో ఏదైతే ఉన్నదో అది అంతా ఆద్యశక్తిలో వుంది. అందుచేత అందుకు సంబంధించిన శక్తులన్నీ కూడా ప్రపంచంలోని పదార్థములన్నింటితోను, సాధనాలతోనూ సంబంధం పెట్టుకోగలుగుతాయి.

ఈనాటి వైజ్ఞానికులు పంచతత్త్వముల వరకు పరిమితమైన స్థూల ప్రకృతితో సంబంధము కలుపుకునేందుకు ఖరీదైన పెద్దపెద్ద యంత్రాలను, విద్యుత్, గ్యాస్ , పెట్రోలువంటి ఇంధనాలను ఉపయోగించవలసి వస్తున్నది. ఈ విధానము చాలా ఖర్చు, శ్రమలతో కూడినది. అందులో పాడు కావడం, విరిగిపోవడం, మారిపోవడంలాంటివెన్నో జరుగుతాయి. వాటిని ఒకచోట నుండి

**స్వార్థానికి, సామాజిక బాధ్యతలకు సమతుల్యం ఉంటే సాత్విక ఆలోచనలు వస్తాయి.**

ఇంకోచోటికి మార్చడం ఇంకా కష్టమైనపని. భారతీయ యోగవిజ్ఞానవేత్తలు ఈ జంఝాటాలు పెట్టుకోలేదు. వారు ఏ యంత్ర సహాయము లేకుండా, నడిపేవారు లేకుండా, ఇంధనం లేకుండా సూక్ష్మప్రకృతితో తమ శరీరములోని శక్తి కేంద్రాలను అనుసంధానము చేసి ఆశ్చర్యము కలిగించే చమత్కారాలు ఎన్నో చేశారు. అవి ఎలా జరిగాయి అనేది తెలుసుకోగలిగే సామర్థ్యము కూడా ఈనాటి భౌతికశాస్త్రజ్ఞులకు లేదు.

మహాభారతము, లంకాయుద్ధములలో ప్రయోగించిన అస్త్రశస్త్రములోని కొన్ని ఈనాడు అస్పష్టంగా కనపడుతున్నాయి. రాడార్, గ్యాస్‌బాంబ్, అణుబాంబ్, రోగాణువుల బాంబ్‌లు, మృత్యు కిరణములు మొదలైన వాటియొక్క నమూనాలు ఇప్పుడు తయారుచేయబడుతున్నాయి. ప్రాచీనకాలంలో మోహనాస్త్రం, బ్రహ్మాస్త్రం, నాగాస్త్రం, వరుణాస్త్రం, ఆగ్నేయాస్త్రం, శత్రువులను హతమార్చి తిరిగి అమ్ములపొదిలోకి వచ్చి చేరే బాణములవంటివి ఎన్నో ఉపయోగించేవారు. శబ్దభేది బాణము గురించి అందరం విన్నదే. ఇటువంటి అస్త్రశస్త్రాలు ఖరీదైన యంత్రాల ద్వారా కాక మంత్రబలంతో నడుస్తాయి. మంత్రబలంతో 'కృత్య', 'ఘాత' అనెడి అస్త్రాలు ప్రయోగించబడతాయి. ఇవి శత్రువు ఎక్కడున్నా వెదికి చంపుతాయి. లంకలోవున్న రావణుడు, అమెరికాలో వున్న అహిరావణుడు ఒకరితో ఒకరు మాట్లాడుకునేవారు. వారికి ఏ ట్రాన్స్‌మీటర్, రేడియో యంత్రాల అవసరం లేదు. పెట్రోలు లేకుండా విమానాలు తిరుగుతుండేవి.

అష్టసిద్ధులు, నవనిధుల గురించి యోగశాస్త్రాలన్నింటిలో చెప్పబడింది. అగ్నిలో ప్రవేశించుట, వాయువుతో సమానంగా పరిగెత్తుట, అదృశ్యమైపోవుట, మానవులు పశుపక్షులుగా, పశు-పక్షులు మానవులుగా మారిపోవుట, శరీరాన్ని మరీ చిన్నదిగా, మరీ పెద్దదిగా, మరీ బరువుగా, మరీ తేలికగా చేయుట, శాపం ద్వారా కష్టములను కలిగించుట, వరదానములు ఇచ్చి ఉత్తమ ఫలితములు ఇచ్చుట, మృత్యువును ఆపుట చేసేవారు. పుత్రకామేష్టి యాగము, భవిష్యత్తు గురించి తెలుసుకొనుట, ఇతరుల ఆంతర్యమును తెలిసికొనుట, ఇష్టమైనంత ధనమును క్షణములో సమకూర్చుకొనుట, ఋతువులు, నగరములు, జీవ-జంతు గణములను, దానవులను ఉత్పత్తి చేయుట, సమస్త బ్రహ్మాండములో అలజడి సృష్టించుట, వస్తువులను మార్చివేయుట, ఆకలి, దాహము, నిద్ర, చలి-వేడిలపై విజయము, ఆకాశములో ఎగురుట వంటి ఆశ్చర్యకరమైన పనులు కేవలము మంత్ర బలముతో, యోగశక్తితో, అధ్యాత్మ విజ్ఞానముతో చేసేవారు. వాటి కొరకు ఎటువంటి యంత్రాలను, విద్యుత్‌ను, ఇంధనాన్ని వాడేవారు కాదు. శరీరంలో ఉండే విద్యుత్‌ను ప్రకృతిలోని సూక్ష్మప్రవాహాలతో కలిపి ఇటువంటి పనులు చాలా సులభంగా చేసేవారు. ఇది భారతీయ విజ్ఞానము. దీనికి ఆధారము సాధన.

సాధన ద్వారా కేవలము పైన చెప్పిన భౌతిక చమత్కారాలే కాక సత్వ, రజోగుణ క్షేత్రాలలో ఉండే లాభాలు, ఆనందాలను విరివిగా పొందవచ్చు. హాని, శోకము, వియోగము, ఆపదలు, రోగములు, విరోధాలవంటి విపత్కరపరిస్థితులలో చిక్కుకొన్న సాధారణ మానసికస్థితిగల వ్యక్తులు నరకంలో ఉన్నామా అనిపించేంత బాధను పొందుతారు. ఆ స్థితిలో ఆత్మశక్తులను ఉపయోగించుకోవడం చేతనైనవారు వివేకము, వైరాగ్యము, జ్ఞానము, సాహసం, ఆశ మరియు ఈశ్వరునిపై విశ్వాసములను ఆధారంగా చేసుకొని నవ్వుతూ, నవ్వుతూ సులభంగా ఆ స్థితినుండి బైటపడతారు. వారు పరిస్థితులు చెడ్డగా ఉన్నా, సాధారణంగా ఉన్నా తమ ఆనందమును పెంచుకునేందుకు మార్గమును వెతుక్కుంటారు. జీవితాన్ని ఆనందంగా, మజాగా గడుపుతారు. పాపం కోటీశ్వరులకి అంతటి సౌభాగ్యం ఉండదు. **ఆత్మబలంతో శారీరికంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారు గొప్పగొప్ప సంపన్నులకంటే ఎంతో ఆనందకరమైన జీవితాన్ని గడుపుతారు.**

'సత్' తత్వము యొక్క లాభాన్ని వర్ణించేందుకు కలానికి, మాటలకి రెండింటికి శక్తి సరిపోదు. **ఈశ్వరీయ దివ్యతత్వములు ఆత్మలో వృద్ధి చెందినపుడు దయ, కరుణ, ప్రేమ, స్నేహము, త్యాగము, సంతోషము, శాంతి, సేవాభావము, ఆత్మీయత, సత్యనిష్ఠ, నిజాయితి, సంయమము, నమ్రత, పవిత్రత, శ్రమశీలత, ధర్మపరాయణత మొదలైన సద్గుణముల పరిమాణము రోజు రోజుకు పెరుగుతూ ఉంటుంది.** ఆ వ్యక్తికి ప్రశంసలు, కృతజ్ఞత, ప్రత్యుపకారము, శ్రద్ధ, సహాయము, గౌరవములు లభిస్తూ ఉంటాయి. అంతేకాక సద్గుణములు చాలా మధురమైనవి. ఇవి ఎవరి హృదయములో ఉంటాయో అతనికి ఆత్మసంతోషము చల్లని ప్రవాహమువలె నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. ఇటువంటి వారు జీవించిఉన్నా, ఉండకపోయినా జీవన్ముక్తులై స్వర్గం, పరమానందం, బ్రహ్మానందం, ఆత్మదర్శనం, ప్రభుప్రాప్తి, బ్రహ్మనిర్వాణం, తురీయావస్థ, నిర్వికల్పసమాధి యొక్క సుఖమును పొందుతారు. ఇదే మానవజీవిత లక్ష్యము. ఇది సాధించిన ఆత్మ అనంతమైన తృప్తి చెంది ఆనందసాగరములో మునిగిపోతుంది.

**ఆలోచనలకు, మాటలకు పొంతన ఉంటే, ఆత్మ విశ్వాసం ప్రతిబింబిస్తుంది.**

ఆద్యశక్తి గాయత్రి యొక్క సత్వ, రజ, తమోగుణ ధారల వరకు వెళ్ళే సాధకుడు ఆత్మిక, మానసిక, ప్రాపంచిక సుఖ సామాగ్రిని చాలా సులభంగా పొందగలుగుతాడు. సరస్వతి, లక్ష్మి, కాళి సిద్ధులను వేరుచేయవచ్చు. పాశ్చాత్యదేశాల్లోని వైజ్ఞానికులు 'క్లీం' తత్వములోని కాళిశక్తిని అన్వేషించి, ఆరాధించుటలో నిమగ్నమైనారు. బుద్ధివాదులు, ధర్మప్రచారకులు, గాంధేయ వాదులు, సంస్కర్తలు, సమాజసేవకులు, వ్యాపారులు, శ్రామికులు, ఉద్యోగులు, సమాజవాదులు, కమ్యూనిష్టులు మొదలైనవారు 'శ్రీం' శక్తిని వ్యవస్థీకృతం చేసి లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. యోగులు, బ్రహ్మవేత్తలు, అధ్యాత్మవాదులు, తత్వదర్శులు, భక్తులు, దార్శనికులు, పరమార్థపరాయణులైన వ్యక్తులు 'హ్రీం' తత్వము యొక్క సరస్వతి ఆరాధనలో మునిగిపోయారు. ఈ మూడు వర్గములవారు గాయత్రిలోని ఆద్యశక్తి యొక్క ఒక్కో చరణమును ఉపాసించేవారే. గాయత్రిని త్రిపదా అంటారు అనగా మూడు చరణాలుంటాయి. ఈ త్రివేణి పైన చెప్పిన మూడు ప్రయోజనములను పూర్తి చేస్తుంది. తల్లి పిల్లవాని యొక్క అన్ని పనులను చేస్తుంది. అవసరాన్నిబట్టి ఆమె బిడ్డకోసం వంటమనిషిగా, దాసిగా, కాపలావానిగా, చాకలిగా ఇలా ఎన్నో రకాల అవతారాలు ఎత్తుతుంది. అదేవిధంగా ఆత్మశక్తిని ఆద్యశక్తితో కలిపే విద్యను ఎవరు తెలుసుకున్నారో వారు తమగురించి తాము ఆ తల్లికి మంచి సంతానము అని చెప్పుకోవచ్చు. వారు గాయత్రి రూపియైన, సర్వశక్తివంతమైన మాతనుండి ఇష్టానుసారం లాభాలను పొందవచ్చు.

ప్రపంచంలో దుఃఖానికి మూడు కారణాలుంటాయి. 1. అజ్ఞానము, 2. అశక్తి, 3. అభావము (లేమి). గాయత్రి యొక్క సూక్ష్మ ప్రకృతి యొక్క మూడు ధారల సదుపయోగంతో ఈ మూడు దు:ఖములను నివారించుకోవచ్చు. 'హ్రీం' అజ్ఞానమును, 'శ్రీం' లేమిని, 'క్లీం' అశక్తిని దూరం చేస్తుంది. భారతీయ సూక్ష్మ విద్యా విశేషజ్ఞులు సూక్ష్మప్రకృతి మీద అధికారం సాధించి తాము కోరిన ఆనందాన్ని పొందేందుకు ఏ విజ్ఞానమును ఆవిష్కరించారో అది ఏ విధంగా చూసినా అసాధారణమైనది, మహత్వపూర్ణమైనది. ఆ ఆవిష్కరణ పేరే సాధన. సాధన వలన సిద్ధి లభిస్తుంది. గాయత్రీసాధన అనేక సిద్ధులకు జనని.

*– అఖండజ్యోతి, ఆగస్టు 2004*

*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## పని ఒకటే; దృష్టికోణం వేరు

*స్వామి వివేకానంద శిష్యులతో కూడి పర్యటనకై బయలుదేరారు. దారిలో ఒక దేవాలయ నిర్మాణం జరుగుతోంది. స్వామి అక్కడ ముగ్గురు కూలీలతో సంభాషణ జరిపారు. ముగ్గురిని అడిగిన ప్రశ్న ఒకటే, 'భాయీ, ఏం చేస్తున్నావు?' ఒకడు జవాబు చెప్పాడు – 'చూస్తున్నారు కదా, గాడిదలాగా పనిచేస్తున్నాను. రోజంతా కష్టపడితే ఏదో కాస్త దొరుకుతుంది. పైపెచ్చు యజయాని తిట్లు బెదిరింపులు కూడా భరించాలి. విధి అలా వ్రాసి పెట్టి ఉన్నది, ఏంచేస్తాం? అనుభవించక తప్పుతుందా?' అప్పుడు రెండవవాడు చెప్పాడు – 'దినభత్యం సంపాదించుకొనేందుకు ఏదో ఒకటి చేయాలి కదా మరి. మరో పని ఎక్కడా దొరకనప్పుడు ఏం చేయగలం? పొట్టపోసుకోవాలి కదా ఎలాగో అలా అందుకని బ్రతుకు తెరువుకోసం ఈ భారాన్ని మోస్తున్నాను.' ఇప్పుడు మూడవవాని వంతు వచ్చింది. భక్తి భావనతో అతను ఇలా చెప్పాడు. – 'ఇటు చూడండి. ఇక్కడ దేవునికి మందిరం తయారవుతోంది. నేను చెమటోడ్చి పని చేస్తున్నాను. ఈ గుడి నిర్మాణంలో నా శ్రమ బిందువులు కూడా కొన్ని వినియోగపడుతున్నాయి. నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇదే నాకు తృప్తి. ఇటు తిండి గడుస్తున్నది. అటు దేవుడి పని కూడా పూర్తి అవుతున్నది.'*

*ఈ ముగ్గురు కూలీలతో సంభాషణ ముగిసిన తరువాత స్వామీజీ శిష్యులతో ఇలా చెప్పారు. 'మీరు విన్నారు కదా. ఈ ముగ్గురూ పనిచేసే పద్ధతిలోను, భావాలలోను ఎంత వ్యత్యాసం ఉన్నది! మందిరాన్ని ముగ్గురూ నిర్మిస్తున్నారు. ఒకనిది గాడిద బరువు మోస్తున్నట్లుగా నిస్సహాయత. రెండవవాడిది కుటుంబ పోషణ కొరకు పనిచేస్తున్నాననే భావన. పనిలో నిమగ్నుడయిన మూడవవానిది సమర్పణ భావన. ఈ ముగ్గురూ చేసే పనితీరులో నిపుణతలో కూడా ఇదే తేడా ఉంది. పనిచేసేటపుడు ఆ పనిపట్ల ఉండే దృష్టికోణానికి చాలా ప్రాధాన్యం ఉంది. భావన చాలా ముఖ్యమైన అంశం.'*

**ఆత్మవంచన చేసుకునేవారు మానసిక క్షోభను అనుభవిస్తారు.**

యుగ గీత-11 : మూడవ అధ్యాయం కర్మయోగం మొదటి భాగం



# కర్మ చేయకుండా ఎలా ఉండగలరు?

ఒక విధంగా కర్మయోగమనేది వైజ్ఞానిక జీవన విధానం. అర్జునుడి జన్మ ఒక రజోగుణవంతుడిగా, క్రియా ప్రధాన వాసనలతో కూడినదని భగవంతుడు ఈ అధ్యాయంలో చెప్తున్నాడు. రాష్ట్రం, సంస్కృతుల సేవకు ఉపయోగపడే శౌర్య ప్రదర్శన వల్ల, వీరత్వంతో యుద్ధం చేసి అవినీతిని తొలగించడం వల్లనే ఆ వాసనలు తగ్గుతాయి. అందుకు నడుం బిగించి కర్మలను ఆచరించాలి. తన ముందున్న తాత్కాలిక సమస్యలను ఎదుర్కోవాలి. అంతేకాని వాటిని చూసి భయపడి పారిపోకూడదు. ఎంత క్లిష్టమైన సమస్యలైనా జీవన సమరానికి ఉపయోగపడతాయి, పౌష్టిక ఆహారమవుతాయి. వాటిని ఎదుర్కోవాలి, యుగధర్మాన్ని పాటించాలి.

అత్యుత్తమ శిష్యుడైన అర్జునుడి అద్భుత ప్రశ్నతో మూడవ అధ్యాయం మొదలవుతుంది – 'హే జనార్ధన! కర్మ కన్నా జ్ఞానం శ్రేష్ఠమైనదని నీవు భావిస్తే నన్నెందుకు ఈ యుద్ధం వంటి ఘోరకర్మలను చేయమంటున్నావు.' **"తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ." (3.1).** ఇప్పటివరకు అర్జునుడు జ్ఞానం గురించి విన్నాడు. జ్ఞానం గురించిన అంత గొప్ప విషయాలు చెప్పి ఇప్పుడు ఘోరమైన కర్మలెందుకు కృష్ణుడు అతనితో చేయించదలచుకున్నాడో అని ఆశ్చర్యపోతున్నాడు. అందుకే తన విస్మయాన్ని రెండవ శ్లోకంలో బయటపెడతాడు.

**వ్యామిశ్రేణేవ వాక్యే బుద్ధిం మోహయసీవ మే ।**
**తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్ ॥ 3.2**

కలగాపులగము వంటి నీ మాటలతో నా బుద్ధి భ్రమకు లోనగునట్టు చేయుచున్నావు. కనుక నాకు శ్రేయస్కరమైన ఒక మార్గాన్ని నిశ్చయముగా తెల్పుము.

జిజ్ఞాసువైన సాధకుడు మాత్రమే ఇలాంటి ప్రశ్నలు వేయగలడు. ఒక్కోసారి పరమపూజ్య గురుదేవులు చెప్పిన మాటలు కూడా మనకు అర్థం కావు. ఒకసారి ఒక విషయం చెప్తారు, మరోసారి ఇంకోటి చెప్తారు. ఒక్కోసారి పంచకోశాలను, షట్చక్రాలను జాగృతపరుచుకోమంటారు; మరోసారి జ్ఞానయజ్ఞాలు చేయమంటారు, గాయత్రి మరియు యజ్ఞాలను ఇంటింటికి చేర్చమంటారు. ఒక్కోసారి ఆజ్ఞాచక్రంపై ధ్యాస పెట్టమంటారు, మరోసారి ప్రచారం చేయమంటారు. శక్తిపీఠాల నిర్మాణంలో పాలుపంచుకోమంటారు లేదా స్థానిక కార్యక్రమాల్లో పాల్గొనమంటారు. ఒక్కోసారి సుదీర్ఘ సాధనల్లో, జ్ఞాన సాగరంలో ముంచేస్తూ ఉంటారు. మరోసారి సేవకు మించిన ఉత్తమ ధర్మం లేదంటారు. జ్ఞానమంత పవిత్రమైనది మరేది లేనప్పుడు కర్మెందుకు? కర్మ చేయాల్సిన అవసరమేమిటి?

ఈ విషయాలన్నీ సరిగ్గా అర్థం చేసుకుంటే ఈనాటి పరిస్థితులు కూడా శ్రీకృష్ణార్జునుల కాలంతో పోలినవే. అర్జునుడి రూపంలో మనమున్నామా లేదా అని ప్రయత్నపూర్వకంగా చూసుకోవాలి. మనం శ్రీకృష్ణుడి మాటలు విన్నప్పుడు అది మన గురువుగారి గొంతుకే అని నమ్మాలి. ఆ మాత్రం చేస్తే చాలు, ఈ యుగగీత చాలా ఉపయోగపడుతుంది.

గురుదేవులు చెప్పిన కర్మలలో, ఒకరిచేత రాయించేవారు, మరొకరి చేత ఉపన్యాసాలిప్పించేవారు, ఒకర్ని ఊడవమంటే, మరొకరితో బిల్డింగులు నిర్మించడం గురించి మాట్లాడేవారు. స్థానిక కార్యకర్తలతో యజ్ఞాలు, సంస్కారాలు చేయించి, అఖండ జ్యోతి పాఠకులను పెంచడమే గొప్ప పుణ్యకర్మ అని చెప్పేవారు. ఆ అఖండ జ్యోతి పుస్తకంలో మాత్రం జ్ఞానం గురించి ధ్యానం గురించి చెప్పేవారు. ఒక సంచికలో కర్మ గురించి చెపితే, మరో దాంట్లో సమాధి గురించి చెప్పేవారు. ఒక చోట వైరాగ్యం గురించి చెప్పి, మరోచోట సేవ, సాధన, కర్మలే భగవంతుని పూజ అని చెప్పారు. అలాంటప్పుడు మనస్సులో సందేహాలు కలగడం స్వాభావికం. అలాంటప్పుడు మనం మళ్ళీ భగవత్స్వరూపులు, యోగీశ్వరులు అయిన గురుదేవులనే శరణువేడి సందేహం నివేదించుకోవాలి.

ప్రస్తుతం శ్రీకృష్ణుడి మాటల్లో పరస్పర విరోధమేమీ కనిపించటం లేదు. ఒక్కో విషయంలో సత్యం ఒక్కో రూపంలో బహిర్గతమవుతుంది. "మనం పరమాత్మ యొక్క సమగ్ర తత్త్వాన్ని అర్థం చేసుకోలేము. అందులో శుభాశుభాలు రెండూ ఉంటాయి. ఈ పరస్పర విరోధాలు ఒకే ప్రకృతిలో ఎలా ఇమిడి ఉన్నాయో

**ప్రతి ఒక్కరిలోను అపారమైన అంతర్గత శక్తి ఉన్నది.**

అనిపిస్తుంది. కాని అది అవసరం. ఒకే ఇంట్లో ఎంతో పవిత్రమైన పూజగది ఉంటుంది, అదే ఇంట్లో అపవిత్రమైన లెట్రిన్ కూడా ఉంటుంది. ఆ రెండూ మనకు అవసరమే. ఏది లేకపోయినా పని జరగదు" అని శ్రీ అరవిందుల వారు తమ 'ఉపనిషత్' అనే పుస్తకంలో చెప్పారు.

శ్రీరామకృష్ణ పరమహంస తమ ఉపదేశంలో వివేకానందుల వారితో ఇలా అన్నారట "వేదోపనిషత్తుల్లోని వాక్యాలేవైనా మనకి అర్థం కాకపోతే అవి తప్పనుకోకూడదు. అది మన బుద్ధిలోని దౌర్బల్యం. వేదాలు పరమాత్మ వాక్కులు. అనుభవజ్ఞులైనవారిని అడిగి పరస్పర విరోధాలుగా అనిపించే వాక్యాలపై సందేహాలను నివృత్తి చేసుకోవాలి." అందుకే రెండవ శ్లోకంలో అర్జునుడు, **'తదేకం వద నిశ్చిత్య'.** నాకు కళ్యాణకరమైన విషయం ఒక్కటి నిశ్చయంగా చెప్పండి దేవా అని అడుగుతాడు. నిజమైన జిజ్ఞాస, ఉత్కంఠ కలిగినవాడు కాబట్టి అర్జునుడు తన వ్యాకులతను తెలుపుతూ, **'యేన శ్రేయోऽహమాప్నుయామ్'** అంటాడు. 'శ్రేయస్సు' అంటే రకరకాల సమృద్ధి మాత్రమే అని తప్పుగా అనుకుంటాము. ఇక్కడ అర్జునుడు అడిగేది, ఏ మార్గాన్ని అనుసరిస్తే తన తరానికి సర్వతోముఖమైన ఔన్నత్యం కలుగుతుందో, రాష్ట్రం ఉద్ధరింపబడుతుందో, దానిలో తన భాగమైన పుణ్యం అందుతుందో అది చెప్పమంటున్నాడు.

శ్రీ భగవానువాచ

**లోకేऽస్మిన్ ద్వివిధా నిష్ఠా ప్రోక్తా మయానఘ ।**
**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్॥ 3.3**

భగవంతుడు పలికెనూ ఓ అనఘ! (పాపరహితుడా) అర్జున! ఈ లోకమున రెండు నిష్ఠలు కలవని ఇంతకుముందే చెప్పియుంటిని. వానిలో సాంఖ్యయోగులకు జ్ఞానయోగము ద్వారా, యోగులకు కర్మయోగము ద్వారా నిష్ఠ కలుగును.

వేదాంతం మానవజాతి యొక్క కళ్యాణాన్ని కోరుకుంటుంది. పూర్ణత్వాన్ని అందించే విజ్ఞానమిది. గీతలో భగవంతుడు రెండు మార్గాల గురించి చర్చిస్తున్నాడు. మొదటిది సక్రియత - కర్మ మార్గం. రెండవది బుద్ధి ప్రధానమైనది, జ్ఞానవంతులను ప్రేరేపించేది.

ఇక్కడ భగవంతుడు అర్జునుడిని అనఘా (పాపంచేయనివాడు) అని పిలుస్తున్నాడు. ఎంతటి మధుర సంబోధన! అర్జునుడికి ఎన్నో పేర్లున్నాయి. కాని ఇక్కడ అతని విశుద్ధ భావాలు, నిర్మల అంతఃకరణపై రాజముద్ర వేసినట్టు సంబోధించాడు. రెండు రకాలైన నిష్ఠను గురించి చెప్తూ **జ్ఞానయోగాన్ని నిష్క్రియమైన, జడమైన బద్ధకస్తుల మార్గంగా భావించకూడదు.** శాస్త్రాల్లో చెప్పబడినటు వంటి నైష్కర్మం పారిపోయి గుహల్లో దాక్కోవడం, ఐశ్వర్యవంతమైన మఠాల్లోని భోగాలు అనుభవించడం కాదు. నైష్కర్మ్యాన్ని అడ్డుపెట్టుకుని అర్జునుడు యుద్ధం మానకూడదని, శ్రీకృష్ణుడు తర్వాతి శ్లోకంలో ఇలా చెప్తున్నాడు -

**న కర్మణామనారంభాన్నైష్కర్మ్యం పురుషోऽశ్నుతే ।**
**న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 3.4**

అన్ని కర్మలలోనూ కర్తృత్వభావం లేకుండా సర్వవ్యాపి సచ్చిదానంద పరమాత్మ యొక్క చింతనలో లీనమవ్వడాన్నే జ్ఞానయోగం - సాంఖ్యయోగం లేదా సన్యాసయోగం అంటారు. ఫలాన్ని ఆశించకుండా, ఆసక్తి లేకుండా, సమత్వభావంతో, భగవంతుని నిమిత్తమై చేసే కర్మలే గీతలో చెప్పిన కర్మయోగం. దీన్నే తదర్థకర్మ, మదర్థకర్మ, మత్కర్మ, సమత్వయోగం అని భగవంతుడు అనేక చోట్ల చెప్పారు.

యోగుల నిష్ఠ, కర్మయోగంలో ఉంటుందని; సన్యాసుల, జ్ఞానుల నిష్ఠ, జ్ఞానయోగంపై ఉంటుందని చాలా స్పష్టంగా చెప్పారు. కాని కర్మలు చేయకుండా ఎవరూ నైష్కర్మ సిద్ధిని పొందలేరు. కర్మలను వదిలేసినంత మాత్రాన జ్ఞాని అయిపోడు, సాంఖ్య నిష్ఠను సాధించడు. ఈ విధంగా కర్మలను వదిలేసి, అకర్మణ్యతతో ఎవ్వరూ దేన్నీ సాధించలేరు. **నేడు సమాజంలో కనిపించే ఫ్రస్ట్రేషన్, డిప్రెషన్, మానసిక రుగ్మతలన్నిటికి కారణం మనిషి పెద్ద పెద్ద కోరికలతో చేయలేని పెద్ద పెద్ద పనులు చేపట్టడం లేదా అసలు పనిచేయకుండా కూర్చోవడం.** కర్మలను ఆచరించి తీరాలి కాని ఫలాన్ని ఆశించకూడదు. అయితే అసలు కర్మలను ఆచరించడమెందుకు అని మనసులో అనిపిస్తుంది. అప్పుడు భగవంతుడంటాడు, ఏ మనిషైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా క్షణ మాత్రం కూడా కర్మచేయకుండా ఉండలేడు. ఎందుకంటే ప్రతి ఒక్కరు తమ ప్రాకృతిక గుణాలకు వశులై కర్మ చేసి తీరవలసిందే.

**న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్య కర్మకృత్**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః 3.5**

ఏ మనుష్యుడైనా ఏ కాలమునందైనా క్షణమాత్రము కూడా కర్మను ఆచరింపకుండా ఉండలేడు. ఇందులో ఎలాంటి

**అంతర్గత శక్తిని సమగ్రంగా వినియోగించుకుంటే వ్యక్తిత్వ వికాసం జరుగుతుంది.**

సందేహమునకు తావు లేదు. ఏలననగా మనుష్యులందరూ ప్రాకృతిక గుణములకు లోబడి కర్మలను చేయుటకు బాధ్యులగుదురు. ప్రతి వ్యక్తి కర్మను ఆచరించవలసినదే. నిజానికి కర్మ లేకుండా మనిషి అస్తిత్వమే లేదు. కర్మలను చేయకుండా బతికేవాడు తన అస్తిత్వాన్ని పోగొట్టుకుంటాడు. కర్మలను అవమానించిన వాడు జీవనదేవతని అవమానించినట్టే. మనిషి యొక్క కర్మలు అతని అంతఃకరణలోని కోరికలకు అనుగుణంగానే ఉంటాయి. కోరికలు సాత్విక, రాజస, తామసం అని మూడు రకాలు. మన లోపలి నుండే సత్వ, రజ, తమో గుణాలు ఉత్పన్నమవుతాయి. మనమెప్పటికి నిష్క్రియంగా ఉండలేము. జీవితం ఎప్పుడూ సక్రియంగా సకారాత్మక (Positive) స్వరూపాన్ని కలిగి ఉంటుంది. నిజానికి కర్మల రూపంలోనే జీవనగతి వ్యక్తమవుతుంది. మనిషి జీవించినంత కాలం ఒక్క క్షణం కూడా కర్మ చేయకుండా ఉండలేదు. అంటే అర్థం కర్మలు ఆగిపోతే మనిషి మరణిస్తాడు. మరోవిధంగా చెప్పాలంటే అకర్మణ్యుడైన మనిషి నడుస్తున్న శవంతో సమానం. కర్మలను వదిలేసి పారిపోవడం అంటే స్వయంగా మృత్యుముఖంలో ప్రవేశించడమే. ఇది ఒక రకంగా ఆత్మహత్య.

గీతలోని సందేశం స్పష్టంగా ఉంది. ఎప్పుడూ కర్మ చేయకుండా ఉండకూడదు. సమాజ సేవ చేయచ్చు, రాష్ట్ర గౌరవాన్ని పెంచే పనులలో సహాయపడచ్చు, మానవజాతి పడే కష్టాలను తొలగించడానికి తపించవచ్చు. నిజానికి ఇదే జీవితం. మెల్లిగా పనులు చేయడం, పనులు మానేసి పారిపోవడం, స్ట్రైకులు చేయడం, ధర్నాలు చేయడం, పని ఎగ్గొట్టడానికి ఆలోచించడం, ఇవన్నీ మెల్లిగా మృత్యుముఖానికి తీసుకుని వెళ్తాయి. జీవిత సౌందర్యాన్ని హరిస్తాయి. సమాజవ్యవస్థకు విరుద్ధంగా పనులు చేసినట్లైతే నిజానికి జీవన దేవతను కించపరిచినట్టవుతుంది, ఆత్మ గౌరవానికి విరుద్ధంగా జీవిస్తున్నట్టే. జీవన పోరాటంలోని ఒడిదుడుకులను ఎదుర్కుంటూ, సక్రియంగా, ఉద్యమకారుడివలె జీవించడమే మనిషికి గౌరవాన్నిస్తుంది. కష్టానికి ఒరవకూడదు. నిరాశను ఎదుర్కోడానికి సంకోచించకూడదు. బ్రతికున్నంతకాలం క్షణ క్షణం జీవించు. పని చేసి ఎదుగు, పనుల వల్లనే ఉన్నతి సాధించు. గీతకారుడి జీవితం ఒక కళాకారుడి జీవితం, నవ్వుతూ-నవ్విస్తూ, వికసిస్తూ-వికసింపజేస్తూ ఆనందంగా జీవించమని చెబుతుంది గీత. గీత సన్యాసుల పాఠ్య పుస్తకం కాదు అని చెప్పడానికి ఇదే నిదర్శనం. గీత జీవించే కళను నేర్పుతుంది. ఉపనిషత్తుల్లో చెప్పినట్టు. **'కుర్వన్నైవేహ కర్మాణి జిజీవేషఛ్ఛతాం సమాః',** కర్మలను ఆచరిస్తూ నూరేళ్ళు జీవించాలనే కోరిక కలిగి ఉండాలి అని చెపుతుంది.

వచ్చే సంచికలో మిథ్యాచారం వీడి మనస్సుపై పూర్తి పట్టుతో కర్మలను ఆచరించడమే శ్రేష్ఠమైన యోగమని చదువుతాం.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 2000*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## తన్మయత్వం


*కబీరు గాయకుడు. అతని కుమారుడు నర్తకుడు. ఇద్దరూ కలిస్తే పరిసరాలు పరవశించేవి. ఇంతటి అద్భుత నృత్యం కమాల్ ఎక్కడ నేర్చుకున్నాడా అని కబీరుకి చాలా ఆశ్చర్యం కలుగుతూ ఉండేది. ఒకరోజు గడ్డి కోసుకురావటానికి వెళ్ళిన కమాల్ రాత్రి పొద్దుపోయేవరకు ఇల్లు చేరకపోవడంతో కబీరు అతనని వెతుక్కుంటూ బయలుదేరాడు. కొంత దూరం వెళ్ళి చూచేసరికి గడ్డి పోగు పెట్టబడి ఉన్నది. చుట్టూ వాతావరణం రమణీయంగా ఉన్నది. మలయమారుతం వీస్తున్నది. సెలయేళ్ళ లయబద్ధంగా ప్రవహిస్తున్నాయి. వీచేగాలి, ప్రవహించే నీటి గలగలలు, గాలికి ఊగుతున్న పచ్చగడ్డితో కలిసి కమాల్ మైమరిచి ఆనందంతో నృత్యం చేస్తున్నాడు. అతనిని బాహ్యస్మృతి లేదు. ఆ స్థితిలో ఈ తన్మయ స్థితే తన బిడ్డను ఇంతటి నాట్యాచారుడిని చేసిందనే సత్యాన్ని కబీరు తెలుసుకున్నాడు.*

*శిల్పులు, చిత్రకారులు, కార్మికులు పూర్తి ఏకాగ్రతతో పనిలో లగ్నమవడం వలన ఆకర్షణీయమైన, అందమైన ఆకృతులను సృష్టించగలుగుతారు. వ్యక్తుల క్రియాకలాపాలు ఒకే విధమైనవి అయినా వాటి పరిణామాలు భిన్నంగా ఉండటానికి కారణం ఏమిటంటే కొందరు పూర్తిగా పనిలో లీనమైపోతుంటారు. కొందరు ఏదోవిధంగా తోచినట్లు చేస్తూ కాలం గడుపుతుంటారు.*

*నిరాశకు లోనుకాకుండా, సదా తత్పరతతో పనిలో లీనమైపోయేవారిని కర్మయోగులంటారు. వారి చేతిలో ఏ పనైనా పెట్టండి. అది అందంగా రూపుదిద్దుకుంటుంది. ఇటువంటి పురుషార్థ పరాయణులు తాము చేసే వృత్తి ఏదైనా దానిలో ఉచ్ఛస్థితి చేరుకుని తమ జీవితాన్ని, వృత్తిని ధన్యం గావిస్తారు.*

*– ప్రజ్ఞా పురాణం నుండి*

**ప్రతి ఒక్కరికి ఎదగగల సామర్థ్యం ఉన్నది.**



సూర్య విజ్ఞానం - 10

# రిద్ధి సిద్ధుల ద్వారం నాభి చక్రం - సూర్యచక్రం

యోగ శాస్త్రంలో నాభి సూర్యచక్రంగా చెప్పబడింది. వైజ్ఞానికులు పరమాణువులోని న్యూక్లియస్‌కు ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో, **సూర్యమండలంలోని సూర్యునికి ఎంత మహత్త్వం ఇచ్చారో, శరీరములో నాభికేంద్రానికి అంత మహత్త్వం ఇవ్వబడింది.** శరీర శాస్త్రజ్ఞులు దీనిని పూర్తిగా అర్థం చేసుకోలేక పోవడం వల్ల అంత మహత్వాన్ని ఇవ్వలేదు. కాని ఆత్మవిజ్ఞానులు దీని ఆకర్షణ శక్తి జీవితాంతం ఉంటుందని గుర్తించారు. **ఆత్మవిద్య మర్మం తెలిసిన వారు చెప్పేదేమిటంటే మానవీయ ప్రాణం మొదట నాభికేంద్రం వద్ద స్పందించిన తరువాతనే హృదయం కొట్టుకోవడం ప్రారంభిస్తుంది.** హృదయంలోను, ఊపిరితిత్తులలో రక్తం శుద్ధి చేసి శరీరమంతా ప్రవహింపచేసేందుకు సహాయం చేస్తుంది.

కాని ఇది ప్రాణం యొక్క స్వాభావికమైన క్రియ మాత్రమే. ఎప్పుడయితే మానసిక సంకల్పంతో, అంశ్చేతనతో కలిపినట్లయితే అప్పుడు అది అధిక చైతన్యవంతం, శక్తివంతం అయి సాధకుని శక్తి సంపన్నుని చేస్తుంది. మామూలుగా గాలిలో ఎక్కువ శక్తి ఉండదు. కాని దానిని బెలూన్‌లో నింపినట్లయితే అధిక శక్తి శాలి అవుతుంది. అదే విధంగా **మనస్సును సంకల్పంతో, చేతనత్వంతో, ప్రాణంతో కలిపినట్లయితే అది అధ్యాత్మిక శక్తిగా రూపొందుతుంది.**

వైజ్ఞానిక దృష్టిలో కూడా నాభి ప్రాణం యొక్క ఉద్గమ స్థానం. గర్భాశయంలో భ్రూణం (శిశువు) యొక్క పోషణ తల్లి శరీరం నుంచి జరుగుతుంది. **నీటి బుడగవలె జీవనాన్ని ప్రారంభించిన భ్రూణం పెరగడం జరుగుతుంది. నిరంతరం అవసరమయ్యే పోషణ తల్లి శరీరం నుంచి తన నాభి ద్వారా అందుతుంది.** తల్లి రక్తం ద్వారా పక్వమైన ఆహారాన్ని నిరంతరం ప్రాప్తించుకుని గర్భంలోని శిశువు తన వికాస యాత్ర ప్రారంభిస్తుంది. ప్రసవ సమయంలో ఏ ప్రేగును త్రుంచి తల్లి శిశువులను వేరేచేస్తారో, అదే ప్రేగు ద్వారా తల్లి శరీరాన్ని నుండి కావలసిన రస ద్రవ్యములు బాలకుని శరీరంలోనికి వస్తూ ఉంటాయి. నవమాసముల అవధిలో తల్లి గర్భంలోని శిశువు తన అవసరాలన్నీ నాభిమార్గం ద్వారానే పొందుతాడు.

శిశువు పుట్టగానే ఏడుస్తూ, కాళ్ళు చేతులు కొట్టుకోవడంలో రక్త ప్రసరణ ప్రారంభమవుతుంది. హృదయంలోనుంచి రక్తం ఊపిరితిత్తులలోకి వెళ్ళగానే అవి తమ పనిని ప్రారంభిస్తాయి. వాతావరణం నుంచి ప్రాణవాయువును లాక్కుని అప్పుడే పుట్టిన శిశువు తన స్వావలంబన (తన మీద తాను ఆధారపడడం) మొదటి అడుగు వేస్తుంది. తల్లి గర్భంలో ఉన్నప్పుడు "ప్లాసంటా" (ప్రేగు) ద్వారా అన్నీ అందుతున్నప్పుడు ఊపిరితిత్తుల అవసరం లేదు. తల్లి పిల్లవాడి మధ్యనున్న సంబంధాన్ని (ప్రేగును), విచ్ఛేదం (cut) చేసి వేరుచేయబడినపుడు, అప్పుడే పుట్టిన ఆ శిశువు తన జీవన యాత్రను స్వతంత్రంగా ప్రారంభిస్తుంది. తల్లి యొక్క అవసరం తీరగానే ఆ కేంద్రం యొక్క ఉపయోగం కూడా ఏమి ఉండదు. చికిత్సకుల దృష్టిలో ఈ నాభికేంద్రం ఒక సామాన్యమైనదిగా భావించబడుతున్నది. వారి దృష్టిలో నాభి యొక్క పని పూర్తయింది. ఒక పనికిరాని నిష్క్రియ సూత్రం (లిగమెంట్ తెరెస్) ద్వారా నాభి లివర్‌తో కలుపబడి ఉన్నది. కాని లివర్ మీద ఎప్పుడయినా ఒత్తిడి పడినప్పుడు రక్త ప్రవాహం పెరిగి ఈ నిష్క్రియ సూత్రం జీవం పోసుకుంటుంది.

ఇంతకు చెప్పేదేమిటంటే నాభి ఒక సక్రియమైన (active) కేంద్రమని, గర్భస్థ శిశువు యొక్క వికాసంలో సహాయ సహకారం అందిస్తుందని, తరువాత కూడా అది నిష్క్రియమవదు. (పని లేకుండా ఉండదు). అజ్ఞా చక్రమును సూక్ష్మ శరీరమునకు కేంద్రముగా భావించినట్లే స్థూల శరీరమునకు న్యూక్లియస్ నాభికేంద్రం సూర్యచక్రం. ఈ కేంద్రాన్ని శక్తివంతంగా చేయడం ఆరోగ్య శరీరానికి చిహ్నము. దీని సామర్థ్యం వల్లనే సమీపంలో ఉన్న అవయవాలు ప్రాణవంతమవుతాయి. నాభిచక్రం యొక్క క్రిస్టల్‌లో ఇచ్చిపుచ్చుకోవాలనే ఉభయ పక్షములు ఉంటాయి. వాతావరణంలో వ్యాపించి ఉన్న ధ్వని తరంగాలను ట్రాన్సిస్టర్ యొక్క క్రిస్టల్ పట్టుకుని మనం వినగలిగే ధ్వనులుగా చేస్తుంది.

నాభికేంద్రమే బ్రహ్మీచేతన యొక్క న్యూక్లియస్. అనంతమైన అంతరిక్షం నుండి కావాలసిన శక్తులను ఆకర్షించుకుని, వాటిని శరీరం యొక్క సమస్త అంగములలో ప్రవహింపజేయడమే దీని పని అని యోగవిజ్ఞానం చెపుతుంది. శరీర శాస్త్రజ్ఞులు దీని ఉపయోగం ఇంతగా అర్థం చేసుకోలేదు కాని యోగ విజ్ఞానదృష్టిలో దీని ఉపయోగం జీవిత కాలమంతా ఉంటుంది. దీని అయస్కాంత

**అంతర్గత శక్తి ఎంత వినియోగించినా తరిగిపోని వనరు.**

శక్తిని సాధనా ప్రణాళికతో మేల్కొలిపితే తన ప్రఖర ఆకర్షణ సామర్థ్యంతో గొప్ప అనుదానాలను (బహుమతులను) ప్రసాదించగలదు. ఇవి స్థూల పదార్థముల కంటే వేలరెట్లు ఉపయోగకరమైనవి.

చికిత్సా శాస్త్ర దృష్టిలో నాభి కేంద్రానికి చుట్టు ప్రక్కల తొమ్మిది మహత్వపూర్ణమైన అంతఃస్రావ గ్రంథులు ఉన్నాయి. అవి శరీరగతమైన పనులను, రక్త ప్రవాహమును, జీర్ణ వ్యవస్థలో సహాయం చేసే ఎంజైములను, ఇతర రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. లంబార్, సేక్రల్, కాక్సిజియల్ గాంగ్లియానులు, వీటి దగ్గరనున్న ప్లెక్సస్‌లు, లివర్, జీర్ణమండలం, ప్లీహం (spleen), మూత్ర పిండములు మొదలైన మహత్వపూర్ణ అంగములను పనిచేయిస్తాయి. క్రొత్త శరీరాన్ని నిర్మాణం చేసే గొనాడ్స్ (జననేంద్రియాలు) ఈ కేంద్రాల నియంత్రణలో పనిచేస్తాయి. వీటన్నింటికి ఫలశృతిగా కనిపించే ఎముకలతో, కండరాలతో కనిపించే భౌతిక శరీరం అన్నమయకోశం ఆధీనంలో ఉంటుంది. కాని ఇది స్వయంగా కోశం కాదు. అన్నమయ కోశం కంటికి కనిపించనప్పటికి దీనిలో ఎన్నో రహస్యాలు ఉన్నాయి. సూర్యచక్ర జాగరణతో వీటిని తెలుసుకోవడం సాధ్యమవుతుంది.

మనుష్యుని ప్రాణ శరీరంలో మూడు ముఖ్యమైన నాడులు ఉన్నాయి. అవి ఇడా, పింగళ, సుషుమ్న. ఇడా పేరా సింపథిటిక్ సిస్టం యొక్క ప్రతినిధిత్వం చేస్తుంది. ఇది మనిషి యొక్క శాంత, అంతర్ముఖి మనోగతమైన పక్షం. పింగళ సింపథిటిక్ సిస్టం యొక్క ప్రతినిధి. ఇది జీవి యొక్క సక్రియమైన బహిర్ముఖి శరీరగత పక్షం. ఈ రెండింటి పరస్పర సంతులతతోనే శరీరంలోని భాగములన్నీ సక్రమంగా పనిచేస్తాయి. జీర్ణక్రియకు అవసరమైన ఊర్జా (శక్తి) ఈ రెండు నాడుల ప్రవాహంతో తయారవుతుంది.

నాభి వెనుకనున్న సూర్యచక్రం (సోలార్ ప్లెక్సస్) నుండే అన్ని ప్రముఖమైన ధారలు విభిన్న అంగాలకు వెళ్తాయి. దీనిని ఒక రకంగా ఒక జంక్షన్ స్టేషన్‌గా భావించవచ్చు. ఇక్కడి నుండి అనేక రైలు మార్గాల వంటివి విభిన్న దిశలలో వెళ్తాయి. మొత్తం శరీరం యొక్క పరిస్థితి ఈ కేంద్రం మీద ఆధారపడి ఉన్నది.

సూర్యచక్రం ప్రాణప్రవాహ జంక్షన్ మాత్రమే కాక అచేతన మనస్సు యొక్క సంస్కారాల కేంద్రం కూడా. కాని సాధారణంగా ఈ మహత్వపూర్ణ కేంద్రం లుప్తావస్థ (నిద్రావస్థ)లో ఉంటుంది. అందువల్ల ఈ శక్తి యొక్క జ్ఞానం సామాన్య జనులకు తెలియదు, అందువలన దాని లాభం పొందలేరు.

ప్రతి చక్రం ఏదో తత్వంతో విశేష సంబంధం కలిగి ఉంటుంది. ప్రభావితం అవుతుంది. దీనిని సక్రియంగా (activate) చేయడానికి ఒక ప్రత్యేక రంగును ధ్యానం చేయవలసి వస్తుంది. సూర్యచక్రం అగ్నితత్వ ప్రధానమైనది. దీనిని జాగృతం చేయడానికి పీతవర్ణ (పసుపు పచ్చని) కమలమును ధ్యానం చెయ్యాలి. వాస్తవంగా ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, వంకాయ రంగు, తెలుపు రంగులకు సూర్యజ్యోతి ఏడు రంగులతో సంబంధమున్నది. చక్రములలో ప్రత్యేకమైన రంగును మానసికంగా ధ్యానం చెయ్యడం వలన, సంబంధించిన జ్ఞాన తంతువులను, మస్తిష్కాన్ని ప్రభావితం చేసి, శరీరంలో ఉన్న వ్యష్టి ప్రాణమును, సమిష్టి ప్రాణముతో జోడింపచేస్తుంది. బ్యాటరీ డిశ్చార్జి అయిపోతే, దానిని జనరేటర్‌తో లేదా ఇంకో విధంగా రిఛార్జి చేసి శక్తివంతం చేయవచ్చు. చిన్న షాపులో వస్తువులు అయిపోతే పెద్ద షాపుల నుంచి తెచ్చుకుంటారు. అదేవిధంగా విశ్వంలోని అనంత శక్తుల భాండారాల సమిష్టి ప్రాణం నుంచి వ్యష్టి ప్రాణ కేంద్రం మణిపూర చక్రం (సూర్యచక్రం) ద్వారా కావలసిన శక్తిని ఆకర్షించుకుని, అవసరాన్నిబట్టి ఉపయోగించుకోవచ్చు. సామాన్య వ్యక్తితో పోలిస్తే అనేక రెట్ల ఉత్కృష్ట కార్యములు చేయవచ్చు.

**సూర్య చక్రాన్ని జాగృతం చేయడానికి ఉదయం సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు సాధన చేసే విధానమున్నది. ఒక పవిత్రమైన ఏకాంత స్థానంలో పద్మాసనంలో కూర్చోవాలి. వెన్నెముక నిటారుగా ఉంచుకుని 10 నుండి 20 సార్లు బాగా లోతుగా శ్వాస తీసుకోవాలి. లేకపోతే 3-5 నిమిషాల నాడీ శోధన ప్రాణాయామం చెయ్యాలి. దీనివల్ల సుషుమ్నలో ప్రాణ సంచారం ప్రారంభమవుతుంది. దీని తరువాత వెన్నెముకను బాగా నిటారుగా ఉంచుకుని అజప గాయత్రి (సోహం) శ్వాసతో పాటు ఐదు నిమిషాలు మౌనంగా జపం చేయాలి. తరువాత తమ నాభి వెనుక మేరుదండంపై ఉన్న సూర్యచక్రంలో మెరుస్తున్న పసుపు పచ్చని కమలమును మానసికంగా ధ్యానంచేస్తూ దానిలో తన్మయత్వం పొందాలి.**

**ఈ తన్మయస్థితిలో సూర్యచక్రం జాగృతమవుతుందనే భావన తీవ్రంగా చేయాలి. పసుపు వర్ణపు కమలం నుంచి వెలువడుతున్న ప్రకాశ కిరణములు నాభి సంస్థానాన్ని ప్రకాశవంతం చేస్తున్నదనే తీవ్రమైన భావనలో లీనమై శ్వాసను హృదయంలోనికి, ఊపిరితిత్తులలోనికి తీసుకుంటూ పొట్ట నింపాలి. ఈ ప్రక్రియతోపాటు ఆరోగ్యాన్ని, సుఖశాంతులను, ప్రాణశక్తిని,**

**ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదిగే ఆరాటము, ప్రయత్నమే వ్యక్తిత్వ వికాస ప్రక్రియ.**

**స్ఫూర్తిని సఫలతల, సిద్ధుల పరమాణువులను, సమిష్టి ప్రకృతి యొక్క భాండాగారం నుంచి ఆకర్షించుకుంటున్నాను. అవి సూర్య చక్రంలో సంగ్రహించబడుతున్నవి" అనే భావన చెయ్యాలి. 5-10 నిమిషాలపాటు శ్వాసను సూర్యచక్రంలో ఉంచిన తరువాత ఇలా భావన చెయ్యాలి. "నా ప్రాణం ఊర్ధ్వగామి అయి సమస్త అంగ ప్రత్యంగాలలో వ్యాప్తి అయి, వాటికి ప్రకాశం అందుతున్నది"**

**ఈ ఆటో సజెషన్‌తోపాటు శ్వాసను నెమ్మది నెమ్మదిగా వదులుతూ సూర్యచక్రం నుండి ప్రాణం యొక్క స్పందన మేరుదండం పైపైకి వెళ్తునట్లు భావన చెయ్యాలి. ఒక రెండు నిమిషాలు విశ్రమించి తిరిగి ఇదే విధంగా 5-10 సార్లు చెయ్యాలి. శ్వాస తీసుకోవడం, వదలడం ఎంత నెమ్మదిగా ఉండాలంటే శ్వాస శబ్దం వినిపించకూడదు. పరిపూర్ణ శ్రద్ధ విశ్వాసాలతో సుఖంగా శాంతంగా పైన చెప్పిన విధానాన్ని ఆచరించడం అత్యంత అవసరం. ఒకటి రెండు నెలలు పద్ధతి ప్రకారం సాధన చేసిన తరువాత శరీరంలో, మనస్సులో, మస్తిష్కంలో మార్పు తెలుస్తుంది.** ఈ మార్పులు భావనలకు తగిన విధంగానే మనస్సు, బుద్ధి వికసిస్తున్నాయని అర్థమవుతుంది. ఈ సాధన ఎక్కువ కాలం దృఢ సంకల్పంతో చేయడం వల్ల సాధకుని మనస్సులో, మస్తిష్కంలో విద్యుత్ అయస్కాంత తరంగాల ప్రవాహం మొదలవుతుంది. సాధకుడు చుట్టుప్రక్కల అతనికి సంబంధించిన వాతావరణాన్ని ప్రభావితం చేయగలుగుతాడు.

సంతులు, మహాత్ముల సాన్నిధ్యంలో ఇటువంటి ఆకర్షణీయమైన వాతావరణ ప్రభావాన్ని సహజంగానే అనుభూతి చెందవచ్చు. పైన చెప్పిన విధంగా సూర్యచక్రాన్ని, అనాహత చక్రంతో సంబంధం స్థాపించుకుని సర్వతోముఖమైన ఉన్నతిని పొందడానికి, లక్ష్యం దగ్గరకు చేరడానికి మార్గాన్ని ప్రశస్తం చేసుకొనవచ్చు.

సాధనను ఉపేక్షిస్తే నాభియందలి సూర్యుని అమృతత్వం పతనం చెందుతుంది. క్రమక్రమంగా సాధనా ప్రక్రియను చేపట్టి తేనెటీగల వలె అమృతాన్ని ప్రోగు చేసుకుని తన యొక్క ఇతరుల యొక్క సుఖాన్ని పెంపొందించుకోవచ్చు. ఆత్మవిద్య ప్రకారం సూర్య చక్రమును సాహసం, పరాక్రమం, ప్రతిభల కేంద్రంగా భావిస్తారు. సూర్యచక్రంలో ధ్యాన సాధనతో ప్రాణశక్తిని పెంపొందించుకుని, కావలసిన దిశలో ఉపయోగించుకోవచ్చు. ఫల స్వరూపంగా దీని సత్పరిణామం ఓజస్సు యొక్క వృద్ధిగా మనకు కనిపిస్తుంది.

*- అఖండజ్యోతి, జూన్ 1993*

## ఇచ్చేవారెప్పుడూ నష్టపోరు

*ఇచ్చే వ్యక్తి తిరిగి ఫలితాన్ని పొందుతాడు, ఇవ్వటం నిలిపివేస్తే అది కుళ్ళి పాడవుతుంది. ఇది ప్రకృతి నియమము. చిన్న చెఱువు నందలి నీరు తరిగిపోయి, చెడిపోయి, ఎండిపోతుంది. కానీ వాగునందలి నీరు స్వచ్ఛంగా చల్లగా మరియు అక్షయంగా కూడా ఉంటుంది.* ***ఇవ్వటానికి తిరస్కరించే వ్యక్తి ప్రకృతి యొక్క నియమాన్ని ఉల్లంఘించి, కూడబెట్టుటలో నిమగ్నుడైతే అతనికి కొద్దిగానే దక్కుతుంది.*** *అంతులేని అనుదానములు పొందగల పాత్రత అతనికి ఉండదు.*

*భూమి తన జీవనతత్త్వమును వనస్పతులకు అందిస్తుంది. అనాదికాలమునుండి ఈ క్రమము నడుస్తూనే ఉన్నది. అయినా ధరిత్రి యొక్క కోశాగారము తరుగలేదు. వనస్పతులు కుళ్ళిన తరువాత తయారైన ఎరువు మరియు వర్షపు నీరు భూమిని సారవంతం చేస్తున్నాయి. ఇస్తూ ఉండాలనే కోరిక భూమి మూర్ఖత్వము కాదు. ఇచ్చేవారిని ప్రకృతి ఎప్పుడూ సంపూర్ణంగా అనుగ్రహిస్తూనే ఉంటుంది.*

*వృక్షములు- ఆకులు, పూలు, ఫలములను ప్రాణులకు ఇస్తూనే ఉంటాయి. చెట్టు యొక్క వేర్లు భూమి లోతుల లోపలి నుండి సారమును గ్రహించి దానికి కావల్సిన శక్తిని అందిస్తాయి. సముద్రము మేఘములకు నీటిని అందిస్తుంది. ఆ లోటును నదులు తమ జలాన్నిచ్చి తీరుస్తాయి. మేఘములు వర్షిస్తాయి. ఆ మేఘములను సముద్రుడు ఎండిపోనివ్వడు. హిమాలయములు తమ మంచును కరిగించి నదులకు జలాన్ని అందిస్తాయి. నదులు నీటితో భూమిని తడుపుతాయి. నదులకు జలాన్ని అందించటం వలన హిమపర్వతములలో మంచుకు లోటు రాకుండా వాటి మీద మంచు పేరుకొనే క్రమమును ఎప్పటినుండో ప్రకృతి ఏర్పాటుచేసింది.*

***ఈనాడు ఇచ్చినది భవిష్యత్తులో అసంఖ్యాకముగా పెరిగి వేల రెట్లుగా తిరిగి మనకు లభిస్తుంది. ఎప్పుడు మనకు తిరిగి లభిస్తుంది? అనేదాన్ని లెక్కించకండి. ఇచ్చేవారి చేతులు ఖాళీ అవ్వవు అని విశ్వసించండి. ఇచ్చేవారిని ప్రకృతి సంపూర్ణంగా అనుగ్రహిస్తుంది.***

ఏ వయస్సు వారయిన వ్యక్తిత్వ వికాసం కొరకు ప్రయత్నం చెయ్యవచ్చు.

గురుపూర్ణిమ ప్రత్యేకం

# సద్గురు కృప అవతరించిన మహా పర్వదినం

మనం ఎవరమైనా, ఎలాంటి వారమైనా, మన జీవితంలో గురువు అత్యంత అవసరం. గడిచిపోయిన గతాన్ని గుర్తు చేసుకున్నా, వర్తమానాన్ని గమనించినా, భవిష్యత్తును తలుచుకున్నా ఇదంతా ఒక సాకార ప్రశ్నలాగా గోచరిస్తుంది. జీవన సార్థకతకు మనకు దిశ, ఉద్దేశ్యం, లక్ష్యం చాలా అవసరమని ఈ ఆత్మ సమీక్షలో తేలుతుంది. వీటిలో ఏది లేకపోయినా మన జీవితమంతా అడ్డదోవ పట్టినట్టే. చాలా వరకు జీవితాంతం ఏవేవో సుఖల్లో సార్థకతను వెతుక్కునే ప్రయత్నం చేస్తూంటాము, చివరికి ఈ సుఖాలన్నీ భ్రమే అని గుర్తించి మునలితనంలో మోసపోయామని తెలుసుకుంటాం. ఇప్పటివరకు చేసింది, సంపాదించింది అంతా అవసరమైనవి, అర్థం లేవని అనిపిస్తుంది.

జీవితాంతం ఒక్క క్షణం కూడా తీరిక దొరకలేదు, ప్రశాంతత లేదు అంటూనే ఉంటాం. తెలిసో తెలియకో దేన్నో వెతుకుతూ ఉంటాం. ఎన్నో తలుపులు తడుతూ ఉంటాం, కాని ఏదీ సాధించం. డబ్బు, ప్రతిష్ఠల కోసం వెంపర్లాడుతూ ఉంటాం. అవి దొరికినా కూడా తృప్తి కలగదు, సంతోషం రాదు. మనం ఊహించుకున్న సుఖ సంతోషాలు, సాఫల్యం పొందడానికి కావలసిన వస్తువులన్నీ, అందం, ఐశ్వర్యం, మొదలైనవన్నీ దొరికినా కూడా ఏదో అసంతృప్తి వెంటాడుతూనే ఉంటుంది. దొరికినవన్నీ పోతాయనే భయం, ఏకాంతంగా ఉన్నప్పుడు వృద్ధాప్యం, మృత్యువు దగ్గరపడుతున్నాయనే భయం. ఈ వ్యాకులత మనస్సును, మస్తిష్కాన్ని కూడా ముక్కలు ముక్కలుగా చేస్తుంది.

సర్వసామాన్యంగా అందరూ ఇలా తప్పుదోవపట్టే వాళ్ళే. జ్ఞానులు మాత్రమే జీవన సందేశాన్ని అర్థం చేసుకుంటారు. భౌతిక సుఖ సంతోషాలే కాక అవసరమైన వస్తువులు చాలా ఉన్నాయని అటువంటి వారే భావిస్తారు. ఈ జ్ఞానం వారిని అంతర్ముఖుల్ని చేయడం వల్ల వారు మరింత అర్థవంతమైన సంబంధాలను వెతుకుతారు. ఈ జ్ఞానమే వారిని అంతరాత్మను వెతకాలని ప్రేరేపిస్తుంది. అప్పుడు గాని ఈ జగత్తు, గుణాలు అసలు సమస్యలు కావని, నిజమైన సమస్య మనలోనే ఉందని తెలుస్తుంది. మన సామాన్య జీవనశైలి ద్వారా ప్రాపంచిక వస్తువులు నిత్యమైనవని, పరివర్తనా రహితమైనవని, అత్యవసరమైనవని నిరూపించడానికి ప్రయత్నిస్తూంటాము. కాని నిజానికి అది మన దృష్టికోణంలోని దోషం. ఈ ప్రపంచంలో స్థిరత్వం, జడత్వం అనేది అసలు లేదు. ఈ ప్రపంచమంతా నిరంతరం తిరుగుతూనే ఉన్నది. సృష్టి, స్థితి, లయం ఇవి ప్రకృతి నియమాలు. మనలో ఎవ్వరమూ దీన్ని ఆపలేము. అయినప్పటికి పూర్ణమైనది, అనంతమైనది, శాశ్వతమైనది అయిన మరో తత్త్వం మనకు అందుబాటులో ఉంది. ఈ తత్త్వం స్వయంగా మనలోనే నెలకొని ఉన్నది. దీని కోసం బయటెక్కడో వెతకవలసిన అవసరం లేదు. జ్ఞానులు దీన్నే ఆత్మ అన్నారు. పరమసత్యమైన ఈ ఆత్మ మనకు శాశ్వత సుఖాన్ని అందించడానికి ఆహ్వానిస్తూనే ఉంటుంది. ఈ నిరంతర ఆహ్వానాన్ని మనం మన్నించకపోవడానికి ఒకే ఒక కారణం సద్గురువు లేకపోవడం.

అంతరాత్మను చేరుకునే ఈ దారి పెద్దది, కష్టాలతో నిండినది, కత్తిమీదసాము వంటిది, అదృశ్య ఆపదలతో నిండినది. ఇటువంటి దారి గురించి మనకేం తెలుస్తుంది? ఆపదలతో నిండిన ఇంత పెద్ద తోవలో ఎలా ప్రయాణించాలి అనేది కాదు ప్రశ్న, అసలు లక్ష్యం ఏంటి అనేదే మనకు తెలియదు. అందుకే గోస్వామి తులసీదాసు, **'గురు బినా హోహీ న జ్ఞాన్'** (గురువు లేకపోతే జ్ఞానం లేదు) అన్నారు. గురుశిష్య సంబంధాలను కనుక్కున్న మహాత్ములకు ప్రాపంచిక, సామాజిక సంబంధాల ప్రాపంచిక పూర్ణజ్ఞానం ఉండేది. సామాన్య వ్యక్తి మనకెంత దగ్గరి బంధువైనా మనకు మార్గదర్శకుడు మాత్రం కాలేడు. ప్రాపంచిక దృష్టిలో అతనికి డబ్బు, హోదా, పరపతి లేకపోయినా పరమ ప్రజ్ఞావంతుడు, అనుభవజ్ఞుడు అయిన వ్యక్తి గురువుగా అవసరం.

చాలా మంది అసలు గురువు అవసరం లేదు, నిజమైన గురువు మనలోనే ఉన్నాడని వాదిస్తూంటారు. సిద్ధాంతపరంగా ఇది నిజం కూడా. కాని అంతఃకరణలో నెలకొని ఉన్న సద్గురువు మాటను మనలో ఎంతమంది వినగలం, అర్థం చేసుకోగలం, అర్థం చేసుకుని ఆచరించగలం? మానవుని మనస్సు వాసనలు, కోరికలు, ఆకాంక్షల సంగమం. ఇంతటి అలజడిలో అంతః కరణలోని సద్గురువాణి వినడం ఎంత వరకు సంభవం? అది ప్రశాంతమైన నిశ్చలమైన వాణి. నిశ్చలమైన ఆ వాక్కులు

**వ్యక్తిత్వ వికాసానికి స్వ సమీక్ష అవసరం.**

వినాలంటే ముందు మనలోని కోలాహలాన్ని రూపుమాపాలి. కాని మనస్సు యొక్క స్వాభావిక సంరచనను కూడా మనం అర్థం చేసుకోలేం. ఆసక్తి, కోపం, ఈర్ష్య, ద్వేషం, వాసనలు అసలెందుకు వస్తాయో కూడా మనకు తెలియదు. కాబట్టి ఈ కోలాహలాన్ని ఎంత అణిచివేయాలని చూస్తే అంతటి తీవ్రంగా తిరిగి వినిపిస్తూంటుంది.

**ఈ ఆంతరిక అశాంతిని పోగొట్టుకోవటానికి మనకు గురువు చాలా అవసరం. శరీరం, మనస్సు, అంతరాత్మలను నియంత్రించగలది వారొక్కరే.** మన ఆత్మవికాసానికి అడ్డువచ్చే నకారాత్మక (negative) మానసిక ప్రవృత్తులను తొలగించుకునే మార్గం వారొక్కరే మనకు చూపించగలరు.

గురువు వెలుగుతున్న జ్ఞాన కాగడ. భౌతిక శరీరధారి అయినప్పటికీ వారి ఆత్మ ఉన్నతమైన అజ్ఞాత జగత్తులో విహరిస్తూంటుంది. వారు తమ కోసం కాక మన కోసం ఈ పృథ్వితో సంబంధం పెట్టుకుంటారు. వారికి స్వార్థం ఉండదు. వారికి కోరికలూ ఉండవు. కాంక్షలూ ఉండవు. గురువే జీవితానికి పూర్ణత్వాన్నిస్తారు. వారు స్వయంగా పవిత్ర, శాంత, ప్రేమ, జ్ఞాన స్వరూపులు. వారు సాకారులు, నిరాకారులు కూడా. దేహధారి అయిన్పటికి దేహాతీతులు. దేహాన్ని త్యాగం చేసినా వారి అస్తిత్వం చెరగదు సరికదా ప్రఖరమవుతుంది.

వారిని పొందటానికి, వారిని కలవడానికి కావలసినదల్లా మన కోరిక. మనస్సు నుండి తీవ్రంగా వెలువడే పిలుపు. మన గురుదేవులు మనకు దూరంగా లేరు అనే సందేశాన్ని అందిస్తున్నది గురుపూర్ణిమ. దేహధారిగా ఉన్నప్పుడు కూడా వారు దేహాతీతులే, ఇక దేహాన్ని త్యజించాక సర్వవ్యాపకులైపోయారు. ఆయన్ని పిలిచినవారికి ఆయన వరాలు తప్పక లభిస్తాయని మనకు భరోసా ఇచ్చారు.

మనం జీవితంలో ఎలాంటి భూమికను నిర్వర్తిస్తున్నా సరే, ధనవంతులమైనా, పేదవారమైనా, సుఖంగా ఉన్నా, దుఃఖాలలో ఉన్నా, ఆరోగ్యంగా ఉన్నా, రోగులమైనా, చైతన్యం వికసించినా, వికసించకపోయినా, మనలోని ప్రతి ఒక్కరికోసం గురువుగారి దగ్గర ఏదో ఒకటి ఉంటుంది. మనలోని ప్రతి ఒక్కరి కోసం ఆయన దగ్గర ఏదో ఒక సందేశం ఉంది. జీవితాంతం ఎలాంటి కష్టాలూ అనుభవించని వాడు కూడా ఏదో ఒక సమయంలో నిరాశ, అసంతృప్తి, వెలితి అనిపించిన క్షణాలులేవని చెప్పలేడు. మన జీవితాలలోని ఈ వెలితిని నింపాలని గురుదేవులు సంకల్పించారు. శ్రద్ధాపూర్వకంగా మన జీవితాలలోకి తపోమూర్తి గురుదేవులను ఆహ్వానిస్తూ, వారి కృపను అవతరింపజేసుకునే పర్వదినమే గురుపూర్ణిమ.

*– అఖండజ్యోతి, జూలై 2000*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## కదిలించే కళ్లు

51 సీ॥ మనుజ రూపమునున్న హనుమంతుడే సుమ్ము
జాంబవంతుడు తాను సత్యమనుచు
రావణునెదిరించు రాచపక్షియనుచు
నను గూర్చి తెలుపుచు నాడు గురువు
ఆజ్ఞయిడగమీరు నందుకొనుచుతాను
మీదు కార్యము సేయ ముందు నడచు
మీరు తలచినట్టి మేలైన కార్యాలు
చేసిచూపగలడు చేవతోడ

తే॥ అనియనుచు పలుకంగ నా యాత్మలంత
పరమ సంతసమున నాడి పాడు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

52 సీ॥ మధురలో జనులంత మర్యాద పాటించి
గాయత్రి యాగంబు సేయవలయు
వేయి కుండాలతో వెలుగొందు యాగంబు
సూక్ష్మరూపాలతో మీరు చూడవలయు
తదుపరి మీరంత తమవైన కార్యాలు
వరుసగా తెలుపుచు వరలవలయు
ఆశ నిరాశల నల్లాడ పనిలేదు
నయమొప్పు నీతని నమ్మవలయు

తే॥ అనియనుచు పలుకంగ నా యాత్మలంత
పరమ సంతసమున నాడి పాడు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**భయం వలన కొన్ని పనులపై అయిష్టత కలుగుతుంది.**

వ్యక్తి నిర్మాణం

# మనోయోగంతో ప్రతిభ

**మనోయోగం, సాహసాల కలయిక వలన ప్రతిభ, పరాక్రమాలు ఏర్పడతాయి.** వీటిని ప్రాపంచిక కార్యదక్షత, పురుషార్థ పారాయణ, స్ఫూర్తి, గొప్ప ఆకాంక్షలు కలిగిన వ్యక్తులలో కూడా చూడవచ్చు. వీటిని వ్యక్తిత్వపు విలువలుగా అర్థం చేసుకున్నవారు, వారి అలవాట్లను మార్చుకుని వికాసం పొందుతారు. కొందరిలో ఇవి జన్మతః కూడా ఉండవచ్చు. అందుకు కారణం వారి పూర్వజన్మ సంస్కారములే. రాజనీతి, సాహిత్యం, కళలు, వ్యాపారం మొదలైన రంగాలలో ప్రతిభావంతులైన వ్యక్తులు మనకు తారసపడుతూ ఉంటారు.

ప్రఖరత దీని తరువాత వస్తుంది. దీనిలో ఆధ్యాత్మికత స్థాయికి చెందిన పురుషార్థం కూడా కలుస్తుంది. వారు ఆదర్శవాదులు ఉత్కృష్టతను సమర్థించే వ్యక్తులు కూడా. ప్రఖరతకు ప్రతిభకు మధ్యనగల అంతరం స్పష్టమైనది. **ప్రతిభ ఎక్కువగా వైభవాల సంపాదనకై ఆశపడుతుంది. ఇది ఎక్కువగా భౌతిక విజయాలకై, సుఖ, సౌఖ్యాల సంపాదనకై ఉపయోగపడుతుంది. ప్రఖరత మొగ్గ ఆదర్శాల వైపు ఉండి సంపదలను కాక మహానతను ఆర్జిస్తుంది వ్యక్తిగత సుఖసౌఖ్యాలకు ఎక్కువగా ప్రాముఖ్యం ఇవ్వక సత్ప్రవర్తనను వృద్ధి కొరకై కృషి చేస్తుంది. దీనిని లోక కళ్యాణమనే పారమార్థిక ప్రయోజనాన్ని సాధించేందుకు ఉపయోగించటం చూస్తుంటాము.**

ఆధ్యాత్మిక క్షేత్రానికి సంబంధించిన వ్యక్తులలో ఈ ప్రతిభ తక్కువగాను ప్రఖరత మెండుగా ఉంటుంది. ఈ రెండింటిని సమానంగా సమన్వయపరిచే వ్యక్తులు తక్కువగా ఉంటారు. బుద్ధి తీక్షణత, ప్రఖరత కల్గిన వారిలో ప్రతిభ అసలు ఉండకపోవచ్చు. కాని, అవి సమాన స్థాయిలో ఉండటం చాలా అరుదు. రెండింటి లోనూ ఏది ఇష్టమైతే, వారు దానిని సంపాదించుకొంటారు.

ఆది శంకరాచార్యులు ప్రఖరతకు (బుద్ధి తీక్షణతకు) నిధి. 16 సంవత్సరాల చిన్న వయసులోనే మహామనీషుల దృష్టిని పొంది దానితో తాదాత్మ్యతను పొంది ఎన్నో విజయాలను సాధించారు. కుమారి భట్టు కూడా ఆ కాలంలో అసాధారణ వ్యక్తిత్వ సంపద కలిగిన వ్యక్తి. వారు వారి విశిష్ఠతను సమాజములోని వికృతులను, భ్రాంతులను తీసివేసేందుకు వినియోగించారు. వారు కోరుకుంటే ధనాన్ని, యశస్సును, పదవులు మొదలైన వానిని పొంది ఉండేవారు.

యోగ్యతల దృష్ట్యా యోగి అరవిందులు ఉన్నత పదవిలో ఉండగలిగేవారు. చాలాకాలం వరకు ఉన్నత పదవిలో ఉన్నారు కూడా. బరోడా రాజ్యానికి దివానుగా 'నేషనల్ కాలేజీ' సంస్థాపకుడిగా, ప్రతిభా సంపన్నుడిగా ఆ రోజులలో ఖ్యాతి పొందారు. దేశభక్తులలో అగ్రగణ్యుడిగా, విప్లవకారుడుగా పేరుపొందారు. కానీ వారి ప్రతిభ ప్రఖరతగా మార్పు పొంది సాధనా పరాయణుడై, యోగిరాజుగా మారి మహర్షిగా పిలువబడ్డాడు. వారి తపోబలంతో సూక్ష్మ వాతావరణాన్ని వేడెక్కించి గొప్ప ప్రతిభావంతులను తయారుచేశారు. ఈ సమయంలో ఎంతోమంది మహనీయులు ఒకరినిమించిన ఒకరు ఉన్నత స్థానాలను ఒకేసారి అధిరోహించడం చరిత్రలో ఇంకెన్నడూ కనిపించదు. అరుణాచలానికి చెందిన రమణ మహర్షి యొక్క తపశ్చర్య ప్రభావం సర్వమానవాళిపై ఎంత ప్రభావాన్ని కలిగించిందో, వారి సమీప ప్రదేశాలలో జరిగిన మార్పును చూసి గ్రహించవచ్చు. వారి మౌన సత్సంగంతో నెమళ్ళు, సర్పాలు, ఉడుతలు, కోతులు, పావురాలు మొదలైనవి నియమానుసారంగా వచ్చి నియమిత స్థానాల్లో కూర్చుని ఆనందాన్ని పొందుతుండేది. చాలాసార్లు వారు కోతుల సమూహంలో కలిగే కలహాల పరిష్కారానికై బయటకు వచ్చి, వాటి భాషలో మాట్లాడి తీర్పు చెప్పేవారు. అవి ఆ తీర్పును అంగీకరించి ఆయన చెప్పిన మార్గంలో నడుచుకునేవి.

చాణక్యుని ప్రఖరత వారిని ప్రధానమంత్రిగా, విశ్వవిద్యాలయ ఉన్నత పదవిని అధిరోహించాక కూడా అపరిగ్రహిగా ఉండేవారు. తన అద్భుతమైన బుద్ధి కౌశల్యాన్ని తన స్వప్రయోజనాల కోసం కాక, విదేశీ ఆక్రమణలను నిరోధించటానికి, దేశాన్ని విస్తృత పరచి, సంఘటితం చేయడానికి, సమున్నతంగా తీర్చిదిద్దటానికి ఆయన అద్భుతమైన భూమికను నిర్వహించారు. ఈతని ప్రభావంతో సామాన్య బాలకుడైన చంద్రగుప్తుడు గొప్ప చక్రవర్తి

భయం వలన సులభంగా చేయగలిగిన పనులను కూడా చేయలేము.

అయ్యాడు. బుద్ధుని అవతారమూర్తిగా భావిస్తారు. ఈ పదవి ఆయనకు సునాయాసంగా లభించలేదు. వారసులకు లభించే సింహాసనం, రాజ్యాలవలె ఆయనకు ఈ పదవి హస్తగతం కాలేదు. సత్యాన్వేషణ మొదలుపెట్టినప్పటినుంచి లక్ష్యాన్ని చేరే కష్టసాధ్యమైన పనిలో విజయాన్ని పొందటం అతని ప్రఖరతకు తార్కాణం. ఇది ఒక బలమైన ఆకర్షణ శక్తి. దీని కారణంగా వారికి సహచరులకు కాని సాధనములకు కాని లోటు కలుగలేదు. బుద్ధుడు యువకుని రూపం నుండి ఎదుగుతూ ఎదుగుతూ అవతార పదవికి చేరుకున్నాడు. అతను ఒక్కడే అవతార పురుషునిగా అంబరాన్ని అందుకోవటమే కాక తనతోపాటూ ఆనంద్, రాహుల్, కుమారదేవ, హర్షవర్ధన, అశోకుడు, సంఘమిత్ర, అశ్వపతి మొదలైన అనేక మందికి శ్రేయస్సును, సౌభాగ్యాన్ని ప్రసాదించే ఉన్నత పథాన్ని ప్రసాదించారు.

ఆయుర్వేదశాస్త్రంలో చరకుడు, సుశ్రుతుడు, వాగ్భటుడు మొదలైనవారు చేసిన ప్రయోగాలకు సంపూర్ణ మానవాళి చిరకాలం కృతజ్ఞతలుగా ఉంటారు. రసాయనశాస్త్రం ద్వారా మామూలు పదార్థాలను కూడా మణి-మాణిక్యాలను మించిన అమృత మయమైన పదార్థాలుగా మార్చటంలో వారు ప్రదర్శించిన ప్రతిభను, వారి యోగదానాన్ని అంచనా వేయటం సాధ్యం కాదు. ఈ ప్రయోగాలు వారు చేసి ఉండకపోతే మనం విజ్ఞానశాస్త్రంలో వెనుకబడి ఉండవలసి వచ్చేది. అంతరిక్ష విజ్ఞాన రహస్యోద్ఘాటనలో భాస్కరాచార్యులు, ఆర్యభట్టు మొదలైనవారి ప్రఖరతతో ప్రతిభాశక్తితో ప్రతిపాదించిన విషయాల వలన మానవులు ఖగోళశాస్త్రాన్ని గురించి ఎంతో తెలుసుకోగలిగారు. ఇవే లేనట్లయితే ఈ శాస్త్రపరిజ్ఞానంలో మనం ఎంతో వెనుకబడి ఉండేవాళ్ళం. భాషాశాస్త్రంలో పాణిని, యోగసాధనలో పతంజలి, కథా సాహిత్యంలో వ్యాసుడు, వేదాంత శాస్త్రంలో కపిలుడు, కణాదులు చేసిన యోగసనాలను సూర్యచంద్రుల అనుదానాలతో మాత్రమే పోల్చగలము.

మధ్య కాలానికి చెందిన సరస్వతి సాధకులు కాళిదాసు, వోపదేవుడు, వరదరాజు మొదలైనవారు ఆధ్యాత్మికమైన ప్రయోగ ప్రయత్నాల ద్వారా విలక్షణమైన మేధాశక్తిని పొందటంలో కృతార్థులైనారు. వారు వారి విద్యను తమ లౌకిక ప్రయోజనముల కొరకు ఉపయోగించకుండా, వారి రచనలను జ్ఞాన గరిమతో, సంవేదనాశీలంతో, భావభరితమైన ఉన్నతమైన శైలితో రచనలను చేశారు. పైన ఉదహరించిన వ్యక్తులు జన్మతః మందబుద్ధులుగా పేర్కొనబడ్డారు. ఆధునిక కాలంలోని ఆనందస్వామి కూడా ఈ కోవలోకే వస్తారు. వీరు 22 ఏళ్ళ వయసు వరకూ మందబుద్ధిగా భావింపబడ్డారు. కానీ గాయత్రీ ఉపాసనాబలం వారి అదృష్టాన్ని మార్చివేసింది. అతి ప్రాచీన కాలానికి చెందిన ఋషి తైత్తరీ కూడా ఉత్కృష్టమైన జ్ఞానసంపదను సంపాదించి చూస్తుండగానే బ్రహ్మవిద్యకు అధిష్ఠాత అయినాడు.

ప్రస్తుతకాలంలో కూడా జన్మతః ఆర్థిక స్థితి, శిక్షణ, శారీరిక, కుటుంబ స్థితిగతులు సామాన్యమైనవి అయినప్పటికి ప్రతిభా-పాటవాలను సొంత చేసుకుని, వేగంగా ముందుకుసాగి ఉన్నత స్థితిని పొంది ఎంతో మంది ప్రగతి పథంలో ముందుకు సాగేందుకు మార్గదర్శకత్వం చేస్తుంటారు. ఇటువంటి మహనీయులలో రాణాప్రతాప్, ఛత్రపతి శివాజీ, యుగపురుషుడైన గాంధీ, మదన మోహన మాలవ్యా, లోకమాన్య బాలగంగాధర తిలక్, పంజాబ్ కేసరి లాలాలజపతిరాయ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర ఆజాద్ మొదలైన వారు ప్రసిద్ధ రాజనీతిజ్ఞులుగా గుర్తింపుపొందారు. సామాజిక క్షేత్రంలో స్వామి వివేకానంద, దయానంద సరస్వతి, స్వామి రామతీర్థ, గురుగోవిందసింగ్, సమర్థ రామదాసు, కబీరు, రైదాసు మొదలైనవారిని ముక్తకంఠంతో కీర్తించవచ్చు. ఇతరులకు ఆదర్శప్రాయులైన సుసంపన్నులలో కర్ణుడు, భామాషాహే, జుగల్ కిశోర్ బిర్లా మొదలైన వారిని శ్రద్ధాభక్తులతో స్మరించుకోవచ్చు. వారు వారి ధనాన్ని, వైభవాన్ని, బుద్ధి కుశలతను ఉన్నత ప్రయోజనాల కొరకు వినియోగించారు. సామాన్య జనులు వారి వైభవాన్ని విలాసాలకు, కూడబెట్టేందుకు, అపాత్రులకు, అనవసర ఖర్చులకు వినియోగిస్తారు. మహర్షి కర్వే తన సంపాదనలో కొంత భాగం పిల్లల చదువుకు, స్వావలంబనా పరులుగా తయారు చేసేందుకు వినియోగించి, మిగిలిన ధనాన్ని లోకహితానికై ఖర్చు చేశారు. ఇటువంటి వారిలో రాణి అహల్యాబాయి వంటి స్త్రీలను కూడా స్మరించుకోవచ్చు. పిండి విసురుకుని జీవిస్తూ కూడా తమ ఆదాయాన్ని ఎంతో ఉదారతతో లోకకళ్యాణం కోసం ఖర్చుచేసిన వారిని మానవాళి అంతా అభినందిస్తూనే ఉంటుంది. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ తాను సంపాదించిన దానిలో 1/4 వంతు కుటుంబ పోషణకై వినియోగించి, మిగిలిన ధనాన్ని అభాగ్యులైన విద్యార్థులకై ఖర్చుపెట్టేవారు. ఇది సంపన్నతను గురించి చర్చించటం కాదు. ధన వినియోగానికి సరైన మార్గాన్ని

**ఇష్టంతో ఎంత కష్టమైన పనినైనా చెయ్యగలుగుతాము.**

ఎన్నుకుని చిన్న విత్తనాన్ని, బుద్ధి కుశలతతోను, సాహసంతో నాటి అమూల్యమైన ఫలితాన్ని పొందే సౌభాగ్యాన్ని ప్రసాదించిన వారి ప్రఖరతను అభినందించడమే. జనక మహారాజు, దానవీరకర్ణుడు మొదలైనవారిని కూడా ఇటువంటి అపరిగ్రహ బ్రాహ్మణ పరివారంలోనే లెక్కవేయవచ్చు. హరిశ్చంద్రుని ఉదారతను అనంతకాలం వరకు స్మరిస్తూనే ఉంటారు.

అమెరికా ప్రెసిడెంటు అబ్రహాం లింకన్ పాలన, పోషణ అతని సవతి తల్లి చేసింది. బీదతనం, కఠిన పరిస్థితుల మధ్యన కాలం గడిపే ఈ మహిళ ఇచ్చిన ప్రేరణ, ఉపదేశం ఆ బాలుడికి తెలివిని, చదువునే కాక ఆత్మను కూడా ఉన్నతంగా మార్చి క్రమశిక్షణా మార్గంలో నడుస్తూ అమెరికాకు రాష్ట్రపతినే కాక ప్రపంచంలోని మహా మానవులలో ఒకనిగా తీర్చిదిద్దింది. అబ్రహాం లింకన్‌ను అతని ఉన్నతిని కారణం అడగగా "జన్మనిచ్చిన తల్లి లేనప్పటికి, నా బాధ్యతలను స్వీకరించిన ఆ తల్లిచే తయారు చేయబడిన బొమ్మను నేను" అని చెప్పాడు.

గొప్ప విజ్ఞాన శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ చిన్నతనంలో మందబుద్ధిగా ఉండేవాడు. చదువుపట్ల అతని మనస్సు లగ్నమయ్యేది కాదు. అందువలన ఉపాధ్యాయులు ఎడిసన్ మందబుద్ధి కారణంగా చదవలేకపోతున్నాడు కనుక స్కూలు నుండి తీసివేస్తున్నామని ఉత్తరం ఇచ్చి పంపారు. వారి తల్లి కన్నీటితో భారమైన మనసుతో ఉత్తరం చదివింది. అనురాగంతో పిల్లవాడిని హృదయానికి హత్తుకొని నీవు మందబుద్ధివి కాకూడదు. నేనే నిన్ను స్వయంగా చదివిస్తాను అని స్వయంగా తానే చదువు చెప్పటం ఆరంభించింది. ఫలితం ఆ బాలుడే ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వైజ్ఞానికులలో ఒకడయ్యాడు.

ఉన్నతమైన యోగ్యతలు కాని గొప్ప సంపదలు కాని ఇక్కడి సమస్యకాదు. కుట్రదారులు, మోసగాళ్ళు, దోపిడిదారులు, నేర ప్రవర్తనగలవారు సామాన్యుల కంటే ఎక్కువ బుద్ధి కుశలతను కలిగి ఉంటారు. వారిలో చాలామందికి విద్య కూడా అబ్బి ఉంటుంది. ఇన్ని ఉన్నప్పటికి ఆ అవకాశాలను సవ్యంగా వినియోగించకపోవటం వలన ఇతరులకే కాక అవి వారికి కూడా కష్టాలను అపకారాన్ని కలిగిస్తాయి. సాధన, యోగ్యత తక్కువగా ఉన్నప్పటికి బుద్ధి కుశలతను గొప్ప ప్రయోజనాలకై ఉపయోగిస్తే ఇతరులు అనుసరించదగిన ఆదర్శాలను నెలకొల్పినవారౌతారు. ఇటువంటి ఉత్సాహం, సాహసం, ఏ అంతఃప్రేరణతో సాధ్యమౌతుందో దానినే ప్రఖరత అంటారు. రాజస్థాన్‌లో బాలికా విద్యాలయ సంస్థాపకులు హీరాలాల్ శాస్త్రి, సాంగరియా విద్యాపీఠ సంస్థాపకుడు స్వామి కేశవానంద, వికలాంగులకు ఆశ్రయాన్ని కల్పించిన బాబాసాహెబ్ మొదలైన సేవాదురంధరులను కాలగతి ఎన్నడూ విస్మరించనీయదు.

– పూజ్య గురుదేవుల ***"ప్రతిభా-పురుషార్థ కీ చేరి"*** పుస్తకం నుండి

– *అనువాదం: శ్రీమతి ఎ.ఆర్. నిర్మల*

## మైత్రి మహిమ

*ఒక అడవిలో లేళ్ళు, తాబేలు, కాకి, ఎలుకలు జీవిస్తూ ఉండేవి. కాని విపరీత స్వభావములు కలిగిన ప్రాణులు కావడం వలన పరస్పరం పోట్లాడుకుంటూ ఉండేవి. ఈ పోట్లాటల వలన అవి వేటగాళ్ళకు చిక్కి మరణిస్తూ ఉండేవి. ఇలా తరతరాలుగా సాగటం వలన వీటి వంశమే లేకుండా పోతుందని భావించి ఒక మహాత్ముడు ఈ నాలుగు ప్రాణులకు కలసిమెలసి జీవించమని ఉపదేశం చేశాడు. ఆయన ఉపదేశ ప్రభావం వలన అవి కలసి మెలసి జీవించసాగాయి.*

*ఒకనాడు ఒక వేటగాడు అడవిలో తిరుగుతున్న తాబేలును ఒకవలలో పట్టుకున్నాడు. మిగిలిన మూడు జంతువులు తెలివిని ఉపయోగించి తాబేలును రక్షించాలనుకున్నాయి. లేడి కుంటుతూ వేటగాని ముందుకు వెళ్ళింది. కాకి లేడి వీపు మీద వాలింది. వేటగాడు కుంటుతున్న లేడిని పట్టుకోవచ్చుని, వలను క్రింద పడేసి దాని వెంటబడ్డాడు. ఇంతలో ఎలుక వలను కొరికి తాబేలుతోసహా పారిపోయింది. చాలాసేపు లేడి వెంట పరుగెత్తి పట్టుకోలేక నిరాశతో వెనుకకు తిరిగి వచ్చాడు. వల కొరికివేయబడింది. తాబేలు లేదు. ఇక్కడ ఈ ప్రాంతంలో అతీంద్రియ శక్తులు ఉన్నాయా అని వేటగాడికి భయం వేసి ఇంటికి పరుగుతీశాడు.*

*కలసిమెలసి జీవించడం వల్ల, పరస్పరం మైత్రి భావన కలిగి ఉండడం వల్ల సమస్త ప్రాణులు ఎంతటి విపత్తులయిన అవలీలగా ఎదుర్కొనగలవు. ఏకాకిగా బ్రతికేవారు, సంతులన కోల్పోయేవారు నష్టాన్ని, కష్టాన్ని పొందుతుంటారు.*

*– ప్రజ్ఞా పురాణం నుండి*

**ఆశావాదులు అసాధ్యమైన పనులు కూడా సాధ్యం చెయ్యగలుగుతారు.**

ఆదిశక్తి యొక్క లీలాకథలు - 13

# వేదోక్త రాత్రిసూక్తం మరియు తంత్రోక్త రాత్రిసూక్తం

ఆదిశక్తి లీలాకథ అని చెప్పబడే శ్రీదుర్గాసప్తశతి యొక్క ఆరు అంగములైన కవచము, అర్గళా, కీలకము, ప్రాధానికరహస్యము, వైకృతికరహస్యము, మూర్తిరహస్యముల మర్మములను వెల్లడించడము జరిగినది. ఇదేక్రమములో నవార్ణమంత్ర రహస్యము కూడా చెప్పబడినది. అయితే వీటితోపాటు శ్రీదుర్గాసప్తశతి పారాయణవిధానంలో పారాయణకు ముందు రాత్రిసూక్తము, శ్రీదేవ్యథర్వశీర్షం మరియు పారాయణం తదుపరి శ్రీదేవీసూక్తముల పారాయణకు కూడా గొప్ప మహిమ ఉన్నదని తెలియజేయబడినది. ఈ సూక్తాలలో శ్రీసిద్ధకుంజికాస్తోత్రమునకు కూడా ఎంతో మహత్వం వెల్లడిచేయబడినది. ఇందువలన భగవతి యొక్క భావమయ భక్తుడు ఈ మంత్రమయములైన సిద్ధస్తోత్రాల, స్తుతుల అర్థమును మరియు వాటి రహస్యములను తెలుసుకొనుట అవసరము. నియమిత సాధనలో పారాయణపట్ల శ్రద్ధ ఉన్న భక్తులు పారాయణ క్రమంలో వీటినికూడా కలుపుకుని చేసుకొనవలెను. వీటితో పారాయణం వలన లభించే ఆధ్యాత్మికశక్తి మరింత ఎక్కువ శీఘ్రంగా సాకారమై తీరుతుంది.

జగన్మాత సాధనలో పగటికంటే కూడా రాత్రికి అధికమైన ప్రాధాన్యత ఉన్నది. రాత్రి కాళికామాత గర్భము వంటిది. అందులో సాధకుని చేతన వికసించి పరిపక్వమౌతుంది. ఏ సాధకునికైతే రాత్రి యొక్క అర్థము, రహస్యము తెలియదో అతను సాధనారహస్య జ్ఞానమునకు దూరంగా ఉన్నాడని అని అర్థము చేసుకోవాలి. రాత్రి సమయంలో నిద్రించుట లేక రాత్రికాలంలో మేలుకొని ఉండుట అను ఈ రెండింటికి తమదైన ప్రత్యేక అర్థమున్నది. రాత్రివేళ అందరూ నిద్రిస్తారు, కాని నిద్రను సమాధిగా రూపాంతరము చేసుకునే నేర్పు కొద్దిమందికే తెలుస్తుంది. ఇదేవిధంగా కలలను ఆధ్యాత్మికానుభూతులుగా వికసింపజేసుకునే విధానము తక్కువమందికే తెలుసు. ఈ రాత్రిశయనంతోపాటు, రాత్రి జాగరణకు కూడా తనదైన విశేష మహత్వమున్నది. ఈ జాగరణ (మేల్కొని ఉండుట) లో కూడా నిశీథివేళ, మహానిశీథి (మహాంధకార) కాలములో చేయబడే సాధన అయితే తక్కువ సమయంలోనే సిద్ధిని చేకూరుస్తుంది.

గ్రామీణులు ఒక సామెతను చెప్తారు. 'రాత్రివేళ ముగ్గురు మేల్కొని ఉంటారు - యోగి, భోగి, రోగి, అనగా రాత్రివేళ కేవలము భోగి, రోగి, యోగులుమాత్రమే నిద్రించరు. భోగి రాత్రి సమయంలో విలాసాలలో తేలియాడుతూ, ఆనందంలో మునకలేస్తూ తన ప్రాణశక్తిని క్షయం చేసుకుంటాడు. రాత్రి అనగా అతనికి చేతన యొక్క పతనము మరియు శారీరక అనారోగ్యమునకు ఆహ్వానము పలుకుటే. ఎవరైతే తమ రాత్రులను భోగాలలో గడుపుతారో, వారు రోగులుగా మారుట అనునది అనివార్యము. భర్తృహరిమహారాజు కూడా 'భోగే రోగే భయం' అనగా భోగములో ఎల్లప్పుడూ రోగ భయం ఉంటుంది, రోగి అయిన వ్యక్తికి రాత్రివేళ శాంతి ఉండదు' అన్నాడు. రోగి యొక్క బాధ అతనిని ఎల్లప్పుడూ రాత్రి సమయంలో అశాంతికి గురిచేస్తుంది. చాలాసార్లు రోగాల ఆక్రమణ రాత్రికాలంలో ఎక్కువగా జరుగుతుంది. భోగి, రోగి ఈ ఇద్దరికి వ్యతిరేకంగా ఉంటాడు యోగి. యోగిని గురించి యోగేశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుడు ఇలా అన్నారు. **'యా నిశా సర్వభూతాని తస్యాం జాగర్తి సంయమి' (2/69)** అనగా ప్రాణులందరూ రాత్రివేళ నిద్రిస్తారు. ఆ సమయంలో సంయమి అనగా యోగి జాగృతమై ఉంటాడు.

ఈ అద్భుత జాగృతికి అర్థమే రాత్రిసూక్తంలో చెప్పబడినది. దేవీసప్తశతిలో రాత్రిసూక్తాలు రెండు ఉన్నాయి. 1. వేదోక్తరాత్రి సూక్తము, 2. తంత్రోక్తరాత్రిసూక్తము. వేదోక్తరాత్రిసూక్తంలో ఎనిమిది ఋచములు ఉన్నాయి. దీని మంత్రద్రష్ట ఋషులు కుశికుడు, సౌరభుడు మరియు భరద్వాజుడు. ఈ సూక్తానికి అధిష్ఠాత్రి దేవి స్వయముగా భగవతి రాత్రియే. ఇది గాయత్రి ఛందస్సులో చెప్పబడింది. ఇది ఋగ్వేదమండలి దశమ మండలానికి చెందిన దశమ అధ్యాయము 127వ వేదమంత్రములో ప్రథమ మంత్రం నుండి అష్టమమంత్రం వరకు ఉచ్చరించబడింది. ఈ సూక్తంలోని మొదటి ఐదు మంత్రాలలో రాత్రి దేవి స్వరూపాన్ని గూర్చి వివరించబడినది. తరువాతి మూడు మంత్రాలలో భగవతి రాత్రిని సాధనలో సిద్ధిని ప్రసాదించమని ప్రార్థన చెయ్యబడివుంది.

ఈ మంత్రాత్మక సూత్రార్థము చాలా గొప్పగా హృదయాన్ని స్పృశిస్తుంది. రాత్రిరూప దేవత జగత్తులోని జీవుల శుభా శుభకర్మలను బహుచక్కగా వీక్షిస్తుంది మరియు ఆ కర్మలను అనుసరించి ఫలితాన్నిచ్చే వ్యవస్థను ఏర్పరచుటకు సమస్త విభూతులను ధారణ చేస్తుంది అని చెప్పబడింది. ఈ కథనం

వైఫల్యాలు నిరాశావాదం బలపడటానికి కారణమవుతాయి.

యొక్క రహస్యార్థము ఏమిటంటే రాత్రివేళ నిద్రించే ప్రాణులు చేతనా జగత్తు నుండి అచేతనత్వ అంధకారంలో ప్రవేశిస్తారు. ప్రాణుల చేతనలో ఇమిడివున్న కోరికలు, వాసనలు కూడా అచేతనా గర్భంలోకి ప్రవేశిస్తాయి. ఈ ప్రవేశం సముచితరీతిలో జరిగినట్లయితే వారు అంతరిక్షశక్తిని గ్రహించి తిరిగివస్తారు. వారికి ఈ అంతరిక్షశక్తి మనోకామనలకు అనుగుణంగా వరదానములు ప్రసాదిస్తుంది. అయితే సాధకులు, తాపసులు రాత్రికాలంలో తమని తాము అచేతన యొక్క చీకటిలో విలీనం కాకుండా తమ సాధనాత్మక పురుషార్థముతో ఆ అంధకారమును పారద్రోలుతారు. వారి అంతరాళములో బ్రహ్మవిద్యామయి అయిన ఉషస్సు ప్రకటితమౌతుంది.

రాత్రిసూక్తంలో భగవతిని ఈవిధంగా కూడా ప్రార్థన చెయ్యటం జరిగింది. 'హే భవానీ! వాసనామయ తోడేళ్ళను మరియు పాపమయ తోడేళ్ళను మానుండి తరిమివేయుము. కామము మొదలైన దొంగల సముదాయమును కూడా వెళ్ళగొట్టుము. ఆతరువాత మాకొరకు మోక్షదాయినివిగా మరియు కళ్యాణకారకముగా మారుము'. నిజంగానే రాత్రి యొక్క నిశీథికాలంలో మరియు మహానిశీథికాలంలో లేక మహాంధకార కాలంలో సాధన చేసేవారు అతి సులభంగా అచేతన యొక్క అంధకారమును పటాపంచలు చేసుకొని ఆత్మజాగృతి అనే ఉషోదయంలోకి తొంగిచూస్తారు. ఈ భావననే ఆధారంగా చేసుకొని ఈ సూక్తం అంతిమ మంత్రంలో 'హే పరమ వ్యోమరూప పరమాత్మ పుత్రీ! నీ కృపతో నేను కామాది శత్రువులను జయించాను. నీవు యజ్ఞాగ్నివలె నా ఈ హవిష్యమును స్వీకరించు' అని ప్రార్థన చెయ్యబడినది.

దేవీసప్తశతి కథలో ఇలా ఉన్నది. విష్ణువు చెవి గుబిలినుండి ఉద్భవించిన మధు-కైటభులు బ్రహ్మదేవుడిని యుద్ధంలో ఎదిరించారు. అప్పుడు బ్రహ్మదేవుడు విష్ణుభగవానుని వద్దకు వెళ్ళాడు. ఆ సమయంలో పరమదేవుడైన విష్ణువు క్షీర సాగరంలో శేషశయ్యపై శయనించి యోగనిద్రలో నిమ్నగ్నమై ఉన్నాడు. విష్ణువును ఏవిధంగానూ నిద్ర మేల్కొల్పుట సంభవంగా కనిపించక బ్రహ్మదేవుడు నిద్రకు అధిష్ఠాన దేవత యైన దేవి భగవతి రాత్రిని స్తుతించడము ప్రారంభించాడు. బ్రహ్మదేవుని ముఖమునుండి ఉచ్చరించబడిన ఆ సూక్తమే ఈ రాత్రిసూక్తము.

ఇందులో భగవతి రాత్రి యొక్క లెక్కకుమించిన రూపాల మహిమ గానం చెయ్యబడినది. దానితోపాటుగా ఆమెయే సమస్త సృష్టిని తన గర్భంలో ధారణ చేస్తుంది అని కూడా చెప్పబడింది. స్వధా, స్వాహా మరియు వషట్కారము ఆమెయే! ఓంకారాది నాదములు కూడా ఈమెయే. ఆ జగదంబయే మహావిద్య, మహామేధ, మహాస్మృతి, మహామోహరూపి, మహాదేవి మరియు మహాసురి! త్రిగుణాలను ఉత్పన్నం చేసే మూలప్రకృతి కూడా భగవతియే! ఆమెయే కాళరాత్రి, మహారాత్రి మరియు మోహరాత్రి! పర-అపరాలన్నిటికి అతీతంగా భాసించే పరమేశ్వరి ఆమెయే అన్నది యథార్థము. బ్రహ్మదేవుడు ఈ సూక్తంలో ఆమెను స్తుతిస్తూ ఇలా అన్నాడు. 'హే సర్వస్వరూప దేవీ! సత్-అసత్ రూపములలో జగత్తులో ఎక్కడ ఏ వస్తువులున్నప్పటికి అవి, వాటి శక్తి సమస్తమూ నీవే తల్లీ!'

ఈ సూక్తంలోని చివరి మంత్రంలో 'ఈ మధుకైటభులను అసురులను మోహగ్రస్తులను చేయుము. ఈ అసురులను సంహరించేందుకు విష్ణుభగవానునికి బోధ చేయవలసినది తల్లీ!' అని భగవతి రాత్రిని బ్రహ్మదేవుడు ప్రార్థించాడు.

వేదోక్త-తంత్రోక్త రాత్రిసూక్తములు సుమనోహరమైన వేదాంత ప్రతిపాదన చేసే కావ్యములేకాక, మంత్రపూరితములు కూడా. వీటి మంత్ర సామర్థ్యము అపూర్వమైనది. నిద్రకుపక్రమించే ముందు పాద, హస్త ప్రక్షాళన చేసుకొని తన్మయభావంతో భగవతి జగన్మాతను స్మరిస్తూ ముమ్మారు వీటిని పఠించుట పరమ లాభదాయకము. ఇలా చేయటం వలన రాత్రికాలంలో భయమును రేకెత్తించే దుస్వప్నములు వచ్చుట, నిద్రలేమి, పసిపిల్లలు అకస్మాత్తుగా ఉలిక్కిపడి ఏడ్చుట మరియు ప్రేతాది బాధలు, సమస్తవిధములైన భయములు తొలగిపోతాయి. దీనికిమించి రాత్రిసూక్తము అవగాహనయై-రాత్రికాలపు సాధనా మర్మము చక్కగా వెల్లడికావాలని కోరుకునే సాధకులకు అందుకుగాను ప్రతి మాసము కృష్ణపక్షపు అష్టమి, నవమి, చతుర్దశి రోజులు విశేషమైన ప్రాముఖ్యతను కలిగివున్నాయి. ఈ త్రిరాత్రులలో కూడా నిశీథి మరియు మహానిశీథికాలములు విశిష్టమైన సాధనలకు మహోపకరమైనవి. ఆ కొద్ది గంటలలో చేయబడే సాధన ప్రకరణములు చాలా గూఢమైనవి - రహస్యమైనవి కూడా. వీటిని గూర్చిన సంపూర్ణమైన వివరణనిచ్చుట, వ్రాయుట అనునది సాధకుడు, సాధన మరియు సిద్ధుల మర్యాదలను ఉల్లంఘించటమే! సిద్ధజనులు ఇలా వెల్లడిచేయుటను నిషేధించినారు. ప్రతిమాసంలోని కృష్ణపక్షంలోని పైన చెప్పిన మూడు తిథులేకాక, దీపావళి, హోళి, జన్మాష్టమి, మహాశివరాత్రి పర్వదినపు రాత్రులు కూడా విశేషమైనవే అన్నది కూడా వాస్తవమే. పైన చెప్పబడిన రాత్రులన్నీ కూడా విశేష సాధనలు చేసే సాధకులకు ప్రత్యేకానుభూతులను ప్రసాదిస్తాయి.

*- అఖండజ్యోతి, జనవరి 2008*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

**తన వైఫల్యాలకు కారణాలు బయట ఉన్నాయనే అనుకునే వ్యక్తి తనలోని లోపాలను గుర్తించలేడు.**

మనం - మన ఆరోగ్యం

# గుండె జబ్బులను మనమే స్వయంగా ఆహ్వానిస్తున్నాము

ఈనాటి కాలంలో ఒకరితో ఒకరు పోటీపడే జీవనశైలి భౌతిక సుఖ-సౌకర్యాలలో గొప్ప అభివృద్ధిని సాధించినది. అయితే దానితోపాటే మానవుని మానసిక శాంతి, శారీరక ఆరోగ్యమును కూడా పెద్ద ఎత్తున నాశనం చేసింది. **అధిక రక్తపోటు వలన బాధపడే వారి సంఖ్య పెరుగుదలకు కారణము నేటి జీవనశైలే.** ఆధునిక వైజ్ఞానికుల పరీక్షా ఫలితాలను అనుసరించి ప్రపంచ జనసంఖ్యలో సుమారు 25% మంది దీని బారినపడ్డవారే, దీనితో బాధపడేవారే. సామాన్యంగా కష్ట సమయం వచ్చినప్పుడు దానిని ఎదుర్కొనుటకు ప్రకృతి సహజంగానే మన రక్తపోటును పెంచుతుంది. కానీ ఈ పెరిగిన రక్తపోటు పరిస్థితులు మామూలు స్థితికి రాగానే స్వతఃసిద్ధంగానే సామాన్యస్థాయికి చేరుకుంటుంది. అయితే **క్రోధం, భయం, ఉత్తేజన మరియు అసంతుష్ట భావ మాయాజాలంలో ఇరుక్కున్న ఈనాటి మనుష్యులలో కష్టములను ఎదుర్కొనే శక్తిసామర్థ్యములు క్షీణిస్తున్నాయి. దీని ఫలితంగా ఒకవేళ రక్తపోటు పెరిగితే, అది అక్కడే స్థిరపడిపోతున్నదితప్ప మామూలుస్థితికి రావటంలేదు.**

మన శరీరంలో రక్తసంచారము జరగటానికి గుండె సంకోచ-వ్యాకోచాలకు లోనౌతుంది. గుండె ముడుచుకున్నప్పుడు ఎక్కువ వేగంతో రక్తం ధమనులలోకి నెట్టబడుతుంది. ధమనులు రక్తమును గ్రహించే సమయంలో వ్యాకోచిస్తాయి. తిరిగి రక్తమును ముందుకు పంపటానికి సంకోచిస్తాయి. తిరిగి తిరిగి రక్తమును ప్రసరింప చేయటానికి సంకోచ-వ్యాకోచములతో హృదయంలో రక్తప్రసరణ ప్రక్రియ జరుగుతుంది. ఒకవేళ ధమనులు సాగే గుణం (elasticity) కలిగి, కోమలంగా, శుద్ధంగా ఉన్నట్లయితే గుండె రక్తమును స్వీకరించటానికి, ప్రసరింపజేయటానికి ఎక్కువ శ్రమపడవల్సిన అవసరంలేదు. అయితే **ఒకవేళ ఏదైనా కారణం చేత ధమనులు ముడుచుకుపోయినా లేక వాటిలో ఏదైనా అవరోధం ఏర్పడినా (blocks) హృదయం రక్తప్రసరణ చేయటానికి అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. తత్ఫలితంగా మనిషి అధిక రక్తపోటు బారినపడతాడు.**

ఒక సామాన్య మానవునిలో 80 (diastolic) నుండి 120 మి.మీ. (systolic) రక్తపోటు ఉంటుంది. 90-100 (diastolic) నుండి 140-150 (systolic) వరకు ఈనాటి మానవుని రక్తపోటు ఉంటున్నదని భావిస్తున్నారు. మనిషి వయస్సు, లింగం, శారీరిక, మానసిక శ్రమను అనుసరించి రక్తపోటు సహజంగా ఉండవల్సిన నిష్పత్తి కూడా వేరువేరుగా ఉంటుంది.

**కృత్రిమ, అప్రాకృతిక జీవితం, అసంయమన ఆహారపానీయాల స్వీకరణ మరియు ఆహార-విహారముల వలన రక్తంలో మాలిన్యాలు పెరుగుతాయి.** వ్యక్తిగత, కుటుంబ, ఆఫీసులలో ఉండే సమస్యల వలన మనోమస్తిష్కములలో ఒకవేళ ఒత్తిడి పెరిగినట్లయితే దానివలన కూడా రక్తంలో మాలిన్యాలు ఏర్పడతాయి. ఇటువంటి రక్తం వలన ధమనులలో అడ్డంకులు ఏర్పడి రక్తప్రసరణ సవ్యంగా జరుగదు.

అతిరక్తపోటుకు గల అనేక కారణాలలో శరీరములో ఉప్పు ఎక్కువగా ఉండటం ఒక కారణం. ప్రారంభంలో రక్తపోటు సామాన్యస్థాయికంటే ఎక్కువగా ఉంటున్నది అని అనిపించినప్పుడు **శరీర అవసరమును మించి ఉప్పు తీసుకుంటున్నామన్న విషయమును అర్థం చేసుకోవాలి. 90% పరిస్థితులలో అధిక రక్తపోటుకు ఇదే కారణము.** అప్పుడప్పుడు ఈ వ్యాధి వారసత్వంగా ఒక తరం నుండి మరో తరానికి కూడా వచ్చే అవకాశం ఉంది. తల్లిదండ్రులలో ఒకరు లేక ఇద్దరు రక్తపోటుతో బాధపడుతుంటే సంతానమునకు కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇంతేకాకుండా మూత్రపిండాలు దెబ్బతినడం, శరీరంలో హార్మోనుల అసంతులనం, చాలాకాలంపాటు గర్భనిరోధక మందులు ఉపయోగించటం, గర్భాశయ సమస్యలు, పరిస్థితుల ఒత్తిళ్ళు తగిన విశ్రాంతి లేకపోవడం మొదలైన కారణాలు ఈ వ్యాధికి జన్మనిస్తాయి. టీ, కాఫీ మరియు మత్తుపదార్థములను అధికంగా సేవించటం వల్ల కూడా రక్తపోటు అధికంగా పెరుగుతుంది. వైద్యుల అభిప్రాయమును అనుసరించి కేవలం ఒక్క సిగిరెట్టు త్రాగటం చేత రక్తపోటు అరగంట నుండి గంట వరకు అధికస్థాయికి చేరుకుని అక్కడ నిలబడుతుంది. రోజంతా ధూమపానం చేయుట వలన ఆరోజంతా రక్తపోటు ఎక్కువగా ఉంటుంది. **రక్తపోటు పెరగటానికి అధిక బరువు కూడా ఒక ముఖ్య కారణము.** ఒక సామాన్య మానవుని బరువు 45 నుండి 75 కిలోల మధ్య ఉండాలి. ఒకవేళ పొడుగు, వయస్సుకు సరిపడా ఉండవల్సిన బరువుకన్నా ఎక్కువ బరువు ఉన్నట్లయితే కండరాలు, నాడులు, గుండె మీద చెడు ప్రభావమును చూపిస్తాయి.

**ఆత్మన్యూనతా భావాన్ని త్యజించాలి.**

అధిక రక్తపోటుతో బాధపడే వ్యక్తికి తలనొప్పి, తలతిరగటం, చిరాకు, ఒత్తిడి, మొహం ఎర్రబడటం, ధమనుల వాపు, శ్వాస వేగమవడం వంటి ముఖ్య లక్షణాలే కాక, గుండెనొప్పి కూడా వచ్చే అవకాశం ఉన్నది. పరిస్థితి విషమించినప్పుడు తలలోని నరాలు చిట్లుట, శుక్లాలు ఏర్పడినప్పుడు దృష్టి మందగించటం, మూత్రపిండాల మీద ప్రభావాన్ని చూపించడం వలన అవి పాడవటం వంటి ప్రమాదకరమైన లక్షణాలు పొడచూపుతాయి. చాలాసార్లు రక్తపోటు అకస్మాత్తుగా అధికమవటం వలన మూత్రపిండాలు కూడా హఠాత్తుగా దెబ్బతింటాయి. ఒక పరిశోధనా ఫలితాన్ని అనుసరించి అధిక రక్తపోటు ఉన్న రోగులలో రమారమి 15% మంది మూత్రపిండ వ్యాధితో బాధపడేవారే.

అధిక రక్తపోటు వలన గుండె కండరాలు దెబ్బతింటాయి. తద్వారా రక్తప్రసరణ ప్రభావితమౌతుంది. ఒక్కొక్కసారి హార్ట్ ఫెయిల్ అవవచ్చు. డా॥ లెడ్‌రెట్ ఇలా అంటారు – 'అధిక రక్తపోటు ఎక్కువకాలం పాటు ఉండటం వలన ఒకవేళ హృదయ కండరాలు దెబ్బతింటే తిరిగి బాగుచెయ్యటం దాదాపు అసంభవం. కండరాల వాపును మరింక పెరగకుండా నిలువరించటం తప్ప మరేమీ చెయ్యలేము.'

**అధిక రక్తపోటు లేకుండా ఉండటానికి ఆహార–విహారాలలో, అన్నపానాదుల స్వీకరణలో సంయమనం తప్పక పాటించాలి.** ప్రాతఃకాల చల్లటిగాలిలో పచార్లు చేయటం, కొద్దిపాటి వ్యాయామం చేయుట కూడా దీనికి మరింత ప్రయోజనమును చేకూరుస్తుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారు ఉప్పులేని సంతులిత ఆహారమును తీసుకోవాలి. **ప్రోటీనులు ఉండే పదార్థములను తినటం తగ్గించాలి.** మలబద్ధక వ్యాధి నుండి బయటపడే ప్రయత్నం చేయాలి. ఆకలి వేసినదానికన్నా కొంచెం తక్కువ ఆహారమును తీసుకోవాలి. పరిశోధనలను అనుసరించి బరువు ఎక్కువ ఉన్న వ్యక్తి తన బరువును తగ్గించుకుంటే అతని రక్తపోటు మందులు వాడకుండానే తగ్గుముఖం పడుతుంది. ఆహార పానీయాల సేవనంలో టీ, కాఫీ మరియు మత్తు పదార్థములను పూర్తిగా త్యజించుట ఉత్తమం.

**అంతేకాక ఈర్ష్య, భయం, ద్వేషం, అబద్ధము లాడటం, అహంకార ప్రదర్శన మొదలైన మానసిక దోషాలనుండి బయటపడే ప్రయత్నం చేయాలి.** ఉదాహరణకు అబద్ధమాడే వ్యక్తి తను అబద్ధమాడిన విషయం ఎక్కడ బయటపడుతుందో అని అనుక్షణం భయపడుతు ఉంటాడు. ఈ ద్వంద్వస్థితి అతని రక్తపోటును పెంచే అవకాశం ఉంది. ఈ ద్వంద్వస్థితినుండి బయటపడటానికి, **ఒత్తిడినుండి బయటపడటానికి ధ్యానం చెయ్యటం కూడా అత్యంత ప్రయోజనకారిగా ఉంటుంది.** ఈ సత్యమును విజ్ఞానవేత్తలు కూడా అంగీకరిస్తు ఇలాచెప్పారు. 'క్రమం తప్పకుండా ధ్యానం చేయటం వలన కేవలం మనోబుద్ధులు శాంతించి, ఒత్తిడినుండి బయటపడటమేకాక, శారీరక వ్యవస్థలో కూడా తగిన సంతులన (balance) స్థితి ఏర్పడుతుంది.'

అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే మన బలహీనతల వలన మనం రోగాలను స్వయంగా ఆహ్వానిస్తున్నాము. **అనియమిత, అసంయమన జీవిత విధానమే మనలను రోగాలకు నిలయంగా మారుస్తుంది. ఒకవేళ మనం తిరిగి ప్రకృతి నియమాలను అనుసరించి జీవించటం నేర్చుకుంటే ఆరోగ్యంగా ఉండటం అసంభవమైన పనికాదు.**

*– అఖండజ్యోతి, జులై 2000*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

## శ్రీ గాయత్రీ శతకం

52. *ముగ్గురమ్మల రూపమ్ము సుఖము గలిగి*
*ఆదిమాతగా స్వయముగా అవతరించి*
*సుతుల గొనుతల్లి నిను గాచి వెతలదీర్చు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– లక్ష్మీదేవి, పార్వతీదేవి, సరస్వతీదేవి ఈ ముగ్గురి అమ్మల రూపమును, ముఖమును కలిగి ఆదిమాతగా స్వయముగా అవతరించి పూజలందుకునే గాయత్రీ మాత నిన్ను ఎల్లవేళలా రక్షిస్తూ నీ బాధల్ని తీర్చి సంతోషమును కలుగజేస్తుంది నీవు నమ్మి ఆరాధిస్తే.*

54. *ప్రణవనాదమ్ము యెచ్చట వ్యాప్తి గలదొ*
*అచట శుభగాత్రి గాయత్రి అధివసించి*
*నీదు ప్రార్థన నాలించి మోదమొసగు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– ఓంకార నాదం ఎక్కడ వ్యాప్తిచెంది ధ్వనిస్తూ ఉంటుందో అక్కడ శుభములు పలికే గాత్రము కలిగిన గాయత్రీ మాత కొలువైయుండి ప్రార్థించే వారి ప్రార్థనల నాలకించి సంతోషం కలిగిస్తుంది.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**ఆత్మన్యూనత వలన జీవితంలో అనేక వైఫల్యాలను ఎదుర్కొంటారు.**

వృక్ష జగత్తు

# మొక్కలు కూడా స్పందిస్తాయి



జీవ జంతువులవలెనే పలురకాలైన వృక్షములు, మొక్కలు మొదలైన వానిలో కూడా ప్రాణ చేతనత్వము ఉంటుంది. అవి అటూ ఇటూ తిరగకపోవచ్చు. కాని వాటిలోలోపల "భావ సంవేదనలు" వానిని కుదిపి వేస్తుంటాయి. తమకు అన్ని తెలివితేటలున్నా మానవులు బహుశ వాటి మూగభాషను అర్థం చేసుకొనకపోవచ్చు, కానీ మొక్కలు నిరంతరం వాటి భావములను మనకు అందజేస్తూనే ఉంటాయి అవి మానవుల క్రియా కలాపాలలతోనే కాక, వారి ఆలోచనలతో, భావములతో కూడా ప్రభావితమౌతుంటాయి. ప్రాచీనకాలంలోని భారతీయ ఋషులు, మహర్షులు తమ యొక్క సంవేదనాశీలత మరియు సూక్ష్మ చేతనత్వము ద్వారా ఈ సత్యాన్ని తెలుసుకొనగలిగారు. ఈనాటి వైజ్ఞానిక జగత్తు కూడా తన ప్రయోగములు, పరీక్షల ద్వారా ఈ సత్యాన్ని ధృవీకరిస్తూ ఉన్నది.

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన 'CIA' అనే సంస్థ యొక్క మాజీ పాలిగ్రాఫ్ నిపుణులు క్లీవ్ వెక్స్టర్ ఈ విషయమై పలు ప్రనయోగాలు నిర్వహించిన మీదట, "మొక్కలు కూడా మనుష్యుల వలెనే తమ సంవేదనను వ్యక్తం చేస్తాయని" తెలియజేశారు. ఆయన చేసిన ఒక ప్రయోగంలో, డ్రెకాయెనా' మొక్క ఆకులలో పాలిగ్రాఫ్‌ను సూచించే ఎలక్ట్రోడ్‌ను ఉంచారు. మొక్క వ్రేళ్ళు నుండి ఆకుల వరకూ వచ్చే నీటి యొక్క వేగాన్ని గ్రాఫ్ గీయాలనే ఆయన ఉద్దేశ్యం. భావనాత్మకమైన పరివర్తన వల్ల మానవ శరీరంలో రక్తపోటు, శ్వాసగతి మొదలైన వానిని, పాలిగ్రాఫ్ ద్వారా కొలవవచ్చు. దీనిని గాల్వానిక్ స్కిన్ రెస్పాన్స్ (GSR) లేదా సైకో గెల్వానిక్ రిప్లెక్స్ (PGR) అని పిలుస్తారు. దీనిలో విద్యుత్‌గతికి అనుగుణంగా, పాలిగ్రాఫ్ యొక్క ఛార్ట్ పేపరు మీద, ఒక పెన్నుతో గీతలు గీయబడతాయి.

నియమానుసారంగా, నీరు మొక్క ఆకులలోనికి వచ్చి చేరేటప్పుడు, ప్రతిరోధము (అడ్డంకి) ఎక్కువగా ఉండదు. ఫలితంగా గీతలు పైకి గీయబడతాయి. అయితే ప్రయోగ సమయంలో వెక్స్టర్, ఈ నియమానికి వ్యతిరేకంగా ఉండటం గమనించాడు. మానవీయ ఉద్వేగానికి అనుగుణంగా ఛార్టులోని గీతలు సూచించబడటం ఆయన చూశారు. మొక్కలు భావనాత్మకమైన జవాబును ఇస్తున్నాయనే విషయాన్ని ఆయన వెంటనే విశ్వసించలేకపోయారు. తీవ్రమైన తన యొక్క జిజ్ఞాసను తీర్చుకొనేందుకు ఆయన ప్రయోగాన్ని ముందుకు సాగించారు. ఇప్పుడు ఆయన మొక్కకు నిప్పుపెట్టి మండించాలని అనుకున్నారు. ఆయన అగ్గిపుల్ల గీయాలని అనుకుంటూ ఉండగానే, పి.జి.ఆర్.లో ఒక అద్భుతమైన మార్పు వచ్చింది. ఆయన మొక్కకు కొన్ని అడుగుల దూరంలో ఉన్నారు. ఇంకా అగ్గిపుల్ల గీయనే లేదు. ఇంతలోనే పాలిగ్రాఫ్ ఛార్ట్‌లో మొక్క యొక్క ప్రతిచర్య (reaction) ముద్రించబడసాగింది.

దీని తరువాత, వెక్స్టర్ సముద్రపు నీళ్ళలో పెరిగిన ఒక రొయ్యను తీసి, ప్రక్కనే మరుగుతున్న నీళ్ళలో పడవేశాడు. మరల మొక్క చాలా రోషాన్ని, బాధనూ వ్యక్తం చేస్తున్నట్లుగా పాలిగ్రాఫ్‌లో ముద్రించబడింది. వెక్స్టర్ ఆశ్చర్యచకితుడైనాడు. "జీవ కణాలు, మరియొక జీవి యొక్క జీవ కణాలకు ఆందోళనకు సంబంధించిన సంకేతాలు వ్యక్తం చేయగలవా? అనేది వారి ఆశ్చర్యానికి కారణం. మొక్కలు పశువుల భావనలతో ప్రభావితం కాగలవా? మానవీయ తప్పిదాలు లేకుండా ఉండేవిధంగా మరియొక ప్రయోగం పూర్తిగా యంత్ర సహాయంతో జరుపబడింది. అందులో 'రొయ్య' నిర్ధారిత సమయానికి మరణించేటట్టు ఏర్పాటు చేశారు. ఆ చుట్టు ప్రక్కల మనుషులెవ్వరూ లేకుండా ఏర్పాటు చేయబడింది. మరణించ వలసిన రొయ్యకు దూరంగా, మూడు వేర్వేరు గదులలో మూడు వేర్వేరు మొక్కలను ఎలక్ట్రోడ్‌లతో సహా ఉంచారు. రొయ్య మరణించేటప్పుడు, ఈ మూడు మొక్కలూ కూడా భావనాత్మకమైన ప్రతిక్రియను వ్యక్తం చేసినట్లుగా, పాలిగ్రాఫ్ ఛార్ట్ సూచించింది. ఇదే ప్రయోగాన్ని వెక్స్టర్, ఇంకా మరి కొందరు వ్యక్తులు, మరింత సున్నితమైన యంత్రాలను మాధ్యమంగా తీసుకొని మరల మరల చెయ్యటం జరిగింది. కానీ ప్రతిసారి కూడా అదే ఫలితం వారి ముందు నిలబడటం ఆశ్చర్యకరమైన విషయం.

మొక్కల ద్వారా పంపించబడే సంకేతాలు, ఎలక్ట్రో డైనమిన్ స్పెక్ట్రమ్ యొక్క శక్తి కన్నా అధికమైన శక్తి ద్వారా పంపించ బడుతున్నవని కూడా వారు గమనించారు. ఈ ప్రయోగముల ద్వారా సకల జీవప్రాణులు కణాల స్థాయిలో చేతనత్వముతో జోడింపబడి ఉంటాయని వెక్స్టర్‌కు అర్థమయినది. ఇంతేకాదు, మొక్కలు, మనుషులు, జీవ జంతువులు మొదలుగా గల ఈ ప్రకృతిలోని సమస్త ప్రాణులు ఒకదానితో ఒకటి ఇప్పటివరకు

మన మాటలు మన వైఖరిని వ్యక్తపరుస్తాయి.

తెలిసిన దూరసంభాషణ పద్ధతుల కన్నా ఉన్నత స్థాయిలో సంభాషణలను కూడా నిర్వహించగలవని కూడా అర్థమయింది.

ఇందులో దూరం కూడా ఇబ్బంది లేదు. ఒక స్నేహితుని ఇంటిలోని చెట్టును వెక్స్టర్ వద్ద వదలి పెట్టారు. ఆ చెట్టుయొక్క యజమాని చించిటిలోని 'ఎరోడ్రోవ్'లో ఎంతో ఆందోళనాభరితంగా దిగుతూ ఉన్నప్పుడు, ఆ ఆందోళన తాలుకూ ఉత్తేజన (reaction) ఇక్కడ ఈ చెట్టులో కనపడింది. న్యూయార్క్‌లో ఉన్న తన ప్రయోగశాలకు దూరంగా వెళ్ళినప్పటికి, ఆయన ఆశ్చర్యము, ఉత్తేజన, ఆందోళనా మొదలైన భావోద్వేగాలలో ఉన్నప్పుడు ఇలాంటి మొక్కల తాలుకూ పాలిగ్రాఫ్‌లలో సూచించబడిన రేఖలు, ఆయన మనోభావాలతో సరిపోలుతూ ఉండేవి. ఆయన తన ప్రయోగశాలకు రావాలని అనుకుంటున్నప్పుడు మొక్కలు ఆ వేగంతో ప్రతిక్రియకు సూచించటం కూడా గమనించదగ్గ అంశం. ఇంకా తమాషా అయిన విషయమేమిటంటే, మొక్కలు తమ తమ యజమానిపట్ల లేదా తమ బాగోగులు చూసే వారిపట్ల "విశ్వాసము, తన వారు" అన్న భావాలను ప్రదర్శిస్తాయి. సరిగ్గా ఇందుకు వ్యతిరేకంగా, అపరిచితుల పట్ల తమకు కష్టం కలిగిస్తారనుకునే వారిపట్ల భయాన్ని వ్యక్తం చేస్తాయి. తనను తాను ఒక మంచి వ్యక్తివలె, తన స్నేహితుని ఒక దుర్మార్గుని వలె "చిత్రీకరింపచేస్తూ వెక్స్టర్ పలుమార్లు ఈ ప్రయోగాన్ని నిర్వహించారు.

ప్రయోగశాలలో పనిలో నిమగ్నమైయున్నపుడు ప్రమాదవశాత్తు ఎప్పుడైనా వెక్స్టర్‌కు ఏదైనా గాయమైనా లేదా చేతివ్రేలికి ఏదైనా దెబ్బ తగిలినా, మొక్కలు వెంటనే తమ యొక్క భావనాత్మకమైన ప్రతిక్రియను చూపించేవి. క్లుప్తంగా చెప్పాలంటే, **"నరములు, నాడులు" అనేవి లేకపోయినప్పటికీ మొక్కలు విశ్వాసము, భయము, సంతోషము, దుఃఖము వంటి తమ తమ భావోద్వేగాలను వ్యక్తం చేయగలనని వెక్స్టర్ ప్రయోగాత్మకంగా నిరూపించారు.**

భారతదేశపు సుప్రసిద్ధ విజ్ఞాన శాస్త్రవేత్త శ్రీ జగదీశ్ చంద్రబోస్ 20వ శతాబ్దపు ప్రథమ దశాబ్ధంలో మొక్కల యొక్క సంవేదనా శీలతను ఋజువు చేశారు. ఉత్ప్రేరకముల యొక్క ప్రభావము వలన ప్రేమ, అసహ్యము, నొప్పి, సంతోషము, ఆశ్చర్యము లాంటి వివిధ భావోద్వేగాలు, వాటి తాలుకూ ప్రతి క్రియలు పశువులలో వలెనే వృక్షములలో కూడా ఖచ్చితంగా ఉంటాయని ఆయన అభిప్రాయం. ఉద్వేగము తాలుకు ప్రతిక్రియలను పంపించే వేగాన్ని కొలిచే రెజోనెంట్ రికార్డరు, మొక్కల యొక్క కంపనాన్ని రికార్డు చేసే రికార్డరు మొదలైన ఉపకరణముల ద్వారా బోస్ మొక్కల స్పందనలు, పశువుల హృదయ స్పందనతో సమానంగా ఉంటాయని నిరూపించారు.

"ఆటోబయాగ్రఫీ ఆఫ్ ఎ యోగి" అనే పుస్తకంలో పరమ హంస యోగానందగారు, డా॥ జగదీశ చంద్రబోస్ చేసిన ఈ ప్రయోగములను తాను స్వయంగా చూసినట్లు వ్రాశారు. ఇలాంటిదే ఒక ప్రయోగ సమయంలో, బోస్ ఫెర్న్ మొక్కను ఒక తీక్షణమైన వస్తువుతో గుచ్చటం, యోగానందగారు చూశారు. చెట్లు, మొక్కలు మొదలైన వాటి సూక్ష్మగతి విధులను 10 రెట్లు రెట్టింపు చేసి చూపించే, క్రెస్కోగ్రాఫ్ యంత్రము యొక్క స్క్రీన్ మీద ఫెర్న్ మొక్క బొమ్మను చూసి ఆయన విస్మయానికి లోనయ్యారు. గాయం తగులుతున్న సమయంలో ఫెర్న్ మొక్క ఒక పద్ధతి లేకుండా వణుకుతుండటం, ఫెర్న్ మొక్కలోని ఆ భాగాన్ని ఆ చార్సబోస్ త్రుంచి వేసినపుడు అది మృత్యుబాధను అనుభవించడము ఈ రెండింటినీ ఆయన స్క్రీన్ మీద స్పష్టంగా చూడగలిగారు. చేతనత్వము సర్వవ్యాపకమైనది అన్న తన అభిప్రాయాన్ని స్వామి యోగానంద స్పష్ట రూపంలో ప్రతిపాదించారు. చేతనత్వము జీవజంతువులలోనే కాదు, వృక్ష వనస్పతులలో కూడా తనను తాను అభివ్యక్తీకరించుకుంటుంది.

ఏదైనా దాడి జరిగినపుడు మొక్కలు తమని తాము రక్షించుకుంటాయి. విజ్ఞాన శాస్త్రవేత్త అనురాగ్ అగర్వాల్ గారు, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన, "సైన్స్" అనే పత్రికలో ఈ విషయాన్ని ప్రతిపాదిస్తూ ప్రచురించారు. మొక్కలలో కూడా ఆత్మరక్షణా విధానం ఉంటుందని, అనురాగ్‌గారి పరిశోధనల ద్వారా వెల్లడయినది. అయితే ఏదైనా ఒక క్రిమిగానీ, కీటకంగానీ తన ఆకులను గుచ్చటం, కొరకటం వంటి పనులు చేసినప్పుడు మాత్రమే మొక్కలు ఈ ఆత్మరక్షణ ప్రక్రియను అమలు చేస్తాయి. ఈ ప్రవృత్తిని "ఇన్‌డ్యూస్‌డ్ రెసిస్టెన్స్" – అనగా "ప్రేరేపించబడిన ప్రతిరోధము" అంటారు. ప్రయోగానుసారం, ఏదైనా ఒక గొంగళి పురుగులాంటి క్రిమి ఆకును నమలటం ప్రారంభించగానే, ఆకుల నుండి జాస్‌మోనిక్ ఆమ్లము వెలువడటం ప్రారంభమౌతుంది. దీని నుండి ఒక విధమైన రసాయనం తయారవుతుంది. ఆ రసాయనము యొక్క రుచి క్రిమిని అక్కడ నిలవనీయదు, ఆ క్రిమి వెనుదిరిగి వెళ్ళిపోవటానికి ఆత్రుతపడుతుంది.

ప్రఖ్యాతిగాంచిన రసాయన శాస్త్రజ్ఞుడు డా॥ మార్సెల్ వోగోల్ మానవులు–మొక్కలు వీటి మధ్య శక్తి ఏవిధంగా ఇచ్చిపుచ్చుకోవడం జరుగుతుంది. సంభాషణలు ఎలా జరుగుతాయి

**మన మాటలు మన ఇష్టాయిష్టాలను తెలియజేస్తాయి.**

అనే అంశాలపైన పలు రకాలైన ప్రయోగాలు, పరిశోధనలు చేశారు. మంచి భావాలు, ఆలోచనలు మొక్క యొక్క ప్రాణశక్తిని నేరుగా, ప్రభావితం చేస్తుంది అని ఆయన నిరూపించారు కూడా! ఈ ప్రయోగం చేయబడిన రేగి చెట్టు ఆకు 5 వారాల వరకూ పచ్చగానే ఉన్నది. అదే సమయంలో కోయబడిన ఇతర ఆకులు త్వరగా వాడిపోయి, ఎండిపోయినవి.

మొక్కలు మనుషులతో మాట్లాడే ఖచ్చితమైన సమయాన్ని తెలుసుకొనటానికి కూడా వోగోల్ పరిశోధనలు చేశారు. ఈ ప్రయోగం కోసం ఆయన గాల్వనా మీటరును బిగించారు. దానితోపాటే తాను కూడా సంపూర్ణమైన విశ్రాంతిని తీసుకుంటూ మొక్క సమీపంలోనే కూర్చుని, స్నేహితులతో మాట్లాడిన రీతిలోనే మంచి మంచి సౌహార్ద్ర పూర్ణమైన భావనలను ఆలోచనలను ఆ మొక్కకు పంపించారు. వోగోల్ ఈ ప్రయోగాన్ని చేసినప్పుడల్లా, పెన్ హోల్డర్ ఛార్టు మీద తన సక్రియతను గీతల ద్వారా చూపించింది. వోగోల్ ఆ క్షణాలలో మొక్కను స్పర్శిస్తూ, తన చేతివ్రేళ్ళలో మొక్క నుండి వెలువడే శక్తి ప్రవాహాన్ని అనుభూతి చెందారు. ఒక్కొక్కసారి అవి చాలా శక్తివంతంగానూ, ఒక్కొక్కసారి నిస్తేజంగానూ నిర్లిప్తంగానూ ఉండేవి.

మానవీయ చేతనత్వము కేంద్రీకృత స్థితిలో మొక్కలు విశేష రూపంలో ప్రభావితమౌతాయని కూడా తన పరిశోధనలలో వోగోల్ గమనించారు. మమత, ప్రేమ, తనది అనే సౌహార్ద్ర భావముల ద్వారా మొక్కలను సుషుప్తావస్థ నుండి మేల్కొల్పగలము. అంతేకాదు, మానవులు మొక్కలతో మాట్లాడగలరు అని కూడా వోగోల్ నిరూపించగలిగాడు. మొక్కలలో కూడా భావ సంవేదనలు ఎక్కువ పరిమాణంలోనే ఉంటాయి. అవి మానవుల వలె చూడలేకపోవచ్చు. మాట్లాడలేక పోవచ్చు, కానీ మానవుల భావాలను అర్థం చేసుకొనుటలో అవి నూటికి నూరుపాళ్ళు శక్తివంతమైనవి, మానవులకు లాభదాయకమైన శక్తిని కూడా ఇస్తూ ఉంటాయి.

మనదేశ ప్రజలకు వృక్షాల యొక్క, మొక్కల యొక్క ఈ శక్తి మండలాన్ని గురించిన జ్ఞానం ఉన్నది. అందుచేతనే తమ శక్తిని పూరించుకొనటానికి కొంతమంది దేవదారు వృక్షాన్ని కౌగిలించుకొనడము, వీపును ఆనించి కూర్చొనటం వంటి పనులు చేస్తూ ఉంటారు.

కొండ ప్రాంతాలలో ఈ సాంప్రదాయం ఇప్పటికి అమలులో ఉన్నది. న్యూయార్క్‌కు చెందిన మానసిక వైద్య నిపుణుడు జాన్ పియర్‌కోస్ మానవులు - మొక్కల మధ్య శక్తిస్పందనను కొలిచారు. స్ప్రూస్, దేవదారు వృక్షాల సమీప ప్రాంతాలలో, ప్రతి నిముషమూ 18 నుండి 22 యూనిట్ల వరకూ శక్తి స్పందనలు ఉంటాయని ఆయన అభిప్రాయం. అదే మానవులలో అయితే ఈ శక్తి స్పందన నిమిషానికి 15 నుంచి 25 యూనిట్ల వరకు ఉంటుంది. మానసిక చికిత్సా నిపుణుడు పియర్ కోస్ తన రోగుల మానసిక, శారీరిక సమస్యలకు చికిత్స చేయటంలో వారి ఆరోగ్యాన్ని పరీక్షించి, మెరుగుపరచటానికి మొక్కల సహాయాన్ని తీసుకునేవారు. రోగులను చూడగానే, వారితో మాట్లాడకముందే, వారి ఇండ్లలోని మొక్కల వలన ఏర్పడే ప్రభావాన్ని గమనించ గలిగేవారు. మొక్కల యొక్క స్పందన రోగుల యొక్క స్పందనకు అనుగుణంగా ఉండేది.

పైన చెప్పబడిన అన్ని రకాలైన వైజ్ఞానిక పరిశోధనలు, "మొక్కల యొక్క సంవేదనా శీలతను మానవులతో వాటి స్నేహ సంబంధాలను" (ఎటువంటి భిన్నాభిప్రాయం లేకుండా) ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నాయి. మన భారతదేశంలో ప్రాచీన మహర్షులు ఈ సత్యాన్ని ప్రామాణికంగా, ప్రతిపాదించారు. వారి ఉపదేశాలకనుగుణంగా ప్రజలలో వృక్షాలను పూజించటం గౌరవించటం వంటి భావాలు స్థిరంగానూ విస్తృతంగానూ వ్యాపించినవి. చెట్లు, మొక్కలు తమ నుండి ఉత్పత్తి చేయబడిన ఫల, పుష్పాదులను మానవులకు అర్పించటంలో ఎంతో హర్షాతిరేకంగా ఉంటాయని, ఈ విధంగా మానవులతో బాంధవ్యాన్ని అవి ఆకాంక్షిస్తుంటాయని, బదులుగా వారి నుండి ప్రేమాభిమానాలను కోరుకుంటూ ఉంటాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అవి కూడా సుఖదుఃఖాలను, కష్టాలను, బాధలనూ అనుభవిస్తుంటాయని తెలుస్తున్నది. 'తనది, తనవారు' అన్న భావన లేనపుడు, అది 'అవమానం' గా అర్థం చేసుకొనవలెను.

మొక్కలు మౌనంగానే మన పట్ల చేసే తిరస్కారంగాని, లేదా మనకు ప్రసాదించే ఆశీర్వాదాలు గాని ఏవైనా వాటి ప్రభావం నుండి మనం తప్పించుకొనలేము. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న "అసంతులిత పర్యావరణం" - మొక్కలు మన పట్ల చూపిస్తున్న తిరస్కారమే. అందుచేత ఇప్పుడు మనకు వాటి ఆశీస్సులు కావాలి. మన యొక్క అభివృద్ధి కోసం పాటుపడటంతో పాటు, మొక్కల సంరక్షణ వాటి వికాసం మీద కూడా సరియైన శ్రద్ధ చూపించాలి. అప్పుడే మనం ఈ పర్యావరణాన్ని, దానితో పాటే మన జీవితాలను స్వచ్ఛత, శాంతి, సాత్వికత్వముతో నింపి వేయడమనే కల్పనను సాకారం చేసుకొనగలము.

*- అఖండజ్యోతి, మే 2000*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

**మన మాటలు, చేతలు మన వ్యక్తిత్వాన్ని అభివ్యక్తం చేస్తాయి.**

జన్మశతాబ్ది ప్రత్యేకం

# వృక్ష గంగా మహోత్సవాన్ని ఇలా జరుపుకోవాలి

**చెట్లు నాటడం ఎంతో పుణ్యప్రదం. జన్మశతాబ్దిలో గురు పూర్ణిమ (15,16,17 జులై) నుండి శ్రావణ పూర్ణిమ (13,14 ఆగస్టు) వరకు చెట్లతో మైత్రి, ఆప్యాయతలు స్థాపించుకుని వాటిని పోషించాలనే బృహత్ కార్యక్రమం నిర్ణయించబడింది. మన గురుసత్తాకి ఇంతకు మించిన సార్థక శ్రద్ధాంజలి మరేదీ అర్పించలేము.** ఎన్నో రాష్ట్రాల వనసంరక్షణా విభాగాల నుండి, నర్సరీల నుండి, సేవా సంస్థల నుండి, జలసంరక్షణ విభాగాల నుండి ఈ కార్యానికి సహకారం అందిస్తామని వాగ్దానం లభించడం గాయత్రి పరివారంపై విశ్వాసతకు సంకేతం.

ఈ పరమపావన శ్రద్ధాంజలి ఎలా అర్పించాలి? మన పరివారం దేశంలోని కుగ్రామాల నుండి నగరాల వరకు విస్తృతంగా వ్యాపించింది. వృక్షారోపణకై ఎన్నో ప్రయోగాలు చేయవచ్చు.

1. ఎండిపోయిన పర్వత ప్రాంతాలలో వృక్షారోపణ సంకల్పం చేయించి స్మృతి వనాలను ఏర్పాటు చేయవచ్చు.
2. నగరాలలో మరుగునబడ్డ బాగోగులు నోచుకోని ప్రభుత్వ పార్కులను దత్తత తీసుకుని వాటిని స్మృతి వనాలుగా రూపు దిద్దవచ్చు.
3. గుళ్ళల్లో, ఉద్యానవనాల్లో నక్షత్ర వాటికలు, రాశి వాటికలు, గ్రహ వాటికలు, వాస్తువాటికలు నిర్మించవచ్చు. వీటి ఆధారంగానే జ్యోతిష్కులు ధనరాశులను మూటగట్టుకుంటున్నారు. నిజమైన లాభం ఈ వాటికలే స్వయంగా ఇస్తాయి.
4. నదీతీరాలు, చేనుగట్ల వద్ద భూమి క్షీణించకుండా ఆపే, వ్యవసాయానికి ఉపయోగపడే, నీడనిచ్చే చెట్లను నాటాలి.
5. గుళ్లల్లో ధార్మిక మహత్తు కలవి, పర్యావరణాన్ని రక్షించేవి అయిన అ) త్రివేణి – రావి, మర్రి, వేప చెట్లు ఆ) పంచవటి – రావి, మర్రి, వేప, నేరేడు, ఉసిరి చెట్లు ఇ) తులసి, పూల మొక్కలు, అరటి, శమి మొదలైన చెట్లు ఈ) హరిశంకరి – రావి, మర్రి, జువ్వి చెట్లను నాటవచ్చు.
6. ప్రతి గ్రామంలోని, దేవస్థానాలలో, బంజర భూముల్లో, వనాలలో వృక్షాలను నాటవచ్చు.
7. ప్రతి విద్యాలయంలో 'తరుమిత్ర' యోజన కింద విద్యార్థుల చేత వృక్షాలను నాటించవచ్చు.
8. రాష్ట్రీయ రహదారులలో మరియు నేషనల్ హైవేస్‌లో పండ్లను, నీడని ఇచ్చే చెట్లను నాటవచ్చు.
9. శ్మశాన వాటికల్లో పర్యావరణ, ధార్మిక మహత్తుకల వృక్షాలను నాటవచ్చు.
10. విశ్వవిద్యాలయాల ఆవరణల్లోనూ, చుట్టుపక్కల కూడా నిండుగా వృక్షారోపణ చేయవచ్చు.

గాయత్రీ పరివారంలోని ప్రతి ఒక్కరు ఒక్కో చెట్టును మొక్కను నాటి వాటిని సంరక్షించే బాధ్యత స్వీకరిస్తే వృక్ష గంగా మాహోత్సవం అప్రయత్నంగా సాగుతూనే ఉంటుంది.

సంకల్పం తీసుకున్న వ్యక్తులకు గుర్తుగా సంకల్ప సూత్రాన్ని కట్టాలి. ఎంచుకున్న వృక్షమునకు కూడా సంకల్ప సూత్రాన్ని కట్టాలి. కనీసం 1–2 సంవత్సరాలు వాటి సంరక్షణ చేసే బాధ్యతను అప్పజెప్పాలి.

**భూమి, మొక్కలు, పరికరాలు ఎక్కడ నుండి సమకూరుతాయి:**

1. గ్రామాలలో అక్కడి కరణాల దగ్గర నుండి భూమికి, పొలాలకు సంబంధించిన వివరాలు సేకరించి పంచాయితీలో వృక్షారోపణ గురించి ప్రస్తావించి, ఒప్పించాలి.
2. రైల్వే భూములలో వృక్షారోపణ చేయడానికై రైల్వే విభాగం నుండి అనుమతి పొందాలి.
3. నగరాలలో వీధి చివర్లలో నాటిన చెట్లకు నగరపాలక సంస్థల నుండి ట్రీ గార్డులు సమకూర్చవచ్చు. ఇతర విభాగాలు, కార్పొరేట్ సంస్థల చేత స్పాన్సర్ చేయించవచ్చు.
4. చవక వెదురును కొనుగోలు చేసి వాటితో చకవగానే ట్రీగార్డులు తయారు చేయవచ్చు.
5. నేషనలైజ్డ్ బ్యాంకు, బీమా కంపెనీలు, మొబయిల్ కంపెనీలు, పెట్రోలియం కంపెనీలు కూడా ట్రీగార్డులకు సంబంధించిన సామాన్లు ఇప్పిస్తారు. వారిని సంప్రదించవచ్చు.
6. వనసంరక్షణా విభాగాల నుండి, ఉద్యావవన విభాగాల నుండి, నర్సరీల నుండి మొక్కలు సమకూర్చుకోవచ్చు. ఈ విధంగా గాయత్రీ పరివారం స్వయంసేవకులు మొక్కలు సులభంగా అందుబాటులో ఉండేలా చేసుకొనవచ్చు. నగరపాలక, పంచాయతి ప్రముఖుల వద్ద స్మృతి ఉపవనాలకి, పార్కులకి అవసరమయ్యే నిధులుంటాయి. వాటి ఆధారంగా వారు కూడా మొక్కలు ఇప్పించగలరు.

**ఇతరుల సలహాలు, విమర్శలు వినగలగాలి.**

జులై 15 నుండి 17 వరకు గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా వృక్షగంగా మహోత్సవం ఏర్పాటు చేయబడింది. తరుమిత్ర యజ్ఞాలు కూడా ఏర్పాటు చేయబడతాయి. **యజ్ఞాల తర్వాత ప్రతి శక్తిపీఠం 1000 చెట్లను సంకల్ప సహితంగా ప్రసాదంగా పంచాలి.** నాటిన స్థలాన్నీ, ఆచూకిని కేంద్రానికి లిఖిత పూర్వకంగా అందించడం వల్ల అనుయాజకు వీలుగా ఉంటుంది.

ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పలు చోట్ల వృక్షాగంగా అభియానం మీద, పర్యావరణ సంరక్షణ మీద కాంపిటీషన్ (చిత్రలేఖనం, వ్యాసాలు, భాషణలు) ఏర్పాటు చేయాలి. గుంటలు తవ్వడం, వాటిలో మట్టి, ఎరువులు వేయడం మొదలైన పనులు 15 జులైకి ముందే పూర్తవ్వాలి. నీటి వ్యవస్థతో పాటు వృక్షాలను సంరక్షించే సమితులు కూడా ఏర్పాటవ్వాలి. **మహారాష్ట్రలోని అకోలాకు చెందిన 72 ఏళ్ల ఘూటే గురువుగారు (శ్రీరామచంద్ర సూర్యాభాన ఘూటే) గొప్ప ప్రయోగం చేశారు. మండుటెండల్లో కూడా 'వన్ లీటర్ వండర్' పద్ధతిలో చెట్లు జీవించి ఉండగలవని అంటున్నారు. ఇందులో భాగంగా ఒక అడుగు వ్యాసంతో ఒక వృత్తాకారంలో గుంట తవ్వి, అందులో మట్టి, పేడ కలిపి అందులో చెట్టుని నాటాలి. పాత ఒక లీటరు మినరల్ వాటర్ బాటిల్‌ను క్రింద భాగం కత్తిరించి, దాని మూత తీసి మూతవైపు భూమిలో ఉండేలా, మూడు అంగుళాలు మాత్రం బైటకు కనిపిచ్చేలా దాన్ని చెట్టు ప్రక్కనే పూడ్చాలి, ప్రతిరోజూ ఒకే సమయానికి ఈ బాటిల్‌లో సరిగ్గా ఒక లీటరు నీటిని నింపుతూ ఉంటే అవి మండుటెండల్లో కూడా ఆ చెట్లు బతికే ఉంటాయి. వర్షాలొస్తే పూర్తిగా పెరుగుతాయి. ఘూటే గారు ఈవిధంగా వేల చెట్లను నాటి వాటిని పెంచారు.**

ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సంవత్సరంపాటు సక్రియంగా నడిచే విధంగా పలుచోట్ల తరుపుత్ర, తరుమిత్ర, తరుపితా సంఘాలు ఏర్పడాలి. ఈ విషయం ఆలస్యంగా తెలిసినప్పటికి ఈ వాక్యాలు చదివిన వెంటనే పనిని ప్రారంభించాలి.

ఈ సంవత్సరం ఒక విలక్షణ ప్రయోగం చేయబడుతోంది. పరమపూజ్య గురుదేవుల జన్మస్థలం 'ఆవల్‌ఖేడా'. ఒకప్పుడు అక్కడ దట్టమైన ఉసిరి వనాలుండేవి. ఇప్పటికి కొన్ని ఉన్నాయి. ప్రతి యజ్ఞం, సంస్కారం తర్వాత ప్రసాదంగా ఉసిరి మొక్కలను పంచవచ్చు. గురువుగారి పౌతృక గృహంలో ఆయన వేపచెట్టుని నాటారు. ఆ చెట్టు కొమ్మల నుండే వేపమొక్కలు తయారు చేయబడుతున్నాయి. వాటిని పంచవచ్చు. ఈ సంవత్సరం దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఒక విలక్షణమైన ప్రయోగాన్ని చేపట్టారు. మృత్యుంజయ సభా ప్రాంతానికి ఎదురుగా 'శ్రీరామ స్మృతి ఉపవనం' ఏర్పాటు చేశారు. దేశమంతటిలోని శక్తి పీఠాలలో, మండలాలలో భూమి అందుబాటులో ఉంటే, ఇదే పద్ధతిలో వనాలను స్థాపించుకోవచ్చు.

ఈ సంవత్సరం పూనుకున్న వృక్షారోపణలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలు ఒక్కొక్కటి 10 లక్షల వృక్షాలు నాటే బాధ్యతనిచ్చారు. ఉత్తరాఖండ్ 5 లక్షలు, మహారాష్ట్ర 8 లక్షలు, జార్ఖండ్ 5 లక్షలు, బీహార్ 5 లక్షలు, ఢిల్లీ – ఎన్‌సీఆర్ 5 లక్షలు, పూర్వోత్తర ప్రాంతాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి 10 లక్షలు, పంజాబ్ 1 లక్ష, ఒడిస్సా 8 లక్షలు, తమిళనాడు 50 వేలు, హర్యానా 50 వేలు, బెంగాల్–ఆంధ్ర–కర్నాటక–కేరళల్లో ఒక్కో లక్ష మొక్కలు నాటాలి. ఈ విధంగా చేస్తే ఒక కోటి చెట్లు నాటే సంకల్పం నెరవేరుతుంది. ఆయా స్థలాలలోని గాయత్రీ పరివార పరిజనుల సంఖ్య ఆధారంగా ఈ లక్ష్యాలు నిర్ధారించబడ్డాయి. ఇంకా ఎక్కువగా కూడా చేయవచ్చు.

ఆధునికీకరణ, అర్బనైజేషన్ పేర్లతో గుడ్డి పరుగులో నిత్యం బోసిపోతున్న భూమాతను పచ్చదనంతో నింపేయడం కన్నా ఈ సంవత్సరాన్ని ఒక అద్భుత మధురానిభూతిగా మిగల్చడానికి వేరే కారణం ఏం కావాలి! ఈ అభియానం, సంఘటనలతో కలిసి కొత్త ఉత్సాహాన్ని తెస్తుందనే ఆశిద్దాం, విశ్వసిద్దాం, గ్లోబల్ వార్మింగ్ వల్ల వచ్చే ఆపదలు తగ్గుతాయి, చెట్ల అవసరం, అవి చేసే మేలు మరింతగా తెలిసి వస్తుంది.


*– అఖండజ్యోతి, జులై 2011*

## అసత్యం చెప్పలేదు

*ఆనాటి బెంగాల్ ముఖ్యమంత్రి డా॥ విద్యాచంద్రరాయ్ బాల్యం నుండి మానవ సద్గుణాలను స్వీకరించే మహనీయుల్లో ఒకరుగా ఉండేవారు. సత్యం చెప్పటమనేది ఆయనకు తండ్రి నుండి సంక్రమించిన వారసత్వం. ఒకసారి అతని అధ్యాపకుడు అబద్ధపు సాక్ష్యమిచ్చి మోటారు ప్రమాదంలో తనను నిర్దోషిగా నిరూపించమని రాయ్‌ని కోరాడు. కాని బాలుడు నిజమే చెప్తానని ఖచ్చితంగా చెప్పాడు. తాను చూచిన దానినే చెప్పాడు. అధ్యాపకునికి కోపం వచ్చింది. విద్యార్థిని పరీక్షలో తప్పించాడు. విద్యలో ఒక సంవత్సరం నష్టపోవలసి వచ్చింది. అయినా అబద్ధం చెప్పనందుకు చాలా తృప్తిని అనుభవించాడు. ఆ సద్గుణం వల్లనే భవిష్యత్తులో గొప్ప డాక్టరయ్యాడు. గొప్ప రాజకీయ నాయకుడయ్యాడు. తల్లిదండ్రులు బిడ్డలకు చక్కని సంస్కారాన్నందించాలి.*

*– ప్రజ్ఞా పురాణం నుండి*

**ఆత్మ విశ్వాసంగల వారు తాము చేపట్టిన పనిని తమ నుండి వేరుచేసి సమీక్షించుకోగలుగుతారు.**



## పూజ్య గురుదేవుల అమృతవాణి

# బ్రహ్మవర్చస్సును అభివృద్ధి చేసే సాధన గాయత్రీ ఉపాసన

*(గత సంచిక తరువాయి...)*

**మంత్రం తూటా వంటిది. మనిషి వ్యక్తిత్వం తుపాకి వంటిది.** తూటా గొప్పతనం తూటాకి ఉంది. కాని దానికంటే చాలా విలువైనది తుపాకి. అది ఉత్తమమైన లోహంతో పోతపోసి తయారుచేయబడుతుంది. మనం మన స్వభావమును, జీవితమును అతి ఉన్నతమైనదిగా తీర్చిదిద్దుకోవాలి. **మనలను మనం సంయమనం గల బ్రహ్మచారిగా, విశ్వాసపాత్రునిగా, కీర్తివంతుడిగా, సజ్జనుడిగా మలచుకోవాలి. బ్రాహ్మణునకు నిర్వచనం ఇదే. బ్రాహ్మణత్వం జన్మతోకాక, కర్మతో వస్తుంది.** మన కర్మలు కూడా బ్రాహ్మణులవలె ఉండాలి. ఈనాటి బ్రాహ్మణత్వం ఖండఖండాలుగా చిన్నాభిన్నమైపోయింది. దాన్ని తిరిగి సవరించుకోవలసిన అవసరమున్నది. **మనం తిరిగి సదాచారులుగా, విద్యావంతులుగా, సేవాభావంగల, నిజాయితీపరులుగా మారవలసి ఉంది.** అలాంటి వ్యక్తులను మనం మన సాధన ద్వారా మలచగలిగితే మనం బ్రాహ్మణత్వమునకు సేవ చేయగలం. గాయత్రీమంత్రంతో జోడించబడిన చమత్కారములను, అలాగే యజ్ఞం ద్వారా జరిగే అద్భుతములను మనం చూడగలం.

యజ్ఞం యొక్క మహత్వం అసాధారణమైనది. దశరథ మహారాజు చేసిన పుత్రకామేష్టి యజ్ఞం కథ సుప్రసిద్ధమైనది. రావణుడు యుద్ధంలో ఓడిపోతున్నప్పుడు అతను శ్రీరాముని శక్తితో తలపడటానికి ఒక యజ్ఞం చేయాలని సంకల్పించాడు. రామలక్ష్మణులకు ఈ యజ్ఞ విషయం తెలిసిన వెంటనే 'ఒకవేళ యజ్ఞం పూర్తయితే మన విజయం కష్టమౌతుంది' అన్నారు. వెంటనే హనుమంతుడు వెళ్ళి యజ్ఞమును ధ్వంసం చేశాడు. యజ్ఞం శక్తి చాలా గొప్పది. అది ఒక కర్మకాండ, కొన్ని వస్తువులు సమకూర్చుకుని వాటిని అగ్నిలో సమర్పించటం మాత్రమే కాదు, శక్తుల ఆహ్వానం, ఆవాహన. ఆ శక్తులు ఎటువంటివంటే వాటి ఆవాహనతో మనుష్యులు నగణ్యస్థాయినుండి ఉన్నతస్థాయికి ఎదుగుతారు. **బ్రాహ్మణులు జన్మించరు, వారు యజ్ఞాగ్ని ద్వారా పరిపక్వం చేయబడతారు.** అనగా సంస్కరించబడతారు. కుండ దానంతట అదే తయారవదు, తయారయిన తరువాత బట్టీలో కాల్చబడుతుంది.

**'మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయాంక్రియతే తనుః'** అనగా బ్రాహ్మణుడు పుట్టడు, యజ్ఞముల ద్వారా, మహాయజ్ఞముల ద్వారా పరిపక్వం చెందుతాడు, సంస్కరించబడతాడు. మేఘాలు తపించబడతాయి. పులగం ఎక్కడా అప్పటికప్పుడు సంసిద్ధంగా లభించదు, వండబడుతుంది. బ్రాహ్మణులు కూడా జన్మించరు, యజ్ఞాగ్నిద్వారా సంస్కరించబడి, పరిపక్వం గావించబడతారు.

ప్రాచీనకాలంలో మనం యజ్ఞపితకు భోజనం సమర్పించిన తరువాత భుజించేవారం. అగ్నిహోత్రం మన జీవితంలో ముఖ్య భాగం. గాయత్రీ తపోభూమిలో అఖండాగ్ని స్థాపించబడినది. మేం అక్కడ అఖండజపం చేశాం. దాని ఫలితంగానే బ్రహ్మవర్చస్సు లభించినది. ఆ గాయత్రినే మీరు ఉపాసిస్తున్నారు. ఈనాటి పరిస్థితులలో యజ్ఞం యొక్క అవసరం ఎంతో ఉంది. దానినే మీరు పలుచోట్ల చేస్తున్నారు. యజ్ఞం ద్వారా సమాజానికి గొప్ప మేలు జరుగుతుంది. యజ్ఞం ద్వారా జనుల శారీరక, మానసిక దు:ఖములు తొలగిపోతాయి. మీరు ప్రయోగాలు చేసి చూడండి. హవనం వద్ద కూర్చుని ఆహుతులు ఇచ్చినవారి రోగాలు తొలగిపోయాయా, లేదా అన్న విషయమును, గాయత్రీ హవనంలో భాగస్వాములైనవారు తమ శారీరక వ్యాధుల నివారణ ద్వారా పరీక్షించి చూడండి. మానసిక రోగాలైన క్రోధం, కామం, పిచ్చి, ఉన్మాదం మొదలైనవి ఉన్నవారిని హవనంలో భాగస్వాములను చేసినట్లయితే అది వారి శారీరక, మానసిక వ్యాధులను దూరం చేస్తుందో, లేదో పరీక్షించి చూడండి. ఇది వ్యక్తికి సంబంధించిన విషయం.

ఇప్పుడు నేను వ్యక్తిగురించి కాక, సమస్త ప్రపంచం యొక్క కళ్యాణమును గూర్చి మాట్లాడుతున్నాను. శ్రీరాముడు లంకారాజ్యం మీద విజయం సాధించి తన గృహమునకు తిరిగివచ్చి వశిష్ఠులవారిని ఇలా ప్రశ్నించాడు. 'ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి? 'రామా! నీ చేతిలో స్థూల శరీర రావణుడు మరణించాడు. కానీ సూక్ష్మ రావణుడు ఆకాశమంతటా వ్యాపించి జీవించేవున్నాడు. రావణుడు చేసిన చెడు పనుల ఫలితం వాతావరణమంతటా వ్యాపించింది. వాతావరణంలో వ్యాపింపజేసిన చెడు ఆలోచనల వలన ఆకాశమంతా కలుషితమైనది. దానిని శాంతింపజేయాలి' అని వశిష్ఠులవారు శ్రీరాముని ఆదేశించారు. శ్రీరాముడు వశిష్ఠుల వారిని ఇలా అడిగాడు 'స్థూలశరీర రావణుడిని అంతం చేశాను, కానీ సూక్ష్మరావణుడు ఎలా మరణిస్తాడు? ఈ కాలుష్యం ఎలా నశిస్తుంది?' వశిష్ఠమహర్షి 'అశ్వమేధయజ్ఞంతో నశించి పోతుంది' అని జవాబిచ్చారు. శ్రీరాముడు పది అశ్వమేధములను కాశీలో చేశాడు. ఆ ప్రాంతమును దశాశ్వమేధ ఘాట్ అనే పేరుతో పిలుస్తారు. అశ్వమేధ యజ్ఞ పరంపర పూర్తి అయిన తరువాత వశిష్ఠులవారు 'ఆకాశంలో వ్యాపించిన చెడు, విధ్వంసకర పరిస్థితులు, హింస మొదలైనవాటి నివారణ జరిగింది, కనుక సూక్ష్మశరీర రావణుడు మరణించాడు' అని అన్నారు.

గడచిన కాలంలో రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. వాటిలో ఎంతోమంది మనుష్యులు చంపబడ్డారు, ఎన్నో జీవుల హత్య జరిగింది, ఎన్నో తుపాకి గుళ్ళు పేలాయి, ఎంతో

**ఆత్మన్యూనత వేరు - నమ్రత వేరు.**

మందుగుండు పదార్థం ఆకాశమంతా అలముకుంది. అంతరిక్షం కలుషితమైనది. కలుషిత ఆకాశం నుండి సంస్కారములను గ్రహించిన బాలకులే ఈనాడు జన్మిస్తున్నారు. వాన కురిసినా, విత్తనాలు మొలకెత్తినా, వనస్పతులు అంకురించినా, ప్రాణులు జన్మించినా అన్నీ పుట్టుకతోనే ఆ విషపూరిత ఆకాశంలోని సంస్కారములనే వెంటతీసుకొస్తున్నాయి. ' మాకు చక్కని సంతానం లభించినది, కానీ వీరిలో సుసంస్కారం కొరవడింది, దీనికన్నా సంతానం లేకపోవటమే మేలు' అని తల్లిదండ్రులు రోదిస్తారు అటువంటి చెడు సంస్కారం ఆకాశంలో వ్యాపించి ఉన్నది. శ్రీకృష్ణభగవానుడు కూడా పాండవుల చేత యజ్ఞములను చేయించాడు. 'శ్రీకృష్ణా! మాకు రాజ్యసింహాసనం లభించినది, కనుక మేం విశ్రాంతిగా ఉన్నాం, ఇప్పుడు మేం ఏమి చేయాలో తమరు సెలవియ్యండి' అని పాండవులు శ్రీకృష్ణుని ప్రార్థించారు. 'సూక్ష్మశరీర దుర్యోధనుడు ఇంకా మరణించలేదు, సూక్ష్మ కంసుడు, సూక్ష్మ జరాసంధుడు, సూక్ష్మ శిశుపాలుడు ఇంకా జీవించే ఉన్నారు, వారు మరణించలేదు, కేవలం శరీరధారులైన కౌరవులు, శరీరధారియైన శిశుపాలుడు మాత్రమే మరణించారు. అయితే సూక్ష్మ శరీరధారులైన కౌరవులు ఇంకా బ్రతికేవున్నారు, వారు చంపబడాలి' అని శ్రీకృష్ణుడు అన్నాడు. పాండవులు 'మరి ఇప్పుడు ఏమి చెయ్యాలి? వారెలా మరణిస్తారు?' అని ప్రశ్నించారు. రాజసూయ యజ్ఞంతో మీ లక్ష్యం నెరవేరుతుంది అని జవాబిచ్చాడు శ్రీకృష్ణుడు.

ఆ యజ్ఞంతో ఆకాశం, అంతరిక్షం శుద్ధిచేయబడినాయి. అంతరిక్ష శుద్ధికి మరియు జన్మించబోయే నవతరమంతటికి, సమస్యలతో బాధపడుతున్నవారికి, ఆపదలు, కష్టములతో చుట్టుముట్టబడినవారికి, సమస్త మానవజాతి హితము కొరకు చేయు యజ్ఞం పరోపకారమైన సేవా కార్యక్రమం. దీన్నిమించిన పరోపకారం మరేదీలేదు. ఇది మానవజాతికంతటికి బ్రహ్మభోజనం. దీన్ని మించిన బ్రహ్మభోజనం మరేదీ ఉండదు. దీనితో విశ్వంలోని సమస్త ప్రాణులకు, వృక్షవనస్పతులకు పుష్టిచేకూరుతుంది. తద్వారా అందరూ బలవంతులు మరియు రోగరహితులు అవుతారు. అందరి కషాయ-కల్మషములు హరించబడతాయి. అందరికి శాంతి లభిస్తుంది. యజ్ఞం వలన అసంఖ్యాక మానవుల వ్యాధులు, శారీరక, మానసిక వికారములు తొలగిపోతాయి. యజ్ఞంతో విశ్వంలో శాంతి వెల్లివిరుస్తుంది. రెండు ప్రపంచ యుద్ధాల ద్వారా, చెడు సినిమాల వలన అంతేకాక దుష్ప్రభావం కలిగించే పాటల వలన కలుషితమైన ఆకాశమును వేదమంత్రాలతో యజ్ఞం చేయుట ద్వారా శుద్ధిచేయవచ్చును. దీనిలో సమస్త విశ్వకళ్యాణం దాగివుంది. యజ్ఞం చేయాలని సంకల్పించిన వారందరి మేలు అందులో దాగివుంది. మీరు చేస్తున్న, చేయబోయే యజ్ఞముల గురించి స్వయంగా వేద భగవానుడే విశ్వాసం కలిగిస్తూ, తనే బాధ్యత వహిస్తూ ప్రతిజ్ఞా బద్ధుడై ఇలా అన్నాడు. 'ఏ మానవులైతే తగిన హవనద్రవ్యమును తెచ్చి హవనం చేశారో, మేం వారి కోరికలను తీరుస్తాము వారి చేతులను దండిగా నింపుతాము'. నువ్వు ఒక చెంచా ఆవునెయ్యి తీసికొచ్చి హవనం చేస్తే మేము నీ సమస్త కోరికలను తీర్చుతాము. ఇది బ్యాంక్‌లో జమ చేసిన డబ్బులతో సమానం. **యజ్ఞం కేవలం వస్తువులను మండించడమేకాక, మనం హవనం చేసిన వస్తువుల కంటే లక్షలరెట్ల పదార్థములను ఆకాశమంతా వ్యాపింపజేస్తుంది. ఇదొక వైజ్ఞానిక ఉపాయం, ఉపచారం. యజ్ఞం బ్రహ్మతేజస్సును జాగృతపరిచే విధి.**

మీరు ఉపాసన చేస్తున్న గాయత్రీమంత్రమును బ్రహ్మాస్త్రం అంటారు. ఇది బ్రాహ్మణుల ఆయుధం. దీన్ని కామధేనువు, కల్పవృక్షము, అమృతం, పరసువేది అని కూడా అంటారు. పరసువేదిని స్పృశించిన ఇనుము బంగారంగా మారుతుంది. గాయత్రి వేదమాత. వేదమాతకు మీరు చేస్తున్న కర్మకాండలు ప్రశంసనీయమైనవి. అయితే మీరు దాన్నిమించి మరొక అడుగు ముందుకు వేయాలి. **గాయత్రికి మరో పేరే సావిత్రి కనుక ఆమె మీ మెడలో వరమాల వేసేందుకు గాయత్రీ ఉపాసన చేసేవారందరూ సత్యవంతులుగా మారాలి. గాయత్రీమాత శక్తులకు మూలం, దేవత్వమునకే దేవత అనగా దేవమాత.** గాయత్రియే బ్రహ్మవర్చస్సు, గాయత్రియే సమస్తము. గాయత్రీ ఉపాసన చేయువారివద్ద లేని వస్తువంటూ ఉండదు. గాయత్రి సత్యయుగంలోనూ ఫలితాన్నిచ్చింది, కలియుగంలోనూ ఫలితాన్ని చేకూరుస్తుంది. అయితే దీనికిగాను ఒక షరతు ఉంది. ఏయే వ్యక్తులైతే గాయత్రీ ఉపాసనపట్ల ఆకాంక్షతో ముందడుగు వేశారో వారు సాధించవల్సిన అంశం మరొకటి ఉంది. **తమ జీవితమును ఉత్తమంగా, ఉజ్జ్వలంగా మలచుకోవాలి. సదాచారులు, వివేకవంతులు, శిష్టులు, పవిత్రులు మరియు పరోపకారులుగా అవ్వాలి.** తమను తాము బహువిధములుగా సంస్కరించుకుంటూ ముందుకు సాగేవారి జీవితం పవిత్రం మరియు నిర్మలం అవుతూ ఉంటుంది. అదేవిధంగా భగవంతుని నామ మహిమ ప్రభావం మరియు గాయత్రీమాత కృప మీమీద వర్షిస్తూ ఉంటాయి. గాయత్రీమంత్రమునకు మరియు ఇతర మంత్రములకు, సమస్త ఆధ్యాత్మిక జగత్తుకు ఇదే తాళంచెవి అన్నదే ఇందలి రహస్యం.

నేను ఈ మార్గం గుండా ఇంతవరకూ ప్రయాణిస్తూవచ్చాను. మీరు ఉపాసన చేస్తున్న గాయత్రి అనగా బ్రహ్మతేజస్సు, నేను ఉపాసిస్తున్న గాయత్రీమంత్రం ఒక శక్తిపుంజం అన్న అనుభవము సంపాదించుటలో నేను కృతకృత్యుడనయ్యాను. నా జీవితమంతా నేను చేసిన కార్యం గాయత్రీ ఉపాసన. ఈ పనితో ఎన్ని లాభాలు చేకూరగలవో అవన్నీ నాకు ప్రాప్తించాయని నాకు తెలుసు. మీరు కూడా నా వలెనే లాభాన్వితులవ్వాలి, అంతేకాదు పూర్వకాలపు ఋషులు లాభాన్వితులైనట్లుగానే మీరు కూడా లాభాలని పొందాలి అన్నదే నా ఆకాంక్ష.

(పరమ పూజ్యగురుదేవులు కెన్యా రాజధాని నైరోబిలో 1972 డిశంబరు 11 నాడు ఇచ్చిన దివ్య సందేశం)

*- అఖండజ్యోతి, మార్చి 1993*
*అనువాదం: లక్ష్మీ రాజగోపాల్*

నమ్రత ఆత్మాభిమానానికి చిహ్నం.



## పూజ్య గురుదేవుల అమృతవాణి-2

# గురుపూర్ణిమ సందేశం

సోదర సోదరీమణులారా! గురువు శక్తి మహోన్నతమైనది. గురువు బ్రహ్మ, గురువు విష్ణువు, గురువు మహేశ్వరుడు, గురువు సాక్షాత్తూ పరబ్రహ్మ. మా గురువుగారు చాలా సమర్థులు. గాయత్రీమాతలో ఉన్న సమర్థత, చమత్కారము మా గురువుగారిలో కూడా ఉన్నవి. కొంతమంది నన్ను అడిగారు మీ గురువుగారు దేవుడా? అని, అది వేరే విషయం. లేకుంటే సామాన్య వ్యక్తికి అంత శక్తి ఉండటం అసంభవం. అయితే గురువు ఏ విధంగా సహాయం చేయగలుగుతాడు?

**మిత్రులారా! ఈ సందర్భాన్ని ఎంతోమంది విశ్లేషించారు. శ్రద్ధ యొక్క చమత్కారంలో మీరాకోసం ఒక రాయి గోపాలునిగా మారింది. రామకృష్ణ పరమహంస కోసం ఓ రాయి మహాకాళిగా మారింది.** రామకృష్ణ పరమహంస యొక్క దేవి ఎంత పెద్దది అంటే అది భూమి నుండి ఆకాశం వరకు కనిపిస్తుంది. ఆ దేవి వివేకానందునికి భక్తిని, శక్తిని ఇచ్చింది. వివేకానందుకు ఆ దేవిపట్ల శ్రద్ధ చూపించాడు. అందువలన అతడు భక్తిని, శక్తిని పొందగలిగాడు. **రాతిబొమ్మలు కేవలం ప్రతీకలు. కానీ రామకృష్ణ పరమహంస శ్రద్ధ వలన రాయి దేవతగా మారింది.** కాళీమాతగా మారింది. మీరాకు కూడా అటువంటి శ్రద్ధే ఉన్నది. అందువలనే రాతి బొమ్మ కృష్ణునిగా మారింది. **ఏకలవ్యునికి కూడా అటువంటి శ్రద్ధయే ఉన్నది. అందువలననే మట్టి బొమ్మ గురువు అయింది.** దానివలన అతడు ఇతర శిష్యులకంటే, అర్జునుని కంటే కూడా ఎక్కువ లాభాన్ని పొందాడు. మట్టి విగ్రహం నుండి అతను పొందిన విజ్ఞానానికి సాటిలేదు. అతని ధనుర్విద్య మహోన్నతమైనది.

అది అతని గొప్పతనం. **ఆ బోయబాలుడు, అసలు ద్రోణాచార్యునితో ఈ మట్టి విగ్రహమే తన గురువు అని చెప్పాడు. "అతని ద్వారానే నేను విద్య నేర్చుకున్నాను. దయచేసి మీరు తమ శిరస్సును ఈ ద్రోణాచార్యుని వద్ద ఉంచండి"** అన్నాడు.

నిజానికి శ్రద్ధతో మనిషి మట్టితో వినాయకుని తయారు చేయగలడు. రాతితో కాళిమాతను తయారు చేయగలడు. రాతితో శంకరుని తయారు చేయగలడు. చాలా మంది 'నన్ను తరచుగా అడుగుతూ ఉంటారు. "మీకు నిరంతరం సహాయం చేసే వ్యక్తిని హిమాలయాలకు చెందిన వ్యక్తిని మీరు శ్రద్ధతో మలచుకున్నారా?" అని. నేను ఎవరికి ఈ విషయమై సమాధానం చెప్పలేదు. కానీ నా శ్రద్ధను ఎక్కువ చేసుకునే ప్రయత్నం నేను ఎల్లప్పులు చేస్తూనే ఉంటాను. ఎందుకంటే దీని వల్లనే నేను అధిక లాభాన్ని పొందాను. మా జీవితకాలంలో శ్రద్ధ వలన ఏమి పొందామో మీరందరూ దానిని చూడగలరు. నేను మా శ్రద్ధను అపరిమితమైనదిగా చేసుకున్నాను. దానిని నిరంతరం అభివృద్ధి పరచుకోవటంలోనే నేను ఆనందాన్ని పొందుతున్నాను. నేను శ్రద్ధనే భగవంతునిగా చూస్తాను.

ఒక పర్యాయం నేను కొంతమందితో కలిసి పార్వతి పరమేశ్వరులను దర్శించుకోవటం కొరకు కైలాసానికి వెళ్ళాను. హిమాలయాలకు వెళ్ళిన తరువాత వారంతా కైలాసాన్ని, మానస సరోవరాన్ని దర్శించారు. తరువాత వెనుదిరిగారు. వారితో "నేను మీతో పాటూ శంకరుని దర్శించుకోవటానికి వచ్చాను. శంకరుని, పార్వతిని దర్శించుకున్న తరువాతే తిరిగి వస్తాను" అని చెప్పాను. నేను ఒక నెలా అంతా మంచు కూడిన ఆ ప్రదేశంలో తిరిగాను. నేను తిరిగిన ప్రదేశంలో ఎక్కడా ఒక మసీదుకాని, ఒక గుడికాని లేదు. ఒక నెలపాటు ఒక కంబళితో మంచుతో కూడిన కొండల్లో గుహల్లో తిరిగాను. ఒకరోజు కళ్ళెదురుగా ఒక చీకటి వలయం లాంటిది కనిపించింది. శంకరుడే వచ్చాడేమో అని మనస్సులో అనిపించింది. నేను అనుకున్నాను. "నేను కాస్తా ఆగుతాను. మీరు కూడా కొంచెం ముందుకు రండి. మీరు దర్శనం ఇవ్వకపోతే కనీసం మీ పుత్రుడు గణేశుని అయినా పంపించండి. లేనట్లయితే అతని వాహనం అయిన మూషికాన్ని అయినా పంపించండి. మీరు దర్శనం ఇవ్వకపోతే మీ ప్రతినిధిని పంపించి అయినా మమ్మల్ని సంతోషపరచండి".

మిత్రులారా! ఈవిధంగా ఒక నెల గడిచిపోయింది. కాని ఎవరి దర్శనమూ కాలేదు. శంకరుని వాహనం దర్శనం అయినా శిరస్సు వంచి తిరిగి వెళ్ళిపోదాం అని అనుకున్నాను. కానీ అది కూడా జరగలేదు. నంది కూడా రాలేదు. నాకు బాగా దుఃఖం వచ్చింది. నా ఆరోగ్యం కూడా పాడయిపోయింది. నేను తిరిగి వెళ్ళిపోదాం అని అనుకున్నాను. తిరుగు ప్రయాణంలో నేను నాస్తికునిగా ఇంటికి తిరిగివచ్చాను. మా ఇంటిలో ప్రతి సంవత్సరం రామాయణం పఠించబడుతుంది. ఆ సంవత్సరం కూడా చదువబడింది. నేను నాస్తికుడిని అయిపోకుండా రామాయణం నన్ను కాపాడింది. నేడు మీ ఎదుట నేను ఒక ఆస్తికుని వలె ఉన్నాను. మరియు ఆస్తికత గురించి మీకు చెప్తున్నాను.

రామాయణం నన్ను నాస్తికత నుండి ఎలా రక్షించింది? రామాయణంలో ఒక శ్లోకం ఉంది అదే రామాయణ సారంశం.

**భవానీ శంకరౌ వందే శ్రద్ధా విశ్వాసరూపిణౌ**
**యాభ్యాం వినా స పశ్యంతి సిద్ధాః స్వాన్తస్థ మీశ్వరమ్**

ఈ విధంగా **తులసీదాస్ మృదువైన శబ్ధాలతో పార్వతీ**

**మనను గూర్చిన మన అభిప్రాయానికి ఇతరుల అభిప్రాయానికి తేడా ఉంటుంది.**

**పరమేశ్వరులు ఎలా ఉన్నారో వర్ణించాడు. శ్రద్ధ విశ్వాస రూపాల్లో ఉంటారని చెప్పాడు. పార్వతిని శ్రద్ధగా, ఈశ్వరుని విశ్వాసంగా అభివర్ణించి తులసీదాస్, భగవంతుడు వ్యక్తి రూపంలో ఉండదని సున్నితమైన పదజాలంతో చెప్పాడు. భగవంతుడు అంటే ఒక సిద్ధాంతం యొక్క పేరు, ఆదర్శం యొక్క పేరు. వ్యక్తి శ్రద్ధయే - భవాని, వ్యక్తి విశ్వాసమే - శంకరుడు.**

శ్రద్ధయే, వ్యక్తికి ప్రాణం. శ్రద్ధయే ఆస్తికతకు ప్రాణం. ఆధ్యాత్మికతను, చమత్కారానికి, ఆత్మసాక్షాత్కారానికి ప్రాణం శ్రద్ధ. శ్రద్ధ యొక్క చమత్కారం నా జీవితంలో సంభవించింది. 15 సం॥లకు మా గురువుగారి దర్శనం లభించింది. మార్గం కనిపించింది. ఆ సమయంలో నేనెంతో ఉద్వేగానికి లోనయ్యి, మా గురువుగారితో మీరు ఆజ్ఞనివ్వండి, నేను ఎల్లప్పుడూ మీ ఆజ్ఞ శిరసావహిస్తాను. ప్రాణం పోయినా మాట తప్పను.

స్నేహితులారా 24 సంవత్సరాలు 24 మహాపురశ్చరణలు పూర్తి చేసిన తరువాత మా గురువుగారు నన్ను హిమాలయాలకు పిలిచారు. మరల మీరు ఆదేశించండి. నేను పాటిస్తాను' అని అన్నాను. మీరు ఏ ఆదేశం ఇస్తే దానిని నేను పాటిస్తాను. నేను మిమ్ములను ప్రశ్నించను. మీరు ఆదేశిస్తూ ఉండండి. నేను వాటిని పాటిస్తూ ఉంటాను, మా గురువుగారు అన్నారు, మీరు మమ్మల్ని అడగకపోతే మేము చెప్పము అని. ఆయన మొదటి నుండి నన్ను దేవతను చేస్తామని చెప్పారు. నిన్ను గొప్పవానిగా తయారు చేయాలని ఉన్నది అన్నారు.

నేను గురుదేవా మీరు మా వద్దకు ఎందుకు వచ్చారు? అని అడిగాను ఆయన చెప్పారు. "నేను ఒక వేటకుక్కవలె చాలా రోజుల నుండి తిరుగుతూ ఉన్నాను. నీ కొరకు అన్వేషిస్తూ ఉన్నాను. నువ్వు కనిపించగానే పట్టుకున్నాను, ఇదేవిధంగా వేటకుక్క వాసన చూసుకుంటూ ఇంటికి చేరుతుంది. హంతకులను, దొంగలను పట్టుకోవడంలో పోలీసులకు సహకరిస్తుంది. నేను అడిగాను. మీరు నాలో ఏమి చూశారు?" అని. మేము నీలో శ్రద్ధ చూశాం అని అన్నారు. శ్రద్ధ లేని వ్యక్తి వద్దకు భగవంతుడు ఎలా వస్తాడు? శ్రద్ధ లేని సహజ కర్మకాండలు అన్నీ ప్రాణరహితమైనవి. దీని వలన ఎటువంటి లాభము మనిషికి ఉండదు. శ్రద్ధ లేకుండా చేసేవి అన్నీ బూటకమే. శ్రద్ధ లేకుంటే ఇవి అన్నీ అనవసరమే.

మా గురువుగారు చెప్పారు. వెతికి వెతికి శ్రద్ధ ఉన్న వ్యక్తిని పట్టుకున్నాను. శ్రద్ధ ఎవరికి ఉంటుందో అతనికి అన్నీ అందుబాటులో ఉంటాయి. శ్రద్ధలేని వ్యక్తికి ఏదీ అందదు. అతని ఆధ్యాత్మిక వికాసానికి ఎటువంటి మార్గమూ ఉండదు. నీలో శ్రద్ధ అనే బీజం ఉన్నదని నేను గుర్తించాను. దానిని సరియైన మార్గంలో పెడితే ఎన్నో పనులు చేయగలుగుతాము. అందువలన నీకు సాధనను నేర్పిస్తాను. "నీవు కేవలం సాధన మాత్రమే కాదు. ఆరుగంటల గాయత్రి జపం చెయ్యాలి. మజ్జిగ, జొన్నరొట్టెలు మాత్రమే తినమన్నారు'. అప్పుడు ఆయన 'నాయనా' వీనిని నేను ఒక ప్రతీకవలె చెప్పాను. నిన్ను నీవు మలచుకో. ప్రజలంతా దేనికి అయితే సంతోషపడతారో, దాని నుండి నిన్ను నీవు మళ్ళించుకో. ఎందుకంటే నీకు తెలుసో లేదో రుచులనుండియే చాలామంది జీవితాన్ని ప్రారంభిస్తారు. కామోద్రేకాలతో జీవితాన్ని ముగిస్తారు. వీని నుండి నిన్ను నువ్వు మళ్ళించుకోవాలని చెప్తున్నాను. నువ్వు మంచి పనులపై నీ దృష్టిని నిలుపు. నీ అభిరుచి అంతం చేసుకోవటం కొరకు నీకు కర్మకాండ గురించి చెప్పాను. ఈ రుచులు లోభం, మోహం వాసన తృష్ణ అవుతాయి. వీనిలో తిరిగే వ్యక్తి అల్పుడు. అతని శక్తి అంతరిస్తుంది. అందుకే నీచేత కర్మకాండ జరిపిస్తున్నాను.

మేము నీకు ముందురోజే చెప్పాము. నిన్ను దేవతను చేస్తామని, అందుకే మేము నీచే సాధనలు చేయించాము. జొన్న రొట్టెలు తిన్నట్లుగా ఎవరికి చెప్పవద్దు. వాల్మీకి మట్టి తిన్నాడు. నీవు జొన్నరొట్టెలు తినాలి. కానీ విషయం ఎవరికి చెప్పవద్దు.

మా గురువుగారు చెప్పిన ఇంకొక విషయం దేనిద్వారా మనుష్యులకు సిద్ధులు లభిస్తాయి అనేది. ఆధ్యాత్మిక జీవనం వలన మనిషిలో ఉండే సంతోషం, ఆలోచనలు ఇవన్నీ మనిషిని నడిపిస్తాయి. మీరు ఇతరుల మాటల వినకండి. అలా వింటే అభివృద్ధి చెందటం చాలా కష్టం. ఒక వేళ విన్నప్పటికి వారి మార్గంలో నడవకండి.

ప్రజల పద్ధతి ఏమిటి? వివాహాది కార్యక్రమాలకు వారెంత ఖర్చు పెడుతున్నారు? ఆధ్యాత్మికవాదులు చాలా కఠోరంగా ఉండాలి. ఈ విషయమై గాంధీజీ 3 కోతుల కథ ఒకటి చెప్పారు. మీరు మిగతావారి మాటలు వినేకంటే చెవులు మూసుకోవటం మంచిది. మిగతా వారంతా ఏం చెప్తున్నారో మీరు వినకండి. వారి పట్ల మీరు శ్రద్ధ వహించకుండి. వారి సలహా మీరు వినేటట్లయితే మీరు అభివృద్ధి పథంలో ప్రయాణించలేరు.

మా గురువుగారు ఆదేశించిన మీదట శ్రద్ధను పెంపొందించు కోవటానికి రెండు ఆదేశాలను ఆచరించాను. మొదటిది యోగి, తపస్వి ప్రతిపనికి, ప్రతి విషయానికి 'యస్' అని సమాధానం చెప్పాలనుకోడు. మొదట ఆలోచించి తరువాత పనిచేయాలి. మీరు మీ భార్యతో, మిత్రులతో 'యస్' అని చెప్తే మీరు నష్టపోవచ్చు. మీరు చేయవలసిన రెండవ పని 'నో' అనటం నేర్చుకోండి. ఈ ఆదేశం మాకు మా గురువుగారు ఇచ్చారు. గురువుగారు ఇచ్చిన అన్ని ఆదేశాలను నేను పాటించాను. నేను ఎప్పుడూ నా బంధువుల, మిత్రుల మాటలకు 'యస్' అని చెప్పలేదు. వాళ్ళు సినిమాకు రమ్మంటే మీరు 'యస్' అని చెప్పకండి. యోగులు, తపస్వులు అగ్నిలో నిలబడి తపస్సు చేస్తూ ఉంటారు. ఎవరైతే తమలో ఉండే చెడును తొలగిస్తారో వారే ఆధ్యాత్మిక వాదులు. చెడుతో నిరంతరం ఆధ్యాత్మిక వాదులు పోరాడుతూనే ఉంటారు.

*(సశేషం)*

**ఇతరుల అభిప్రాయాలను తప్పులనుకుని మనని మనం సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తుంటాము.**

యుగ ఋషి, వేదమూర్తి, తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది

# హృదయపూర్వక ఆహ్వానం

## మహా పూర్ణాహుతి మహోత్సవం
## శాంతికుంజ్-హరిద్వార్
## 2011 నవంబర్ 6 నుండి 10 వరకు

**పూజ్య గురుదేవుల అద్భుత వ్యక్తిత్వం, జనహితం కొరకు సమర్పించబడిన జీవితం :**

**యుగ ఋషి:** భగవంతుని పరమమంగళకరమైన "యుగ నిర్మాణ యోజనను ప్రాణవంతం చేయుటకు హిమాలయాలలో ఋషుల పార్లమెంటుచే నియమించబడిన వ్యక్తి. ప్రచండ తపోసాధన ద్వారా స్థూల, సూక్ష్మ జగత్తులో దీనికి పునాది వేసి గొప్ప విప్లవాలను లేవదీశారు. ఋషి పరంపరను తిరిగి జాగృతం చేశారు. ప్రపంచంలోని వైజ్ఞానికులు, ఆలోచనాపరులు పృథ్విపై జరుగనున్న వినాశమును గురించి చెప్తున్నారు. కాని గురుదేవులు స్పష్టమైన శబ్దములతో ఇలా ఉద్ఘాటించారు.

"21వ శతాబ్ది ఉజ్జ్వలమైన భవిష్యత్ తీసుకుని వస్తున్నది. 2000 సంవత్సరముల నుండి పాడయిన పరిస్థితులు 100 సంవత్సరాలలో సరిచేయబడతాయి. నవయుగం - ప్రజ్ఞా యుగంలో సత్యయుగం వంటి వాతావరణం తయారవుతుంది.

**యుగ విశ్వామిత్రుడు:** వేల సంవత్సరాల నుండి అనేక ప్రతిబంధాలకు గుర్రై, కనుమరగయిన గాయత్రి మహావిద్యను జాగృతం చేసి, సులభతరం చేసి అందరికి అందుబాటులోకి తెచ్చారు. గురుదేవులు ఇలా అన్నారు - "దుర్బుద్ధితో పాడయిన పరిస్థితులు సద్బుద్ధితోనే చక్కబడతాయి. గాయత్రి మనుష్యులలో సద్భావనలను, సదాలోచనలను, సత్కర్మలను ఆచరించే సాహసాన్ని ఆవిష్కరిస్తుంది.

**యుగ యాజ్ఞవల్కుడు:** యజ్ఞములలో చోటుచేసుకున్న 'హింస'ను దూరం చేసి, ప్రకృతి జీవనం మధ్య సంతులనాన్ని సాధించే విజ్ఞానంగా రూపొందించి, ప్రజలందరు ఆచరించగలిగే సులభమైన పద్ధతిలో అందించారు.

**యుగ భగీరథుడు:** సమస్త సమస్యలను నివారించేందుకు దివ్య జ్ఞాన గంగను (గాయత్రి మహావిజ్ఞాన్) ధరిత్రిపై అవతరింపచేసి, అందరికి సులభంగా అర్థం అయ్యేటట్లు చేశారు.

**యుగ వ్యాసుడు:** నాలుగు వేదాలు, 108 ఉపనిషత్తులు, 6 దర్శనాలు మొదలైన ఆర్ష గ్రంథములకు అందరికి అర్థం అయ్యే భాషలో భాష్యం (హిందీ) వ్రాశారు ప్రచురించారు. గాయత్రి మహా విజ్ఞాన్, ప్రజ్ఞాపురాణం, ప్రజ్ఞోపనిషత్తు వంటి నూతన గ్రంథాలను రచించారు. వాటిని అందరికి అందుబాటులోకి తెచ్చారు.

**యుగ ద్రష్ట:** అన్ని ధర్మ-సంప్రదాయాల వారు, అన్ని వర్గముల వారికి ఉపయోగపడే విధంగా ఆచరించడానికి వీలుగా యుగ నిర్మాణ సూత్రాలను అందించారు. ''మానవులందరూ సమానమే". నర నారి (స్త్రీ-పురుషులు) సమానమేనని స్త్రీలకు ఒక గొప్ప విలువను ఆపాదించారు.

**యుగ మనీషి:** మనిషి, మానవత్వానికి సంబంధించిన వేలాది సమస్యల పరిష్కారం కొరకు, వివేకాన్ని వికసింపజేసికొనెడి రాజమార్గం కొరకై సమస్త విషయములపై 3000 కన్నా ఎక్కువ పుస్తకముల వ్రాసి, ప్రచురించి అందరికి అందుబాటులోకి తెచ్చారు. గురుదేవులు ఇలా అంటారు "నేను రచయితను కాను, నేటి సమస్యలను ఋషులతో చర్చించి, ఆ చర్చల సారాంశమును మానవ శ్రేయస్సు కొరకు వ్రాశాను".

**యుగ ఆచార్య:** ఆధ్యాత్మ విజ్ఞానాన్ని తమ జీవన ప్రయోగశాలలో పదార్థ విజ్ఞానం వలె పరీక్షించి, శాస్త్రీయమేనని వివరించారు. విశ్వ సంస్కృతి సూత్రాలను దేవ సంస్కృతి అనే గీటురాయిపై పరీక్షించి మానవునిలో దేవత్వాన్ని ఉదయింపజేయడానికి సంస్కార పరంపరను పునర్జీవింపజేశారు.

**యుగ పురోహితుడు:** సుప్రసిద్ధ స్వతంత్ర సంగ్రామ సేనాని. నవ యుగ నిర్మాణానికి విచార క్రాంతి (ఆలోచనలలో క్రాంతి), నైతిక క్రాంతి, సామాజిక క్రాంతి తీసుకురావడానికి యుగ పురోహితులను (పురోహితుడు = పురమునకు హితము కలిగించేవాడు) తయారుచేశాడు.

చరక పరంపరలో వనౌషధుల పరిశోధన, ఆయుర్వేద పునర్జీవనం; శంకరాచార్యుల పరంపరలో ఆధ్యాత్మిక జాగరణ కేంద్రముల, గాయత్రి శక్తి పీఠముల స్థాపన. నారద పరంపరలో భక్తి సంగీతముతో జన జాగరణ. వశిష్ఠ పరంపరలో విశిష్టమైన లోక సేవకులను తయారుచేయడం వంటి అనేక ప్రణాళికలు ఆచరణలోకి తీసుకువచ్చారు.

**ఆలోచనలకు - మాటలకు - చేతలకు పొంతన ఉంటే ఉత్పాదకత మెరుగవుతుంది.**

**జన్మశతాబ్ది సందర్భమున ఉజ్జ్వల భవిష్యత్తు అవతరణ కొరకు చేయుచున్న ప్రయత్నం :**

భగవంతుని ప్రణాళికను సమగ్రంగా సృజన చెయ్యడానికే యుగ ఋషి అవతరించారు.

★ మహాత్మ సూరదాస్, ఫ్రాన్స్ దేశపు భవిష్య ద్రష్ట నాస్టర్‌డామస్, మహాత్మా బహుల్లా, స్వామి వివేకానంద, యోగి అరవిందులు మొదలైనవారు పృథ్విపై శ్రేష్ఠమైన యుగం వచ్చే ఆస్కారం ఉందని చెప్పారు. ఆ సమయం వచ్చేసింది.

★ పరమాత్మ నిర్దేశించిన విధంగా సకల ఉన్నతమైన ఆత్మలు, ఋషులు, మహాత్ములు, దేవదూతలు, పైగంబరులు మొదలైన మహనీయులు యుగ పరివర్తన కొరకు దివ్య వాతావరణాన్ని తయారుచేయడానికి అందరూ కలసి పనిచేస్తున్నారు. దీని ప్రభావం వలన ప్రపంచంలోని అన్ని క్షేత్రములలో, అన్ని వర్గములలోని జాగృత ఆత్మలలో ఏదో క్రొత్తది, మంచిది చేయాలనే ఉత్సాహం పెల్లుబుకుతున్నది.

★ పంటలు పండించటానికి భూమిని, విత్తనాన్ని, వాతావరణం మొదలైన వాటిని భగవంతుడే తయారుచేశాడు. కాని దీని నుండి లాభం పొందడానికి భూమిని దున్నడం, సరైన సమయంలో విత్తనాలు నాటడం, ఎరువును నీటిని సమకూర్చుకొనడం మనుష్యులే చేయవలసి వస్తుంది. అదే విధంగా భగవంతుడు ఋషులు మహాపరివర్తన కొరకు కావలసిన వనరులను సూక్ష్మ జగత్తులో తయారుచేసి ఉంచారు. మానవులు తమ పురుషార్థముతో, సహకారముతో ఆ వనరులను ప్రత్యక్ష జగత్తు (కనిపించే జగత్తు)లోనికి దింపుకోవాలి.

★ దీనికొరకు అన్ని రంగములలో, వర్గములలోని స్త్రీ పురుషులు భేదభావాన్ని మరచి కలసి మెలసి తమ తమ పద్ధతులలో మూడు రకాల పురుషార్థములు చెయ్యవలసి వస్తుంది.

**1) భావనాత్మకం 2) ఆలోచనాత్మకం 3) క్రియాత్మకం**

గురుదేవులు తమతో కలసివున్న వారిని తమ అంగ అవయములుగా చెప్తూ ఇలా అన్నారు - అన్ని వర్గముల వారిని, అన్ని క్షేత్రములలోని వారిని భగవంతుని ప్రణాళికలో పాలుపంచుకొనమని ఆహ్వానించాలి. మూడు రకాల పురుషార్థములను స్వయముగా మొదలుపెట్టాలి. ఇతరులను కూడా ఈ పనులలో కలుపుకోవాలి.

యుగ నిర్మాణ యోజన, గాయత్రీ పరివార్ పైన చెప్పిన కార్యక్రమాలను చాలా సంవత్సరముల నుండి చేస్తున్నారు. జన్మశతాబ్ది సమయంలో ఇంకాస్త ఉత్సాహంగా, ఇంకా బాగా చెయ్యాలి. ఇదే పూజ్య గురుదేవులకు మనము సమర్పించే శ్రద్ధాంజలి.

**1) భావనాత్మక పురుషార్థము-సృజనాత్మక మహాపురశ్చరణ:** ఇది రెండు సంవత్సరాలుగా జరుగుతున్నది. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రములలో నిర్ధారించబడిన అర్థగంట జపం వ్యక్తిగత, సామూహిక రూపములలో గాయత్రి మంత్ర జపం జరుగుతున్నది. జప సమయంలో భావం ఇలా ఉంటుంది "హే పరమాత్మా! మా అందరికి సద్బుద్ధినిచ్చి ఉజ్జ్వల భవిష్యత్తు మార్గములో మమ్మల్ని ముందుకు తీసుకువెళ్ళు".

50 లక్షల మందితో ప్రారంభించబడిన ఈ జపసాధనలో తరువాత 2 కోట్ల మంది పాలుపంచుకున్నారు. అధమంగా కోటి మందినే లెక్కలో తీసుకున్నప్పటికి -

30 నిమిషాలలో 500 మంత్రజపం తేలికగా చేయవచ్చు. రెండు సంవత్సరాలు అంటే 730 రోజుల వ్యవధిలో కోటి మంది ద్వారా 3,65,000 కోట్ల మంత్ర జపం జరిగింది. 24 లక్షల గాయత్రి మంత్ర జపంతో ఒక మహాపురశ్చరణ పూర్తవుతుంది. అంటే 3,65,000 కోట్ల జపంతో 16 లక్షల మహా పురశ్చరణలు జరగడం వల్ల తదనుగుణ్యమైన ఆధ్యాత్మిక శక్తి ఉత్పన్నమయింది.

ఇదేవిధంగా జన్మశతాబ్దిలో గాయత్రీ మంత్ర లేఖన ఉద్యమం ప్రారంభమయింది. చైత్ర నవరాత్రుల వరకు కనీసం 24 లక్షల సాధకులు ఒక్కొక్కరు 2400 మంత్ర లేఖనం పూర్తి చేశారు. ఈ సాధన 24,000 లఘు అనుష్ఠానంతో సమానము. ఈ విధంగా 24 లక్షల మంది చేసిన జపం 24 లక్షల అనుష్ఠానంతో ఎంత శక్తి ఉత్పన్నమయిందో, ఇప్పుడు కూడా మంత్ర లేఖనం జరుగుతూనే ఉన్నది. శతాబ్ది సంవత్సర ముఖ్య కార్యక్రమం 2011 నవంబరు 6 నుండి 10 వరకు ఇదే విధమైన సాధనాత్మక పురుషార్థంతో జరుగుతుంది.

**2) ఆలోచనాత్మక పురుషార్థము:** రెండు సంవత్సరాలపాటు విద్యా విస్తరణ యజ్ఞ కార్యక్రమాలు జరిగాయి. దాదాపు 40,000 స్థానాలలో చిన్న పెద్ద యజ్ఞములు - యుగ నిర్మాణ యోజన సమ్మేళనంతో పాటు జరిగాయి. ఒక్కొక్కదానిలో కనీసం 1000 మంది భావనాశీలురు పాల్గొంటే నాలుగు కోట్ల వ్యక్తుల వరకు ఉజ్జ్వల భవిష్యత్తు సూత్రములు (యుగ నిర్మాణ సత్సంకల్పాలు). వీరి చేత సంకల్పములు చేయించారు.

**వైఫల్యాలకు అసలు కారణం గుర్తించనందువల్ల చేసిన తప్పులనే తిరిగి తిరిగి చేస్తుంటారు.**

యుగ సాహిత్య పుస్తకమేళాల ద్వారా కోట్ల రూపాయల యుగ సాహిత్యం సగం ధరకే అందజేయబడింది.

**3) క్రియాత్మక పురుషార్థము:** యుగ నిర్మాణ పరివారం యొక్క చిన్న పెద్ద కార్యక్రమాల ద్వారా నవసృజన ఏడు కార్యక్రమాలు నడుస్తున్నవి.

అవి 1) సాధన 2) శిక్షణ 3) ఆరోగ్యం 4) స్వావలంబన 5) పర్యావరణము 6) వ్యసనముల, చెడు పద్ధతుల 7) నారీ జాగరణ.

రాష్ట్ర జాగరణ కొరకు చేసే దీపయజ్ఞముల ద్వారా దేశములోని 50% కన్నా ఎక్కువ గ్రామాలను, పట్టణాలను సృజనాత్మక కార్యములతో ప్రజలను దీనిలో కలుపుకునేందుకు సంకల్పించడమైనది.

జన్మశతాబ్ది తీర్థయాత్రల ద్వారా శక్తి కలశంతో ఏడు రథముల, వాహనముల టోలి ద్వారా దేశమంతట ఆలోచనా మంథన (Thought Revolution) కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. దీనిలో భగవంతుని ప్రణాళికలో భాగస్వామ్యం కొరకు ప్రేరణ ఇవ్వడం, సంకల్పం చేయించడం జరుగుతున్నది.

**యుగ సృజన కుంభమేళా:** హరిద్వార్‌లో 2011 నవంబరు 6 నుండి 10 వరకు మహాకుంభం పుష్కరాల వంటి రీతిలో పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది మహోత్సవములు జరుగనున్నవి. రెండు సంవత్సరాల పాటు దేశమంతటా సృజన అభియానం (నూతన యుగారంభ ప్రణాళికలు) నడిపే యుగ సైనికులు, వారి సహయోగులు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొంటారు. 1551 కుండముల యజ్ఞములో సత్యయుగ పునరాగమానికై ప్రత్యేకమైన ఆహుతులు సమర్పిస్తారు. అందరికి ఉచిత భోజన సదుపాయాలు ఏర్పాటు జరిగింది.

భగవంతుని ప్రణాళికలో భాగస్వాములను కమ్మని అందరిని ఆహ్వానిస్తున్నాము. పైన చెప్పిన మూడు రకముల పురుషార్థములలో విభిన్న సంస్థల, ధర్మ సంప్రదాయాల వారు తమ తమ పద్ధతులలోనే పాలుపంచుకొనవచ్చు. జరుగుతున్న కార్యక్రమాలలో తన్, మన్, ధన్ (శరీరం, మనస్సు, ధనం)తో సహకరించి భగవంతుని అనుదానాలను, శ్రేయ సౌభాగ్యాలను పొందాలి. ఈ కార్యక్రమాలలో పాలుపంచుకునేవారు ధన్యజీవులు అవుతారు.

***సత్యయుగం ఎప్పుడు వస్తుంది అంటే ప్రజలు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు.***

## చెట్లు పెంచడం పరమపుణ్యం

*భారతదేశానికి ధర్మమే ప్రాణం. ఇక్కడ పరోపకారంతో పుణ్యం సంపాదించుకోవాలనే భావన ప్రబలి ఉన్నది. ఈ భావనను వృక్షారోపణతో పర్యావరణ సంరక్షణ వంటి పవిత్ర కార్యాలకు ఉపయోగించవచ్చు.*

*శాస్త్రములలో వృక్షములను పెంచడం పిల్లలను పెంచడం కన్నా పుణ్యపరమార్థ కార్యమని చెప్పబడింది.*

***దశ కూప సమో వాపీ, దశ వాపీ సమో హ్రదః***
***దశ హ్రద సమః పుత్రః దశ పుత్ర సమో ద్రుమః***

***అర్థం:*** *పది బావులు ఒక చెరువుకు సమానం. పది చెరువులు ఒక సరోవరానికి సమానం. 10 సరోవరాలు ఒక పుత్రునితో సమానం. ఒక వృక్షాన్ని పెంచి ఫలింపచేస్తే అది పది మంది పుత్రులను పెంచి పోషించిన పుణ్యం లభిస్తుంది, పుత్రులకు, మిత్రులకు సహాయం చేయడం ఎటువంటి పుణ్యకార్యమో దాని మీద సందేహం ఉండదు కాని ఇదేవిధంగా వృక్షమును వికసింపజేయడం వల్ల లభించే అసాధారణ పుణ్యంపై ఎటువంటి సందేహం కూడదు. అవి ప్రాణ వాయువును (ఆక్సిజన్) ఇస్తాయి. ప్రదూషణ (pollution) నివారణ, మనుష్యులకు జంతువులకు నీడ, ఆహారం ఫల పుష్పములను ఇవ్వడం, వర్షములు కురవడంలో సహాయం, భూమి జల సంరక్షణలో సహయోగం వంటి ఎన్నో పుణ్య కార్యములు చేస్తాయి. వృక్షములు నాటడం, వాటి సంరక్షణ పోషణ చేసేవారికి వాటి పుణ్యంలో భాగం తప్పనిసరిగా లభిస్తుంది.*

*ఒక వైజ్ఞానిక అధ్యయనం ప్రకారం కొంచెం ఎదిగిన చెట్టు అందించే సేవాకార్యాలను ఆర్థికంగా లెక్క వేస్తే (50 సంవత్సరాలలో) ఒక కోటి రూపాయల కన్నా ఎక్కువ ఉంటుంది.*

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రాణవాయువు | రూ. | 15,00,000 |
| 2. | వాయు ప్రదూషణ నియంత్రణ, భూమి యొక్క ఉత్పాదకతను వృద్ధి చేయడం | రూ. | 31,00,000 |
| 3. | భూమ్యాక్షరణ నియంత్రణ | రూ. | 15,60,000 |
| 4. | జల సంరక్షణ | రూ. | 18,80,000 |
| 5. | పశు పక్షుల ఆశ్రయం | రూ. | 16,60,000 |
| 6. | కట్టెలు, ఫలములు, పశువుల మేత | రూ. | 4,00,000 |
| | మొత్తం | = రూ. | 1,01,00,000 |

ఇది ఆర్థికవేత్తల స్థూలమైన లెక్కలు. కాని పోయే ప్రాణాన్ని రక్షించేందుకు ఇచ్చిన ఒక గ్లాసు నీటి విలువ డబ్బుతో ఎలా కొలవగలము? ఈ విధంగా పృథ్వికి, పృథ్వి వాసులకు ప్రాణములను రక్షించే వృక్షముల సేవను డబ్బుతో లెక్కించుట మానవీయ విలువలను, సంవేదలను అవమానించడమే.

– ప్రజ్ఞా అభియాన్ 16.06.2011 నుంచి

**నష్టాల కష్టాల పాలయిన వ్యక్తి మూలకారణాన్ని గుర్తించనంత వరకు అతని సమస్యలకి ముక్తి లేదు.**

నావారితో నా మాట: 2011 - 2012 జన్మశతాబ్ది సంవత్సర వేడుకల విశేషాలు

# గొప్ప సమయం వచ్చింది

గత రెండు సంచికలలో జన్మశతాబ్ది రూపురేఖలపై చర్చించుకుంటున్నాము. దీని శుభారంభం మత్స్యావతారం వలె అవతరించి వసంతపర్వం ఫిబ్రవరి 6,7,8 తేదీలలో దేశమంతటా విస్తరించింది. జన్మశతాబ్ది ఉత్సవాలు మూడు సంవత్సరాలు అంటే 2011, 2012, 2013లలో జరుగుతాయి. 2014 ఫిబ్రవరి 6న పూర్తి అవుతాయి. 2013 సంవత్సరంలో స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవాలు జరుపబడుతున్నాయి. గాయత్రీ పరివార్ కూడా దీనిని గురుదేవుల జన్మశతాబ్ది అనుయాజ రూపంలో జరుపుకుంటాము. విచారక్రాంతి (ఆలోచనలలో క్రాంతి) విశ్వవ్యాపకం చెయ్యాలి. 2012 సాధనా సంవత్సరం, 2011 సంవత్సరం సంకల్పముల పూర్ణాహుతి సంవత్సరం. దీని మధ్యలో మైలురాయిలాగా జన్మశతాబ్ది మహాకుంభం (2011 నవంబరు 6 నుంచి 10 వరకు) వస్తున్నది. దీనిని ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకుంటాము. కోట్ల గాయత్రీ మంత్ర లేఖన అనుష్ఠానం ఈ మధ్యలో పూర్తవుతుంది. ఏడు రథముల ద్వారా విభిన్న మార్గాలలో రాష్ట్ర జాగరణ కొరకు జన్మశతాబ్ది రథయాత్ర మొదలయ్యింది. ఇక ముందు జరగువలసినది చెప్పుకుందాము.

ఇది చదువుకున్న పరిజనులు చాలా అదృష్టవంతులుగా భావించుకోవాలి. యుగముల ప్రతీక్షానంతరం చేతనత్వాన్ని పరివర్తన చేసే అవతార పురుషుడు, సద్గురువు యొక్క జన్మశతాబ్ది, ద్విశతాబ్ది (200 సంవత్సరములు) వారి శిష్యులకు వారి పద చిహ్నములను అనుసరించి వారికి లభిస్తుంది. ఈ సంవత్సరమేగాక దాదాపు మూడు సంవత్సరములు ఈ మహా పర్వాన్ని ఉల్లాసంగా జరుపుకునే సౌభాగ్యం మనకు లభించింది. ఈ సమయాన్ని భగవంతుడు ఎన్నుకున్న విశిష్టమైన సమయమని గుర్తుంచుకోండి. ఇది కలియుగంలో సత్యయుగపు శుభారంభవేళ పరివర్తన ప్రతిక్షణం దృష్టిగా గోచరమవుతుంది. ద్రష్ట-మహా మనీషి పరమ పూజ్య శ్రీరామశర్మ గురుదేవుల రోజు 24 గంటల సామీప్యం అనేక సంవత్సరాలు పొందినవారు - గురుదేవుల పలుకులను గుర్తుకు తెచ్చుకోవాలి. ఈ సంవత్సరం, ఈ జన్మశతాబ్ది సమయం అతి విశిష్టమైనదని, ప్రతి మనిషికి, మన దేవతుల్య భారతదేశానికి సమస్త విశ్వానికి అతి ముఖ్యమైన సమయము. మరి మనం ఈ జన్మ ఆయన కొరకే జీవించాలి.

### మూడు రోజుల గురుపర్వం

ఈ మూడు సంవత్సరాల అవధిలో విభిన్న కార్యక్రమాలు ఉంటాయి. కాని ఇప్పుడు రాబోయే ఆరు నెలల ప్రక్రియలను వివరంగా తెలుసుకోవాలి. జులై నెలలో వ్యాస పూర్ణిమ - గురు పూర్ణిమ పావన పర్వం జులై 15వ తేదీ శుక్రవారం వస్తున్నది. దీనిని భారతదేశమంతటా, విశ్వమంతటా జులై 15,16,17 తేదీలలో శ్రద్ధా-సమర్పణ పర్వంగా నిర్వహించడం జరుగుతుంది. జులై 14వ తేదీ గురువారం సాయంత్రం నుండి 24 గంటల అఖండ జపం ప్రారంభమవుతుంది. జులై 15వ తేది ఉదయం నుండి గురుపూజ, గురుదేవుల ప్రతినిధుల ఉద్బోధన (ప్రవచనం), పాదుకలకు నమస్కారాల విధి విధానం నడుస్తుంది. సాయంత్రం గురుపూర్ణిమ దీపయజ్ఞం జరుగుతుంది. జులై 16వ తేది శనివారం, 17వ తేదీ ఆదివారం మరో రెండు పనులకు కేటాయించబడ్డాయి. మొదటిది గురుసత్తా ఆలోచనా సరళికి అనేక చోట్ల సత్సంగములు, మీటింగులు, పరిజనులతో పాటు యువకులతో గోష్ఠి; గురుదేవుల ఆలోచనా సరళిని అందరికి అందించే సంకల్పం. రెండవది గొప్ప వృక్షారోపణ ప్రణాళిక. దీనిలో దేశమంతటా ఒక కోటి వృక్షములను నాటడం ద్వారా పచ్చదనాన్ని విస్తరింపజేసే ఈ కార్యక్రమం తరుపుత్ర - వృక్ష గంగా మహా ప్రణాళికతో జోడింపబడి ఉన్నది. ప్రతిచోట ఈ వృక్షారోపణ కార్యక్రమం జరుగుతున్నది. ప్రాంతాల వారిగా కోటా ఇవ్వబడుతుంది.

### ఎక్కడ చూచిన పచ్చదనం - బృహత్ వృక్షారోపణ ప్రణాళిక

ఈ కార్యక్రమాలలో పూజ్య గురుదేవుల యుగ ఋషి స్వరూపం అందరికి అర్థం అయ్యేటట్లు కార్యక్రమాలు ఉంటాయి. దీనితోపాటు పర్యావరణ పరిరక్షణకు విశేష ప్రభావాన్ని చూపించే పచ్చదనాన్ని విస్తరింపచేయాలి. దీనికొరకు తమ పూర్వీకులు, పెద్దల, అకాల మృత్యువు సంభవించిన వారి స్మృతిగా వృక్షారోపణ చేయడానికి ప్రేరణ ఇవ్వాలి. ఈ ప్రక్రియ ఒక నెల అంటే శ్రావణ పూర్ణిమ వరకు జరుగుతుంది. ఈ లోపల దేశమంతటా వర్షాలు కురుస్తాయి. వర్షములు నాటిన వృక్షములకు అనుకూలంగా ఉంటాయి. ఇంతేగాక ప్రతి పరిజనుడు ఐదు ఐదు వృక్షములను నాటాలి, వాటిని తమ పిల్లలుగా భావించి జీవితాంతం పెంచి పెద్ద చేసే వ్రతం స్వీకరించాలి. ఇంకా అనేక చోట్ల స్మృతి ఉపవనముల (తోటలు) నిర్మాణముల ప్రణాళిక వేగవంతం కావాలి. నీడనిచ్చే, ఫలాలనిచ్చే చెట్లు నాటాలి. నాటిన చెట్లకు నీరు, ఎరువు వేసి కాపాడుకోవాలి. ఇలాంటి కార్యక్రమం శాంతికుంజ్‌లో దేవ సంస్కృతి విశ్వ విద్యాలయంలో జరిగింది. శాంతికుంజ్ కార్యకర్తలు ఐదు ఐదు వృక్షముల సంరక్షణ చేపట్టారు.

### శని, ఆదివారాల ఉపయోగం

విదేశాలలో, అనేక నగరాలలో, పట్టణాలలో సామాన్యంగా

ఆత్మన్యూనతా భావం వ్యక్తిత్వానికి లోపం.

శని ఆదివారాలు సెలవు దినాలు. జులై 15వ తేదిన ఇంటిలోనే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని జులై 16,17 (శని, ఆది) గురు పర్వాన్ని జరుపుకోవచ్చు. దీనితోపాటు వృక్షారోపణ చెయ్యాలి. తులసి చెట్లు పంచండి. పూల కుండీలలో చెట్లు పెట్టండి. గాయత్రీ పరివార్‌లోని 11 కోట్ల పరిజనులు కలసి ఈ పనిచేస్తే గ్లోబల్ వార్మింగ్‌ని (వాతావరణంలోని వేడి) తగ్గించడానికి ఎంతో దోహదపడుతుంది. జులై 15,16,17 తేదీలలో జరిగే ఈ కార్యక్రమాలు పరిజనులు తమ వీలును బట్టి రూపొందించు కోవచ్చు. ప్రతి శక్తి పీఠం, ప్రజ్ఞాపీఠం, ప్రజ్ఞామండల్‌లు, ప్రాంతీయ కార్యాలయాలు ఉల్లాసభరిత వాతావరణం ఈ మూడు రోజులు ఉండేటట్లు చూచుకోవాలి.

## శతాబ్ది మహాకుంభం

శతాబ్ది మహాకుంభం ఈ సంవత్సరం నవంబరు 6వ తేది (ఆదివారం) నుండి 10 (గురువారం) వరకు జరుగుతుందని అందరికి తెలుసు. ఈ మహాకుంభంలో లక్షలాది పరిజనులు పాలు పంచుకుంటారు. గంగా హృదయ క్షేత్రంలోని సుప్రసిద్ధ హర్ కీ పైడీ దగ్గర నుంచి 10 మైళ్ళ విస్తార ప్రదేశంలో, శాంతికుంజ్ నుండి ఋషీకేశ్ వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాలతో వీటికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. హోటల్, ధర్మశాలలు విభిన్న ఆశ్రమాలలో ఇప్పటి నుండే బుకింగ్ చేస్తున్నాము. ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాలు పాలుపంచుకోనున్నారు. అంతేగాక రష్యన్, జర్మన్, ఇంగ్లాండు, ఆఫ్రికా, అమెరికా పౌరులు ఏదో జన్మలో యుగ ఋషితో సంబంధమున్నవారు, గాయత్రిని విశ్వసించేవారు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. శతాబ్ది కార్యక్రమాలు మూడు సంవత్సరాలు జరిగినప్పటికి ఈ మహాకుంభం మాత్రం ఈ సంవత్సరం మాత్రమే జరుగుతుంది.

## ముందు ప్రయత్నాలు

మహాకుంభం కొరకు ఇప్పటినుండే కార్యకర్తలను ఆహ్వానిస్తున్నాము. వీరు మహాకుంభ ఏర్పాట్ల కొరకు సెప్టెంబరు మొదటి వారం నుండే రావడం మొదలవుతుంది. జరుగుతున్న రథయాత్రలు, వృక్ష గంగా కార్యక్రమం, మంత్రలేఖన కార్యక్రమాలు పూర్తి చేసుకుని కార్యకర్తలు హరిద్వార్ చేరుకుంటారు. విభిన్న నగరాలలో నివసించేందుకు శుభ్రపరచే కార్యక్రమం. నిర్మాణ కార్యక్రమాలు వీరే పూర్తి చేస్తారు. వీరిలో నాయకత్వం వహించేవారి కొరకు ఒక కార్యాలయం శాంతికుంజ్‌లో కొద్ది రోజుల క్రితం ఏర్పాటు చేయబడ్డది. వీరందరు నలుడు-నీలుడు; ఎలుగుబంట్లు, వానరముల వలె సేతు బంధనం వంటి అసంభవాలను సంభవాలుగా చేసే కార్యాలను భుజం భుజం కలిపి చేస్తారు. కార్యక్షేత్రం చాలా పెద్దది. శాంతికుంజ్ ఉత్తరాన కూడా నగర నిర్మాణం జరుగుతుంది. లాల్‌జీ వాలా, రోడీ బెల్ వాలా, గౌరి శంకర ద్వీప్, నీలధారా క్షేత్రం, పంత ద్వీప్, బైరాగి ద్వీప్ మొదలైన స్థలాలను హరిద్వార్ మధ్యక్షేత్రంగా భావిస్తారు. ఇక్కడే కంట్రోలు సెంటర్, చికిత్సాలయం, చిత్ర ప్రదర్శనశాల, యజ్ఞశాల, ప్రవచన వేదికలు స్థాపించబడతాయి.

మొత్తం మీద 48 నగరాలను టెంట్లతో (డేరా) నిర్మిస్తారు. ఒక్కొక్క నగరంలో 10-15 లక్షల మంది ఉంటారు. ప్రతి నగరంలో చికిత్సాలయం, భోజనాలయం ఉంటాయి. కావలసిన ఏర్పాట్లు అన్నీ జరుగుతున్నాయి.

## మీడియా సెంటర్

కేంద్రీయ క్షేత్రంలోనే ఒక మీడియా సెంటర్ తయారవుతున్నది. ఈ క్షేత్రం నుంచి ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాల వివరాలను దేశములోని న్యూస్ ఛానల్స్‌కు, ఎలక్ట్రానిక్ మీడియాకు పంపవచ్చు. మీడియా సెంటర్ విదేశాలకు కూడా సమాచారాన్ని అందిస్తుంది. ఈ మహాకుంభం ఏర్పాట్ల కొరకు ఒక ప్రత్యేకమైన మీటింగ్ జులై 16వ తేదీన శాంతికుంజ్‌లో జరుగనున్నది. దీనిలో మహాకుంభం ఏర్పాట్లలోని వివిధ అంశాలపై దృష్టి సారిస్తారు.

## ఒకటిన్నర నెల మహాకుంభం

నవంబరు 6వ తేది కలశయాత్ర జరుగుతుంది. నవంబరు 1 నుంచి 5 వరకు విభిన్న ప్రాంతముల ప్రదర్శనలు ఉంటాయి. వీటిలో సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం పూట ఉంటాయి. నవంబరు 7వ తేది దేవపూజ 1551 కుండముల యజ్ఞశాలలో నిర్వహించబడుతుంది. నవంబరు 7,8,9 తేదీలలో యజ్ఞం నిర్వహించబడుతుంది. నవంబరు 9 చతుర్దశి సాయంత్రం విరాట్ దీపయజ్ఞం నిర్వహించబడుతుంది. ప్రతిరోజు ప్రవచనాలు ఉంటాయి. దేశంలోని విశిష్టమైన విద్వాంసులు, మనీషులు పాలుపంచుకుంటారు. నవంబరు 10 గురునానక్ జయంతి నాడు ఉదయం పూర్ణాహుతి ప్రారంభమవుతుంది. పరిజనులు తమ తమ శ్రద్ధా సుమములను (పుష్పములను) అర్పించి అనుయాజ ప్రక్రియ వేగవంతం చేసే సంకల్పం తీసుకుని వెనుతిరుగుతారు. ఈ ప్రక్రియ నవంబరు 15 వరకు జరుగుతుంది. సెప్టెంబరు మొదటి వారం నుంచే సుమారు ఇరవై నుంచి ఇరవై ఐదు వేల మంది స్వయం సేవకులు హరిద్వార్‌కు వేంచేస్తారని ఒక అంచనా. ఈ విధంగా ఈ కుంభం ఒకటిన్నర నెల జరుగుతుంది.

మనమందరం ఈ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలి. యుగ ఋషి ప్రణాళికలో మరో పది మంది క్రొత్త వ్యక్తులను జోడించేందుకు, వారిని శతాబ్ది సంవత్సర కార్యక్రమాలలో పాలు పంచుకునేటట్లు చేసే సంకల్పం తీసుకోవాలి. గురుపర్వంలో ఇంతకంటే మంచి సంకల్పం మరేమీ ఉండదు. ఈ అద్భుత సమయంలో అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకండి.

*- అఖండజ్యోతి, జులై 2011*

**మనం చేస్తున్న పని పట్ల అంకిత భావం, నిజాయితీ, క్రమశిక్షణ మన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయి.**



ఆరోగ్యమే మహాభాగ్యం - 8

# హోమియో వైద్య సేవ

## వానాకాలములో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇప్పటివరకు వేసవితాపంతో ఉన్న మనకు ఋతుపవనాల రాకతో తొలకరి జల్లు పలకరింతతో ఎంతో సేద తీరుతుంది. ఈ తొలకరి జల్లు మనలో ఎంతో ఆనందాన్ని నింపుతుంది. కాని దానితో పాటు చాలా ఆరోగ్య సమస్యలను కూడా వర్షాకాలంలో మనం ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ సమస్యల గురించి సరిఅయిన అవగాహన పెంచుకొంటే వాటి బారి నుండి మనల్ని, మన కుటుంబ సభ్యులను రక్షించుకోవడం అంత కష్టమైన పని ఏమి కాదు. ముందు మనం వానాకాలంలో సాధారణంగా వచ్చే సమస్యల గురించి తెలుసుకొందాము.

- జలుబు
- ఆస్తమా
- రక్త విరేచనాలు
- టైఫాయిడ్ జ్వరం
- డెంగ్యూ జ్వరం
- కలరా
- గొంతు ఇన్ఫెక్షన్లు
- విరేచనాలు
- కామెర్లు
- మలేరియా
- చికన్ గున్యా

పైన పేర్కొన్న తరుణ వ్యాధులే కాక దీర్ఘకాలిక వ్యాధులైన ఆర్థ్రైటిస్, ఆస్తమా, చర్మసంబంధ రోగములు మొదలైనవి వర్షాకాలములో పెరిగే అవకాశం ఉంది.

### వర్షాకాలంలో వచ్చే వ్యాధుల ప్రధాన కారణాలు

**శుభ్రతా లోపము:** ఇది మన దేశములోని ఆరోగ్యపరమైన ప్రధాన సమస్య. పరిశుభ్రమైన పరిసరాలు లేకపోవడం చాలా వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం. మురుగుకాలువల వలన, ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ వలన, వ్యర్థ పదార్థాలను ఎక్కడబడితే అక్కడ పడవేయుట వలన వ్యాధికారక క్రిములు ప్రబలిపోతున్నాయి.

దీనికి మనవంతు కృషిగా కనీసం ఎవరి ఇంటి పరిసరాలు వారు శుభ్రంగా ఉంచుకోవాలి. చెత్తను రోడ్ల మీద ఖాళీ స్థలాలలో కుప్పలుగా వేయరాదు. ఎందుకంటే ఇవే క్రిములకు, దోమలకు, ఈగలకు నివాస స్థావరాలుగా మారుతాయి. కావున ప్రతివారు వారి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొంటే 50% ఐనా పర్యావరణ శుభ్రతను సాధించగలము.

**కలుషితమైన నీరు:** కలుషిత నీటి వలన మనకు సోకే వ్యాధులు.

- కలరా
- జాండిస్
- టైఫాయిడ్
- విరేచనాలు మొదలైనవి

ఇది చాలామందికి తెలిసిన విషయమే అయినా ఎందుకో ఇప్పటికి చాలా మంది వీటిగురించి పెద్దగా పట్టించుకోరు. కాచి, చల్లార్చి వడబోసిన నీటినే త్రాగటం వలన కలుషిత నీటి వలన వచ్చే అంటువ్యాధుల నుండి తప్పించుకోవచ్చు.

**దోమల వలన వచ్చే వ్యాధులు:** వానాకాలంలో మనకున్న మరొక ప్రధాన శత్రువు దోమ. వానాకాలం రాగానే దోమల ప్రభావం మొదలవుతుంది. దోమలు ఈ కాలంలోనే ఎక్కువగా పెరుగుతాయి. గుడ్లు పెడతాయి. నిలిచిపోయిన నీటిలో దోమలు గుడ్లు పెడతాయి. అందుకే వానాకాలం అందునా మన పరిసరాలు వాటికి స్వర్గతుల్యం ఎందుకంటే మన రోడ్లు, చెత్త, ఎక్కడపడితే అక్కడ నిలిచే నీరు దోమలు బాగా ప్రబలడానికి దోహదపడతాయి.

దోమల వలన వచ్చే వ్యాధులు: మలేరియా, డెంగ్యూ జ్వరం, చికన్ గున్యా (డెంగ్యూ జ్వరం, చికన్ గున్యా పగలు మాత్రమే కుట్టే దోమల వల్ల వస్తాయి. కాబట్టి దోమలంటే రాత్రి మాత్రమే కుడతాయి అనుకోవద్దు).

ఇటీవలి కాలంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు చాలా ఎక్కువగా ఉంటున్నాయి.

**మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు:** ఇంటి చుట్టు పక్కల ఎక్కడ నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. పాత టైర్లలో నీరు నిలుస్తుంది కాబట్టి వాటిని పడెయ్యడమో లేదా నీరు లేకుండా చూడటమో చేయాలి. మొక్కలకు కూడా తగు మోతాదులో నీరు పోయాలి. వేసవి కాలంలో వాడిన కూలర్లలో నీటిని తీసివేయాలి. ఇంటిలోపలికి దోమలు రాకుండా కిటికీలకు తలుపులకు మెష్‌ను బిగించవచ్చు. దోమ తెరలను వాడవచ్చు.

- వేడి వేడి పదార్థాలను తినాలి.
- శుభ్రమైన, పొడి బట్టలను కట్టుకోవాలి.
- ఇంటిలోకి గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలి.

పైన పేర్కొన్నవన్ని సాధారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు. పాఠకులకు ఒక సందేహం రావచ్చు. చాలామంది పైన పేర్కొన్న

**మనను మనం గౌరవించుకోగలిగితే ఇతరుల గౌరవం అయాచితంగా లభిస్తుంది.**

జాగ్రత్తలు అన్ని పాటించినా జబ్బుబారిన పడతారు. కొందరు ఏ జాగ్రత్తలు తీసుకోకపోయినా ఏ జబ్బు వారి దరిదాపులకు కూడా రాదు. దీనికి ఏమిటి కారణం?

వ్యాధికి మూలకారణం వ్యాధికారక క్రిములు మాత్రమే కాదు. ఎందుకంటే క్రిములే కనుక కారణమైతే ఒక ఇంట్లో ఒకే వాతావరణములో ఒకే ఆహారపు అలవాట్లు ఉన్నా, కొంత మందే వ్యాధి బారిన పడతారు. అందరూ కాదు. అంటే వ్యాధికి కారణం క్రిములేనా? అల్లోపతి వైద్యవిధానం క్రిముల మీదనే పూర్తి శ్రద్ధ పెట్టింది. క్రిములు మాత్రమే కారణమైతే అందరూ వ్యాధి బారిన పడాలి కాని ఎందుకు కొందరే పడుతున్నారు? క్రిములే వ్యాధి కారకము అని ఆంటిబయాటిక్స్ వాడటము సరి అయిన పద్ధతేనా? అనేది అందరు ఆలోచించాల్సిన విషయమే.

వ్యాధి కారకము బయటి నుండి వచ్చే క్రిములు ఒక్కటే కాదు ఆ క్రిములను ఎదుర్కొని పోరాడలేని స్థితిలో ఉన్న శరీర రోగ నిరోధక వ్యవస్థ. ఎందుకంటే ఎవరి శారీరక వ్యాధి నిరోధక వ్యవస్థ బలంగా ఉంటుందో వారికి వ్యాధులు రావడం తక్కువ. కాబట్టి మనల్ని మనం బాహ్య కారణాల నుండి రక్షించుకోవడం ఎంత ముఖ్యమో అంతకన్నా మనలోనే రోగనిరోధక శక్తిని పెంచుకోవడం. లోపలినుండి ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం.

శరీర అవయవాల సమన్వయముతో మానవుడు పరిసరాల ప్రభావాన్ని తట్టుకొని నిలబడగలగడమే ఆరోగ్య స్థితిగా హోమియో సిద్ధాంతం పరిగణిస్తుంది. మనకు కనపడకపోయినా మనలోని ప్రాణశక్తి మన ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఆరోగ్యాన్ని పునరుద్ధరించుకోవడానికి కూడా ఈ ప్రాణశక్తియే దోహద పడుతుంది. సారూప్య సిద్ధాంతానుసారంగా రోగికి ప్రయోగించిన ఔషధం ప్రాణశక్తిని ప్రేరేపించి ఆరోగ్య పునరుద్ధరణకు దోహదపడుతుంది.

మన అనారోగ్యానికి ముఖ్యంగా మూడు కారణాలను పేర్కొనవచ్చు. 1) పరిస్థితుల ప్రభావం 2) రోగి స్వభావం 3) రోగి వ్యక్తిత్వం

వీటిలో మొదటి బాహ్యం, మిగతా రెండూ అంతర్గతాలు. రోగి స్వభావాన్నే ససెప్టిబిలిటీ అని వ్యవహరిస్తారు. వ్యాధి ఒక్కటే అయినా వ్యక్తికి వ్యక్తికి లక్షణాలు భేదించటానికి ఆయా రోగుల వ్యక్తిత్వమే ముఖ్య కారణం.

హోమియో ఔషధాలు రోగిని ప్రభావితం చేసి వ్యాధి నివారణకు దోహదమవుతాయి. ఈ ఔషధాలు ప్రతికూల పరిస్థితులను మార్చలేవు. క్రిమిసంహారకాలుగా ఈ ఔషధాలు ఉపయోగపడవు. ఇది ప్రాణశక్తిని ప్రేరేపించి, వ్యాధి నిరోధశక్తిని పెంపొందించి రోగిని ఆరోగ్యవంతునిగా చేస్తాయి. సారూప్య ఔషధం మాత్రమే ఈ మేరకు సహకరించగలదు.

**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**


**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*


## మనిషి లక్షణాలు

*ఒక ఫకీరు ప్రతిరోజు పగటిపూట రెండు చేతులతో రెండు వెలుగుతున్న దివ్వెలను పట్టుకుని బజార్ల వెంట తిరుగుతూ ప్రతి దుకాణం ఎదుట కొంతసేపు నిలబడి ముందుకు సాగిపోయేవాడు. ఇది చూచిన ఒక వ్యక్తి "బాబా నీవు పగటిపూట దివ్వెలను చేతపబట్టి వెతుకుతున్నావు నీకు ఏమి కావాలి?" అని ప్రశ్నించాడు. దానికి ఫకీరు "నేను మానవులను వెతుకుతున్నానయ్యా! ఇంత పెద్ద సమూహాలలో ఎంత గాలించినా ఒక్కడు కూడా లభించలేదు" అని బదులు ఇచ్చాడు. ఆ వ్యక్తి ఆశ్చర్యంతో "నీకు మనుష్యులంటే తెలియడం లేదా, ఇక్కడ ఉన్నవారు మనుష్యులు కాక మరెవరు?" అని ప్రశ్నించాడు. దానికి ఫకీరు కన్నులు మూసుకుని "మనిషి అంటే 1) ఇంద్రియాలకు దాసుడు కాక ఇంద్రియాలకు అధిపతియై వాటిని శాసించగల శాసనకర్త 2) క్రోధాగ్నిలో పడి తాను మండుతూ ఆ అగ్ని కణాలతో ఇతరులను బాధపెట్టే పని ఏనాడు చేయనివాడు 3) కామవాసనలు లేనివాడు. ఈ మూడు లక్షణాలు ఉన్న శరీరధారులందరు నర పశువులు, మృగములు" అని అన్నాడు.*

*ఈ జనారణ్యంలో పైన చెప్పిన లక్షణాలు గల మానవుల ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఈ మూడు లక్షణాలను అందరు అలవరచుకోవాలి.* - ప్రజ్ఞా పురాణం నుండి

**విశ్వాసం అంతర్గత శక్తిని బహిర్గతం చేస్తుంది.**

# వేమన వేదం - నవజీవన నాదం - 9



ఆత్మశుద్ధి లేకుండా, ఆత్మతత్త్వం తెలియకుండా ఎన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను చదివినా, ఎన్ని నోములు, వ్రతాలు చేసినా అది వ్యర్థమే. ఈ భావాన్నే ఎన్నో సందర్భాలలో ఎన్నో రీతులలో పేర్కొన్న హేతువాది వేమన. కారణం తెలియకుండా కార్యసిద్ధి లభించదు. కావున మూలకారణం కొరకు వెదకవలెనన్న సత్యాన్ని నమ్మిన యదార్థవాది వేమన.

**తనదులోని జీవతత్త్వము తెలియక**
**వేరటంచు దలచి వెతుకుటెల్ల**
**భానునరయదివ్వె పట్టిన రీతిరా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ప్రతిమనిషి తనలోని ఆత్మ ఉనికిని, ఆత్మతత్వాన్ని, జీవాత్మ, పరమాత్మల ప్రాశస్త్యాన్ని తెలుసుకుని, తనలాగే ఇతరులలో కూడా పరమాత్మతత్త్వం ఉంటుందని గ్రహించగలిగితే అంతుకుమించిన జీవితసత్యం వేరే ఉండదని తెల్సుకోగలుగుతాడు. లేకుంటే ఆ ప్రయత్నం కేవలం వృథా ప్రయత్నమే అవుతుంది. అది ఎలా ఉంటుందంటే జగత్ప్రకాశకుడైన సూర్యుని దీపంతో వెతికినట్లుగానే నవ్వుల పాలయ్యే యత్నం లాంటిదే అవుతుంది. కావున ముందుగా నిన్ను నీవు తెల్సుకో. నీలో గల ఆత్మతత్త్వం తెల్సుకున్నపుడే నీవు నిజమైన ఆత్మజ్ఞానివి కాగలవు అని ప్రబోధించారు వేమన.

ఇదే భావాన్ని మరోపద్యంలో మరో దృష్టాంతంతో మార్గదర్శనం చేస్తారు వేమన.

**తనదు నాత్మయందు దైవంబు గలుగంగ**
**తీర్థయాత్రల కిలఁ దిరుగువాడు**
**గంధపుఁదునుకల గాడ్దెమోసినయట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

తనలోనే ఉన్న పరమాత్మతత్త్వాన్ని తెల్సుకోకుండా ఎక్కడెక్కడో వెదకడం పిచ్చి పని. మరియు వృథా ప్రయాస. చాలా మంది ఈ తత్వం తెలియక తీర్థయాత్రలు పేరిట పుణ్యక్షేత్రాలను దర్శిస్తారు. కానీ వారికి కేవలం స్వయం సంతృప్తి దక్కుతుందే తప్ప నిజమైన ఆత్మ సంతృప్తి లభించదు. అంతేకాకుండా పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో కూడా. అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలను విడువకుండా దర్శనం దగ్గర నుండి దైవప్రసాదం పొందేవరకు క్రమమార్గాలను విడిచిపెట్టి, అక్రమ మార్గాలను ఆశ్రయించడం పరిపాటి. పుణ్యక్షేత్రాలకు వెళ్ళినా మండల దీక్షను ముగించే సమయంలో కూడా ఇలా సంకుచితంగా ప్రవర్తిస్తే ఇంక దైవసాన్నిధ్యంలో మనం పొందేదేముంటుంది? కాబట్టి తీర్థయాత్రలలో, పుణ్యక్షేత్ర సందర్శన సమయంలో చిత్తశుద్ధి, పవిత్ర భావనలు ఉంటే ఆత్మతత్వం, పరమాత్మ జ్ఞానం కలుగుతాయి లేకుంటే గాడిద గంధపు చెక్కలను మోసినా దాని పరిమళాన్ని ఆస్వాదించే శక్తి ఎలా పొందదో, అదే విధంగా మానవుడు తత్త్వదర్శనం చేయలేడు.

ఇదే తత్త్వాన్ని మరో సందర్భంలో ఇలా వివరించాడు వేమన.

**తిరిగి తిరిగినరుడు ద్రిమ్మరికాగానే**
**అందువల్ల నేమి అధికమొప్పు**
**నంతరంగమెఱిగినప్పుడే శివుఁడౌను**
**విశ్వదాభిరామ వినురవేమ !**

అంతరంగశుద్ధి లేకుండా, ఆత్మతత్త్వం తెలియకుండా ఎన్ని పుణ్య క్షేత్రాలను దర్శించుకున్నా ప్రయోజనం చేకూరకపోగా, దేశదిమ్మరి (దేశాలు పట్టుకు తిరిగేవాడు) అనే అపఖ్యాతి లభిస్తుంది. అన్నీ తెల్సి, అణిగి మణిగి ఉంటూ, ఆత్మజ్ఞానబోధ చేసినపుడు శివకరమైన (మంగళకరమైన) బ్రహ్మజ్ఞాని అవుతాడు లేకుంటే శవమై నిర్లిప్తంగా, నిర్జీవంగా మెసలుతాడు. కావున నీలో ఉన్న శివుడు. అందరిలో ఉన్న శివుడు ఒకటేనని తెల్సుకున్ననాడే "మానవసేవయే మాధవసేవ" అన్న ఆర్యోక్తి సార్థకమవుతుంది.

ఈ విశ్వంలో ఏదీ శాశ్వతం కాదు. అన్నీ అశాశ్వతమే. అయితే అశాశ్వతమైన వాటి కొరకు వెంపరలాడుతూ, శాశ్వతమైన ముక్తికి దూరమౌతున్నాడు సగటు మనిషి. ఈ సత్యాన్ని వేమన ఇలా వివరించారు.

**తనువదెవరి సొమ్ము తనదని పోషింప**
**ద్రవ్యమెవరి సొమ్ము దాచుకొనగ**
**బ్రాణమెవరి సొమ్ము పారిపోవక నిల్వ**
**విశ్వదాభిరామ వినురవేమ !**

'శీర్యతే ఇతి శరీరః', 'క్షీణించిపోయేదే శరీరము' వయస్సు పెరుగుతున్న కొద్దీ జవసత్వాలు కరిగిపోయి క్షీణించిపోతుంది.

**చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే విజయాన్ని సాధించవచ్చు.**

అటువంటి కృశించే శరీరం కొరకు దానిని తీర్చిదిద్దే అనవసర ప్రయత్నం వల్ల అసలు జీవిత పరమార్థానికి దూరమవుతున్నాడు మానవుడు.

అలాగే చంచలమైన ధనాన్ని సంపాదించడం కొరకు, దాచుకొనుట కొరకు అహర్నిశలు శ్రమిస్తూ సంపాదించి, చివరకు అది దాయాదులకు, సంతానానికి, లేదంటే శిస్తుల రూపంలో రాజుల వశం చేస్తారు. ఈ సత్యం అందరికీ తెల్సినప్పటికి ధన మోహం అలా ప్రభావితం చేస్తుంది.

అదేవిధంగా ఎప్పుడో ఒకప్పుడు పోయేదే ప్రాణం. అయినా సరే ప్రాణం పోతుందన్న భయంతో మనిషి మానసికంగా కృంగిపోతూ, మృత్యుభయంతో భయపడి చస్తూ బ్రతుకుతూ ఉంటాడు. ఇది నిరర్థమైన, నిష్ప్రయోజనమైన లోకవృత్తి, లౌకిక ప్రవృత్తి.

ఏ పని అయిన సఫలం కావాలంటే ఆ ఘడియ రావాలి. తగిన సమయం రావాలి. అంతేకాని ఎంత శ్రమ పడినా, ఆ ఘడియ రానపుడు ఫలితం లభించకపోగా, వ్యతిరేక ఫలితాలు సంభవించే అవకాశం ఉంది. కాబట్టి పక్వదిశకు చేరేంత వరకు వేచిఉన్నపుడే అది సఫలం అవుతుంది.

**తామసించి చేయఁదగదెట్టి కార్యంబు**
**వేగిరింపనదియు విషమగును**
**పచ్చికాయఁదెచ్చి పడవేయఫలమౌనె?**
**విశ్వదాభిరామ వినురవేమ !**

తొందరతో, వేగంగా పనిపూర్తి అవ్వాలనే ఆలోచన ఎన్నటికి తగదు. అందువల్ల అది విషపూరితమవుతుందే కానీ విజయవంతం కాదు.

నేడు వ్యాపారస్తులు కృత్రిమ పద్ధతులలో పండిస్తున్న పంటలు, మామిడి, యాపిల్ వంటి ఫలాలు అనారోగ్యకరమైనవే కాని ఆరోగ్యకరమైనవి కావు. హైబ్రీడ్ (కృత్రిమ) విత్తనాలు, పంటలు మనుష్యుల ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తాయి. ఈ సత్యాన్ని వేమన ఆనాడే గ్రహించి వెలువరించారు.

లౌకిక వ్యవహారంలో ఉత్తముడు, మధ్యముడు, అధముడు ఎవరని తెలుసుకోవాలనుకునే జిజ్ఞాసికి వేమన ఇలా వివరించారు.

**నేరనన్నవాడునెఱజాణ మహిలోన**
**నేర్తునన్నవాడు వార్తకాడు**
**ఊరుకున్నవాడే ఉత్తమ యోగిరా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

తనకేది తెలియదంటూ, అతి వినయాన్ని ప్రదర్శిస్తూ, ఇతరుల మనోభావాలను తెల్సుకోవడం నేర్పరి లక్షణం. అతడు అందరి ప్రశంసలను పొందే లౌక్యం తెల్సినవాడు. 'నేర్చుకుంటాను నేర్చుకోవాలని ఉంది' అనేవాడు మాటకారి. చాతుర్యంతో అవతలి వారి మనస్సులను చదవగల్గేవాడు మధ్యముడు. 'తమకు తెల్సినది చాలా ఉన్నా, తెలియవలసినది ఎక్కువగా ఉంది' అన్న భావంతో ఎటువంటి వివాదాలకు తావీయక మౌనంగా ఉండేవాడు ఉత్తమ యోగి అని వివరించాడు వేమన.

కావున ఉత్తమ, మధ్యమ, అధములు పై విధంగా ఉంటారని పేర్కొన్న సత్యాన్వేషి వేమన.

**పరగ ఋషులు భువిని పరమ పవిత్రులై**
**మించిలోకమునకు మేలు సేత**
**సంచితార్థములను సమసింప జేయుటే**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఋషి ధర్మాన్ని గురించి వేమన పై పద్యంలో వివరిస్తూ, లోకహితమును కోరే పనులను చేయడమే ఋషి ధర్మం అంటారు. లోక కంటకులైన రాక్షసులను నాశనం చేయడానికి తపశ్శక్తి ఎంతో ఉన్నప్పటికీ, విశ్వామిత్రుడు రాముని లోకాభిరామునిగా చేయాలన్న తపనతో తనతో తీసుకువెళ్ళి తాటకిని వధింప చేయుటమే కాక, అహల్య శాపవిమోచనం చేయించి, సీతా మహాసాధ్వితో రాముని వివాహానికి కారణభూతుడయ్యాడు. ఇహలోక కల్యాణం కొరకు తమ శక్తిని, యుక్తిని ధారపోయడమే ఋషిధర్మం అని తెలియజేశాడు. యజ్ఞయాగాదుల ద్వారా వర్షాలు పడాలని, తద్వారా మంచి పంటలు పండాలని, విశ్వశాంతి కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయవలెనని అవగతమౌతోంది.

కావున ఈ సత్యాలను తెల్సుకొని ఆచరించగల్గినపుడే వేమన సూక్తులకు సార్థకత లభిస్తుంది. మానవ జన్మ చరితార్థమవుతుంది.

– సాధన నరసింహాచార్య

(శ్రీ పావనిసేవా సమితి ప్రచురించిన 'వేమన శతకం' ప్రతి నుండి పద్యములు గ్రహించబడినవి)

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

చేసిన తప్పులను సరిదిద్దుకుని విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

# 2011 ఆగస్టు 1 నుండి 30 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జన్మశతాబ్ది రథ యాత్ర కాలసూచిక

| క్ర. సం. | తేది మరియు వారము | స్థలము | చేరే సమయం | బయలుదేరు సమయం | కార్యక్రమము | సంప్రదించవలసిన చిరునామా | ఫోన్ నంబర్లు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 01.08.2011 సోమవారము | తిరుమల | ఉ॥ 08.00 | మ॥ 01.00 | తిరుమల బాలాజి దర్శనం | శ్రీమతి మునిలక్ష్మి, ఇ.నెం.7-53/2 వాసవినగర్, యం.ఆర్.పల్లి., తిరుపతి | 0877-2220388<br>9848505632 |
| 2 | 01.08.2011 సోమవారము | తిరుపతి | మ॥ 03.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞ కార్యక్రమం | శ్రీ శాంతిలాల్ పరేక్<br>శ్రీ చంద్రలాల్ కుమావత్ | 9441088267<br>9440271117 |
| 3 | 02.08.2011 మంగళవారము | తిరుపతి | | ఉ॥ 06.00 | | | |
| 4 | 02.08.2011 మంగళవారము | శ్రీకాళహస్తి | ఉ॥ 07.00 | ఉ॥ 10.00 | పూజా మరియు అల్పాహారము | శ్రీ సుధాకర్ (అడ్వకేట్)<br>శ్రీమతి సుభాషిణి | 08578-223599 |
| 5 | 02.08.2011 మంగళవారము | గూడూర్ సూళ్ళూరుపేట | ఉ॥ 11.00 | మ॥ 03.00 | పూజా, భోజనము మరియు సత్సంగం | | |
| 6 | 02.08.2011 మంగళవారము | నెల్లూరు | సా॥ 04.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ తిరునారాయణ<br>శ్రీ గోవర్ధన్ సింగ్<br>శ్రీ భాస్కర నాయుడు | 9848243409<br>9441277207<br>0861-2328239<br>9490320739 |
| 7 | 03.08.2011 బుధవారము | నెల్లూరు | | ఉ॥ 10.00 | | శ్రీ భాస్కర నాయుడు | 9490320739 |
| 8 | 03.08.2011 బుధవారము | రాజుపాలెం | ఉ॥ 11.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | భువన (టీచర్) | 9290979795 |
| 9 | 03.08.2011 బుధవారము | ఒంగోలు | సా॥ 04.00 | నెట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీమతి రాజ్యలక్ష్మి అమ్మ | 9491317670 |
| 10 | 04.08.2011 గురువారము | ఒంగోలు | | ఉ॥ 08.00 | | | |
| 11 | 04.08.2011 గురువారము | వేటపాలెం | ఉ॥ 10.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీమతి మోరపాక లక్ష్మి | 9291602673 |
| 12 | 04.08.2011 గురువారము | చీరాల | సా॥ 05.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ డి.వి.ఆర్.మూర్తి<br>శ్రీ చలపతి జీ<br>శ్రీ సవాయ్ సింగ్ | 9440853603<br>9849366834<br>9441088216 |
| 13 | 05.08.2011 శుక్రవారము | చీరాల | | ఉ॥ 08.00 | ఫలాహారము | | |
| 14 | 05.08.2011 శుక్రవారము | బాపట్ల | ఉ॥ 09.00 | మ॥ 03.00 | పూజా, భోజనము మరియు సత్సంగం | డా॥ శివ కుమార్ | 9885898648 |
| 15 | 05.08.2011 శుక్రవారము | కొత్తపాలెం | సా॥ 04.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ నాగరాజన్ కుమారి<br>శ్రీ కె. సింగారెడ్డి | 9908721047<br>8985619782 |

**ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవలసిన అవసరం అందరికి ఉంటుంది.**

| క్ర. సం. | తేది మరియు వారము | స్థలము | చేరే సమయం | బయలుదేరు సమయం | కార్యక్రమము | సంప్రదించవలసిన చిరునామా | ఫోన్ నంబర్లు |
|---|---|---|---|---|---|---|---|
| 16 | 06.08.2011 శనివారము | కొత్తపాలెం | | ఉ॥ 07.00 | | | |
| 17 | 06.08.2011 శనివారము | పొన్నూరు | ఉ॥ 09.00 | మ॥ 03.00 | పూజా, అల్పాహారము మరియు భోజనము | శ్రీ శ్రీనివాసరావు<br>శ్రీ దమ్మాల | 9290798588 |
| 18 | 06.08.2011 శనివారము | నారాకోడూరు | సా॥ 05.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ కోట సుబ్బారావు | 0863-2534658<br>9440738381 |
| 19 | 07.08.2011 | నారాకోడూరు | | ఉ॥ 07.00 | | | |
| 20 | 07.08.2011 ఆదివారము | గుంటూరు | ఉ॥ 07.30 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీమతి శ్యామలమ్మ<br>శ్రీ లక్ష్మిపతి | 0863-2217221<br>9440263039 |
| 21 | 07.08.2011 ఆదివారము | నంబూరు | సా॥ 05.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ ప్రకాష్ రెడ్డి<br>శ్రీ డి.ఎన్.విశ్వనాథం | 9440441559<br>9440738381 |
| 22 | 08.08.2011 సోమవారము | నంబూరు | | ఉ॥ 06.00 | | | |
| 23 | 08.08.2011 సోమవారము | నర్సరావుపేట, లక్ష్మీపురం | ఉ॥ 08.00 | మ॥ 03.00 | పూజా, అల్పాహారము మరియు భోజనము | శ్రీ పేరి శాస్త్రి<br>శ్రీమతి అనిత<br>శ్రీ శ్రీనివాసరావు | 9440668576<br>9010521114<br>9652744717 |
| 24 | 08.08.2011 సోమవారము | పిడుగురాళ్ళ | సా॥ 05.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ అరుణ చౌదరి<br>శ్రీమతి సుమలత | 9347947155<br>9949398447 |
| 25 | 09.08.2011 మంగళవారము | పిడుగురాళ్ళ | | ఉ॥ 07.00 | | | |
| 26 | 09.08.2011 మంగళవారము | కొండమల్లేపల్లి | ఉ॥ 10.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ చంద్రమౌళి<br>శ్రీ నరసింహ | 9441009536<br>9440536956 |
| 27 | 09.08.2011 మంగళవారము | ఇబ్రహీంపట్నం | సా॥ 05.00 | రా॥ 08.00 | దీపయజ్ఞము మరియు పూజా | శ్రీ రతన్‌లాల్ ఓఝా | 9347533093 |
| 28 | 09.08.2011 మంగళవారము | హైదరాబాద్ | రా॥ 10.00 | నైట్ హాల్ట్ | విశ్రాంతి | | |
| 29 | 10.08.2011 బుధవారము | హైదరాబాద్ ఎస్.ఆర్.నగర్ | ఉ॥ 08.00 | ఉ॥ 10.00 | పూజా మరియు భోజనము | శ్రీ హనుమంత రెడ్డి | 9440722860 |
| 30 | 10.08.2011 | హైదరాబాద్-బోరబండ | మ॥ 03.00 | | పూజా | శ్రీ వెంకటేష్ గుప్తా | 9290461386 |
| 31 | 11.08.2011 గురువారము | హైదరాబాద్ గోషామహల్ | ఉ॥ 08.00 | | పూజా, భోజనము మరియు దీపయజ్ఞము | శ్రీ నవరతన్ ఓఝా | 9866206922 |
| 32 | 12.08.2011 శుక్రవారము | మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ కొత్తపేట, వనస్థలిపురం చంపాపేట్ | ఉ॥ 08.00 నుండి రా॥ 7.00 | | పూజా | శ్రీమతి విజయ విశ్వనాథ్<br>శ్రీ శంకర్‌సింగ్ రాజపురోహిత్<br>శ్రీమతి మంజుల బాన్<br>శ్రీమతి డా॥ బేబి | 9949088261<br>0931075632<br>9394442122<br>040-24048705<br>9440925876 |

వ్యక్తిత్వ వికాసానికి తమ నైజాన్ని, ప్రవర్తనను సమీక్షించుకోవాలి.

| క్ర. సం. | తేది మరియు వారము | స్థలము | చేరే సమయం | బయలుదేరు సమయం | కార్యక్రమము | సంప్రదించవలసిన చిరునామా | ఫోన్ నంబర్లు |
|---|---|---|---|---|---|---|---|
| 33 | 13.08.2011 శనివారము | హైదరాబాద్ | | ఉ॥ 06.00 | | | |
| 34 | 13.08.2011 శనివారము | సిరిసిల్లా | ఉ॥ 09.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ బాదం ప్రకాశ్ | 9030504114 |
| 35 | 13.08.2011 శనివారము | వేములవాడ | సా॥ 05.00 | | దీపయజ్ఞము | డా॥ పి. సత్యనారాయణ | 9440516042 |
| 36 | 14.08.2011 ఆదివారము | వేములవాడ | | ఉ॥ 07.00 | | | |
| 37 | 14.08.2011 ఆదివారము | జగిత్యాల | ఉ॥ 09.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ ఆడెపు గంగారం<br>శ్రీ రామిరెడ్డి | 9959368122 |
| 38 | 14.08.2011 ఆదివారము | కామారెడ్డి | సా॥ 05.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము మరియు భోజనము | శ్రీ రంగారావు<br>శ్రీ సిహెచ్. ఉపేంద్ర | 9441922700<br>9908611615 |
| 39 | 15.08.2011 సోమవారము | కామారెడ్డి | | ఉ॥ 06.00 | | | |
| 40 | 15.08.2011 సోమవారము | నిజామాబాద్ | ఉ॥ 07.00 | మ॥ 04.00 | పూజా మరియు భోజనము | శ్రీ దఖ కతారియా<br>శ్రీ కేశుభాయి | 08462-2373722<br>9346657579<br>9849105813 |
| 41 | 15.08.2011 సోమవారము | ఆదిలాబాద్ | సా॥ 06.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ దిలీప్‌భాయి<br>శ్రీ విఠల్‌భాయి | 944000118<br>08732-231022 |
| 42 | 16.08.2011 మంగళవారము | ఆదిలాబాద్ | | ఉ॥ 07.00 | | | |
| 43 | 16.08.2011 మంగళవారము | కాగజ్‌నగర్ | ఉ॥ 11.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ సి.హెచ్. రవి<br>శ్రీ జె.ఎన్.సింగ్ | 9440170669<br>08738-235440<br>09705314436 |
| 44 | 17.08.2011 బుధవారము | కాగజ్‌నగర్ | | ఉ॥ 07.00 | | | |
| 45 | 17.08.2011 బుధవారము | మంచిర్యాల్ | ఉ॥ 08.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ రాజబాబు | 08736-251692<br>9866028692 |
| 46 | 17.08.2011 బుధవారము | వరంగల్ | సా॥ 06.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ మల్లిఖార్జున గుప్తా<br>శ్రీ సదానందం | 9866074900<br>9849790230 |
| 47 | 18.08.2011 గురువారము | వరంగల్ | | ఉ॥ 07.00 | | | |
| 48 | 18.08.2011 గురువారము | తొర్రూర్ | ఉ॥ 09.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ జి. సుబ్బారావు (పోస్ట్‌మాస్టర్)<br>శ్రీ డి. శ్రీనివాస్ | 9912458141<br>9989732662 |

**సాత్విక స్వభావం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.**

| క్ర. సం. | తేది మరియు వారము | స్థలము | చేరే సమయం | బయలుదేరే సమయం | కార్యక్రమము | సంప్రదించవలసిన చిరునామా | ఫోన్ నంబర్లు |
|---|---|---|---|---|---|---|---|
| 49 | 18.08.2011 గురువారము | ఖమ్మం | సా॥ 05.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ బాలకృష్ణ చౌదరి | 08742-226126 9440816937 939476895 |
| 50 | 19.08.2011 శుక్రవారము | ఖమ్మం | | ఉ॥ 07.00 | | | |
| 51 | 19.08.2011 శుక్రవారము | ఎల్లందు | ఉ॥ 09.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ సతీష్ ఖండేల్వాల్ | 08745-252103 9441023101 |
| 52 | 19.08.2011 శుక్రవారము | రాజమండ్రి | రా॥ 08.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ జగదీశ్ వైష్ణవ్ | 9440423561 |
| 53 | 20.08.2011 శనివారము | రాజమండ్రి | | ఉ॥ 10.00 | | | |
| 54 | 20.08.2011 శనివారము | అమలాపురం | మ॥ 12.30 | నైట్‌హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీమతి కె. నాగమణి శ్రీ రామానందస్వామి | 9299998579 08856-234115 |
| 55 | 21.08.2011 ఆదివారము | అమలాపురం | | ఉ॥ 06.00 | | | |
| 56 | 21.08.2011 ఆదివారము | కాకినాడ | ఉ॥ 08.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ రాజేందర్ లకోటి శ్రీ కృష్ణారావు | 0884-6598235 9440769798 |
| 57 | 21.08.2011 ఆదివారము | యలమంచిలి | సా॥ 05.00 | నైట్‌హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ టి.వి.ఎస్. నాగేశ్వరరావు | 9948078999 |
| 58 | 22.08.2011 సోమవారము | యలమంచిలి | | ఉ॥ 06.00 | | | |
| 59 | 22.08.2011 సోమవారము | విశాఖపట్టణం | ఉ॥ 09.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ గాయత్రి పరివార్ శ్రీ అవతారం రాజు | 09849705723 9490132923 |
| 60 | 23.08.2011 మంగళవారము | విశాఖపట్టణం | | ఉ॥ 08.00 | | | |
| 61 | 23.08.2011 మంగళవారము | విజయనగరం | ఉ॥ 10.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ కుసుమంచి సుబ్బారావు శ్రీ పి.వి. చలమయ్య | 9346411159 9490824773 |
| 62 | 23.08.2011 మంగళవారము | పార్వతీపురం | సా॥ 06.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ పి.వి. రమణ శ్రీమతి వసుంధరమ్మ | 08963-221650 9885140850 |
| 63 | 24.08.2011 బుధవారము | పార్వతీపురం | | ఉ॥ 07.00 | | | |
| 64 | 24.08.2011 బుధవారము | కురుపాం & రవ్వాడ | ఉ॥ 08.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ ఎస్. శంకరరావు శ్రీ సి.హెచ్. ఆదినారాయణ | 9908735232 9849845165 9441349229 |

**లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకోకపోతే మన శక్తి సామర్థ్యాలు వృథా అవుతాయి.**

| క్ర. సం. | తేది మరియు వారము | స్థలము | చేరే సమయం | బయలుదేరు సమయం | కార్యక్రమము | సంప్రదించవలసిన చిరునామా | ఫోన్ నంబర్లు |
|---|---|---|---|---|---|---|---|
| 65 | 24.08.2011 బుధవారము | గుడివాడ | ఉ॥ 09.00 | నైట్ హాల్ట్ | | శ్రీ శ్రీనివాసరావు<br>శ్రీ ఎన్.ఎస్.ప్రసాద్ (హెచ్.యం.) | 9394211288<br>08674-244088<br>08674-242644 |
| 66 | 25.08.2011 గురువారము | గుడివాడ | | ఉ॥ 09.00 | | | |
| 67 | 25.08.2011 గురువారము | విజయవాడ | ఉ॥ 11.00 | నైట్ హాల్ట్ | పూజా మరియు భోజనము | శ్రీ లింగం జీ<br>గాయత్రి పరివార్ | 9246493453<br>08666-616570 |
| 68 | 26.08.2011 శుక్రవారము | విజయవాడ | | ఉ॥ 06.00 | | | |
| 69 | 26.08.2011 శుక్రవారము | గిద్దలూరు | మ॥ 12.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ శంకర్‌లాల్ (హోటల్)<br>శ్రీ అంజనీ కుమార్ (అడ్వకేట్) | 9032047632<br>9866882586 |
| 70 | 26.08.2011 శుక్రవారము | నంద్యాల | సా॥ 05.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ హనుమాన్ సింగ్ రాజపురోహిత్<br>శ్రీ దీపక్ కుమార్ | 9440861389<br>9440985592 |
| 71 | 27.08.2011 శనివారము | నంద్యాల | | ఉ॥ 07.00 | | | |
| 72 | 27.08.2011 శనివారము | కడప | ఉ॥ 10.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ మోహన్ సింగ్ రాజపురోహిత్ | 9440778897<br>9885546295 |
| 73 | 28.08.2011 ఆదివారము | కడప | | ఉ॥ 08.00 | | | |
| 74 | 28.08.2011 ఆదివారము | ప్రొద్దుటూరు | ఉ॥ 09.00 | మ॥ 03.00 | పూజా మరియు భోజనము | శ్రీ సత్యనారాయణ రెడ్డి<br>శ్రీ జి. వెంకట సుబ్బారెడ్డి | 9885408580<br>9490231729 |
| 75 | 28.08.2011 ఆదివారము | అనంతపురం | సా॥ 07.00 | నైట్ హాల్ట్ | దీపయజ్ఞము | శ్రీ సి.వి.రమణ (రిటైర్ట్ ప్రిన్సిపల్) | 08554-277326<br>9440128777<br>9440566530 |
| 76 | 29.08.2011 సోమవారము | అనంతపురం | | ఉ॥ 06.00 | | | |
| 77 | 29.08.2011 సోమవారము | ధర్మవరం | ఉ॥ 08.00 | నైట్ హాల్ట్ | పూజా, భోజనము మరియు దీపయజ్ఞము | శ్రీ బి. ప్రసాద్ | 9866939065 |
| 78 | 30.08.2011 మంగళవారము | ధర్మవరం | | ఉ॥ 06.00 | | | |
| 79 | 30.08.2011 మంగళవారము | పుట్టపర్తి | ఉ॥ 08.00 | | | | |
| 80 | 30.08.2011 మంగళవారము | బెంగుళూరు | | | | | |

**మన పట్ల మనకు గౌరవం లేకపోతే జీవితం బాధాకరంగా ఉంటుంది.**

# 9 రోజుల సంజీవని సాధనా శిబిరముపై సమీక్ష

శాంతికుంజ్ హరిద్వార్‌లో 11 మే 2011 నుండి 19 మే 2011 వరకు సంజీవని సాధనా శిబిరము తెలుగు భాషలో సౌత్ సెల్ సారథ్యములో నిర్వహించబడినది.

ఈ శిబిరములో 1) డా॥ శంకర్ ప్లాంజరి (పుట్టపర్తి సత్యసాయి ప్రధాన అనుచరుడు) హైదరాబాద్, 2) డా॥ పి.వి.ఎస్. రెడ్డి, ఐపిఎస్, డైరెక్టర్ ఇండియన్ పోస్టల్ సర్వీసెస్ మరియు 3) శ్రీ ఎస్. సుబ్బారెడ్డి, (జి.పుల్లారెడ్డి విద్యాసంస్థల అధిపతి) పాల్గొన్న ప్రముఖ వ్యక్తులు. అదే విధముగా దాదాపు 600పైగా శాంతికుంజ్‌ను ఈ శిబిర సమయంలో రాష్ట్రం నుండి దర్శించారు. వీరిలో 60శాతం గంగా పుష్కరాలకై మరియు చార్‌ధాం యాత్రం నిమిత్తం విచ్చేసిరి. 200 మంది నిఖరంగా శిబిరంలో పాల్గొనిరి.

11 మే ఉదయం 10 గం॥లకు శ్రీ సుబ్బారెడ్డిగారి దీప ప్రజ్వలనతో శిబిరం ప్రారంభము కాగా, శ్రీమతి అనసూయమ్మ మరియు శ్రీ ఉత్తమ్ గైక్వాడ్‌లు ప్రేరణాగీతములు ఆలపించిరి. సంకల్ప దీక్షను శ్రీ పరమానంద ద్వివేది చేయించారు. శ్రీ అశ్విని సుబ్బారావు గారు ప్రసంగిస్తూ సమయపాలన మరియు శిక్షణ యొక్క ప్రాముఖ్యత వివరించారు. అట్లే శ్రీ పరమానంద ద్వివేదిగారు మాట్లాడుతూ గాయత్రీ మంత్రార్థాన్ని, సవితాశక్తిని, ఉపాసనా ప్రాముఖ్యతను, ప్రేమశక్తిని వివరించి చెప్పారు.

రాత్రి 6.30 గం॥కు డా॥ గౌర్ జీ ప్రసంగిస్తూ మానవులలో గల నరపశువులు, నరహంతకులు మరియు నరదేవతల మధ్యగల తేడాను వివరిస్తూ, నరదేవతలుగా రూపొందండి అని ప్రబోధించారు.

12వ తేది డా॥ ప్రణవ్ పండ్యాగారిని శిబిరానికి డా॥ అశ్విని సుబ్బారావుగారు పరిచయం చేశారు. తదుపరి పూజ్యగురుదేవులు, డా॥ ప్రణవ్ పండ్యాగారిని ఏవిధముగా ప్రాణాపాయ స్థితి నుండి కాపాడి వారికి పునర్జన్మను ప్రసాదించినది వివరిస్తూ, వారిరువురి మధ్యగల సంబంధ బాంధవ్యాన్ని వివరించారు.

డాక్టరుగారు తమ ప్రసంగంలో పూజ్య గురుదేవుల తపశ్శక్తిని వివరిస్తూ ఈ క్రింది తమ అనుభవాలను సభకు వివరించారు. “ఒకరోజు పూజ్య గురుదేవుల దర్శనార్థమై దేశంలోని పలు ప్రాంతాల నుండి భక్తులు వచ్చి వారిని దర్శిస్తూ ఉన్నారు. ఇంతలో గురుదేవులు, వెలుపల క్యాన్సరుతో బాధపడుతూ ఒక వ్యక్తి నా కొరకు వేచి ఉన్నారు. ఆయనను లోపలికి తీసుకొనిరండి” అని పురమాయించారు. ఆ వచ్చిన వ్యక్తిని పరీక్షించి (రెండు మాసాలే ఆయుష్షు అని డాక్టర్లు చెప్పారు) “ఈ గులాబి పూరేకులను రోజుకు ఒక్కటి చొప్పున తిను – నీకు స్వస్థత చేకూరుతుంది” అని ఆశీర్వదించి పంపారు. ప్రక్కనే ఉన్న డాక్టరైన నాకు గురుదేవుల మాటలు ఆశ్చర్యాన్ని గొలిపాయి. కొద్ది రోజులలో క్యాన్సరుతో మరణించుట తథ్యము అని వైద్య పరీక్షల రిపోర్టులు తెలుపుతూ ఉంటే వైద్య విద్య తెలియని ఒకానొక గాయత్రి ఉపాసకుడు, గులాబి పూరేకులతో క్యాన్సరు నయమౌతుంది అని చెప్పుట నాకు నమ్మశక్యము కాలేదు. ప్రొఫెసరు అయిన ఆ రోగితో విడిగా మాటలాడి తన ఆరోగ్య స్థితిని గురించి వారం–వారం తెలుపవలసినదిగా కోరి, నా చిరునామా ఇచ్చాను. గురుదేవుల ఆశీర్వాదం ప్రకారం అతి త్వరగా అతను సంపూర్ణ ఆరోగ్యాన్ని పొంది, ఒక దశాబ్ది పాటు గురుదేవుల కార్యక్రమాలు చేసినాడు. అప్పుడు ఆధ్యాత్మిక శక్తి అన్నింటికన్నా గొప్పది, దానిని మించినది లేదు అని నిర్ధారించుకొని– గురుదేవులకు సర్వ సమర్పణగావించుకొన్నాను” అని తెలియజేశారు. అట్లే తమ మరియొక అనుభవాన్ని ఇట్లు చెప్పారు.

“నేను అనుష్ఠానము చేయుట ప్రారంభించినాను. మొదటి సారి 20 రోజులు పూర్తికాగానే గురుదేవులు నన్ను పిలచి అర్జంటు పని నిమిత్తం మరొక చోటికి పంపారు. రెండవ పర్యాయం 25 రోజులు గడచిన పిమ్మట మరియొక మారు పని చెప్పి అనుష్ఠానానికి ఆటంకం కల్గించారు. ఈ విధంగా నాలుగుసార్లు ఆటంకం కల్గించారు. 5వ సారి మరొకరోజులో అనుష్ఠానం పూర్తి కానుండగా గురుదేవులు పిలిచి మరల నాకు పని చెప్పారు. నేను ఈసారి వెళ్ళను అని గురుదేవులకు స్పష్టంగా చెప్పి – ఎందుకు నా అనుష్ఠానాన్ని మాటి మాటికి భంగపరచుచున్నారని ప్రశ్నించాను – “కుమారా! దేని నిమిత్తమై నీవు అనుష్ఠానం చేస్తున్నావు” అని ప్రశ్నించగా, గాయత్రీమాతను దర్శించాలి అని జవాబిచ్చాను గురుదేవులకు. “ఓస్! ఇంతేనా! కన్నులు మూసుకో” అన్నారు – నేను అలాగే చేశాను – గురుదేవులే నాకు గాయత్రీ మాతగా, గురుదేవులుగా మార్చి మార్చి దర్శనమిచ్చినారు. నా ఆనందానికి అవధులు లేవు.

నా మూడవ అనుభవము హిందీలో అనర్గళంగా వ్రాయుట – నా మాతృభాష హిందీ అయినా నేను ఆంగ్లభాషలో విద్య నభ్యసించుటచేత గురుదేవుల ప్రసంగాలను, సంభాషణలను హిందీలో వ్రాయుట నాకు చాలా కష్టంగా ఉండేది, దీనినే గురుదేవులకు విన్నవించుకున్నాను. వారు వెంటనే నా తలపై వారి వామహస్తముంచి, ఆశీర్వదించారు. ఆనాటి నుండి నేను అనర్గళంగా హిందీలో వ్రాయుట ప్రారంభించినాను.

పై సంఘటనలతో గురుదేవులు నాకు సర్వస్వమైపోయారు. ఆధ్యాత్మిక శక్తికి సాటి ఏదీ లేదు అని నేను రూఢిపరచుకొన్నాను. వైజ్ఞానిక శక్తికి ఆధ్యాత్మిక శక్తి మార్గదర్శనం చేస్తూ ఉండాలి, లేనిచో అదివినాశనానికి దారితీస్తుంది. గాయత్రి, గంగా, గోమాత, గోవింద, గీత – ఈ ఐదు భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు. గంగలో మానసిక స్నానం చేయండి. 2011 నవంబరు 6 నుండి 10 తేదీల మధ్య కోటి నుండి కోటిన్నర మంది పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది ఉత్సవాలను తిలకించుటకై శాంతికుంజ్‌ను

**పరిస్థితులుగాని, పరిసరాలుగాని, వ్యక్తులుగాని మన వైఫల్యాలకు కారణం కాదు.**

సందర్శించెదరు. దీనిలో మీరు కూడా భాగస్వాములు కండి. మీ అందరికి పూజ్యగురుదేవులు, వందనీయ మాతాజీల దివ్యాశీస్సులు సర్వదా లభించుగాక" అని ప్రవచించిరి.

మధ్యాహ్నం శ్రీ అశ్విని సుబ్బారావుగారు శాంతికుంజ్‌తో తన ప్రథమ సమాగమాన్ని వివరించారు. రాత్రి ప్రసంగంలో శ్రీమతి ఉషా రాకేష్ జైశ్వాల్, గురుదీక్షా ప్రాముఖ్యతను వివరించారు.

13వ తేదీ ఉదయం మంత్రదీక్షా సంస్కారాన్ని 100 మందికి శ్రీ పరమానంద ద్వివేదిగారు నిర్వహించారు. ఆ పిమ్మట సామూహిక ఫోటో కార్యక్రమం జరిగింది. తర్వాత డా॥ ఓ.పి.శర్మ గారు ప్రసంగిస్తూ గురు అనుశాసనాన్ని వివరిస్తూ - 1) నియమిత గాయత్రీ మంత్రోపాసన మూడు మాలలకు తక్కువ కాకుండా నిత్యం చేయాలి. 2) రోజుకొక్క రూపాయి అంశదానం 3) ఆస్వాద భోజనం 4) వారానికొకరోజు మౌనం 5) స్వాధ్యాయం అనగా సద్గురువుతో వారి గ్రంథ పఠనం ద్వారా సంభాషించుట 5) రెండు అనుష్ఠానాలు సంవత్సరానికి 6) సమయదానం - సగటున రోజుకు రెండు గంటలు - వీనిని గురించి తెలిపారు. దీనితో ఆత్మకళ్యాణం సిద్ధిస్తుంది అన్నారు.

రాత్రి అశ్విని సుబ్బారావుగారు తమ ప్రజ్ఞాపురాణ కథతో అందరిని ఆకట్టుకున్నారు. ఫూల్‌సింగ్, చంద్రశేఖర్లు తమ గాత్రంతో, వాయిద్యాలతో రంజింపచేశారు. 14వతేదీ శ్రీ కాళీచరణ్‌శర్మగారు ఆలోచనలలో సృజనాత్మకశక్తి ప్రభావాన్ని విశదీకరించి చెప్పారు - సాయంత్రం వీడియో ప్రోగ్రాం జరిగినది.

15వ తేది ఉదయం శ్రీ కపిల్‌జీశర్మ గారు ఉపాసన ప్రాధాన్యతను వివరించారు. సాయంత్రం శ్రీమతి యశోదదేవిశర్మ గారు వ్యక్తిత్వ, కుటుంబం, సమాజ నిర్మాణం గురించి సవివరంగా తెలియజేశారు.

మధ్యాహ్నం శ్రీ పరమానంద ద్వివేదిగారు శాంతికుంజ్ స్థాపన వెనుకనున్న ఆశయాలను విశిష్టతను, ఉపలబ్ధుల గురించి ప్రసంగించారు. డా॥ దత్తాగారు మాట్లాడుతూ యజ్ఞీయ జీవన విధాన ప్రాధాన్యతను, యజ్ఞ ఫలితాలను సవివరంగా తెలిపారు. "WATCH" అనెడి ఆంగ్లపదానికి గల వివిధ అర్థాల వివరిస్తూ

**W** - Watch your "Words" మీ మాటలను గమనించండి.

**A** - Watch your "Actions" మీ చేష్టలను గమనించండి.

**T** - Watch your "Thoughts" మీ ఆలోచనలను గమనించండి.

**C** - Watch your "Character" మీ నైజాన్ని గుణగణాలను గమనించండి.

**H** - Watch your "Humility" మీ నమ్రతను గమనించండి.

18వ తేది శ్రీ సందీప్-దేవ సంస్కృతి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గారు విశ్వవిద్యాలయ స్థాపనలో పూజ్య గురుదేవుల ఆకాంక్షను గురించి వివరిస్తూ భారతదేశ లక్ష్యాలను, సంస్కృతిని వ్యాప్తిలోనికి తెచ్చేదే ఈ విశ్వవిద్యాలయం. మనకోరిక సంకల్పం బలంగా ఉన్న వేళ, పరిస్థితుల అనుకూలత ద్వారా లక్ష్యాన్ని సాధించుకోవచ్చు అన్నారు. అట్లే కష్టాలకు భయపడక వానితో సహజీవనం నెరుపుట నేర్చుకొనమని, అప్పుడు లక్ష్యసాధన వీలుపడునని ఉద్బోధించారు. విశ్వవిద్యాలయంలో ఆయుర్వేద శాస్త్రం, మంత్ర విద్యా, జ్యోతిష విద్య, యోగవిద్యల గురించి బోధింపబడునని తెలిపారు. ఇంటర్‌నెట్ ద్వారా విశ్వ విద్యాలయంలో ప్రవేశించి విద్యనభ్యసించవచ్చునని తెలిపారు.

19వ తేది శిబిర ముగింపు రోజున వీడ్కోలు సభ ఏర్పాటు చేయబడినది. శ్రీ గౌరీశంకరశర్మగారు వీడ్కోలు సందేశమిస్తూ శాంతికుంజ్ నుంచి పూజ్య గురుదేవుల శక్తిని గైకొని అందరికి అందజేయుమని కోరారు. శాంతికుంజ్‌లో అంతా ఒక క్రమపద్ధతిలో నిర్వహింపబడునని, ఋషులవాణి శ్రద్ధాభక్తి విశ్వాసమున్న వారికి విన్పించునని తెలిపారు. దీనికి మన భావనలు పనులు పవిత్రంగా ఉండాలని తెలిపారు.

తదుపరి డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ వీడ్కోలు సందేశమిస్తూ, బంగారం, వెండి, ధనం శరీర శక్తికి ప్రతిరూపాలు కాగా, ప్రేమ, భక్తి, త్యాగం, చింతన, వివేకం ఆంతరిక శక్తికి ప్రతిరూపాలని తెలుపుతూ, ఈ ఆంతరికశక్తుల పెంపుదలకు కృషి చేయ వలసినదిగా కోరారు. ఆనాడు మనిషిలోని దైవత్వం మేల్కొని విశ్వశ్రేయస్సుకు దోహదకారి అవుతుంది. తద్వారా భూమిపై స్వర్గావతరణ జరుగుతుంది అని ఆశీర్వదించారు.

భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష గురించి శ్రీ నాయక్‌గారు, దాని ఆవశ్యకతను తెలియజేస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దీని వ్యాప్తికై కృషి చేయవలసినదిగా కోరారు. అట్లే సంజయ్‌గారు డిసాస్టర్ మేనేజ్‌మెంట్ గురించి, ప్రజాసేవ గురించి, ఆపన్నులకు సహాయ సహకారాములనందిచెడి విధివిధానాల గురించి చక్కగా వివరించారు.

శ్రీమతి ప్రశాంతి ఉమేష్ శర్మ హిందీ ప్రసంగాలకు చక్కని తెలుగు అనువాదాన్ని అందించి అందరికి అర్థమయ్యేలా శిబిర విజయానికి తోడ్పడిరి. అట్లే శ్రీ ఉత్తమ్ గైక్వాడ్ తమ సంగీత విభావరితో మంచి ప్రేరణా గీతాలనందించి సభికులకు ఆనందాన్ని పంచిపెట్టారు. శ్రీ ఉమేష్‌శర్మగారు అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని చేకూర్చి శిబిర విజయానికి తోడ్పడిరి.

శ్రీ శివాజీగారు సందర్శకులకు, పరివారం అవసరాలు తీర్చుచూ చక్కని సేవలనందించారు. సంస్కారాలు కూడా చేయించారు.

అన్నింటికి మించి ప్రముఖంగా అభినందించవలసినవారు శ్రీ పరమానంద ద్వివేదిగారు. తమ చక్కటి ఆధ్యాత్మిక ప్రసంగాలతో చక్కని జ్ఞానాన్ని అందజేశారు. పూజ్య గురుదేవులు, మాతాజీల గురించి గాయత్రీ మంత్ర విశిష్టత గురించి మనస్సుకు హత్తుకొనెడి ప్రసంగాలనందించి, జ్ఞానభిక్షను అందరికి ప్రసాదించారు. వీరికి ప్రత్యేక ధన్యవాదములు.

**ఇతరులను నిందించడం వల్ల విజయావకాశాలు మెరుగవ్వవు, మరింత క్షీణిస్తాయి.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## గుంటూరు జిల్లాలో

06.03.2011 న గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో గురుదేవుల జన్మశతాబ్ది సందర్భమున 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం శ్రీ మదమంచి సుధాకర్ గారి ఆధ్వర్యంలో శ్రీ పేరిశాస్త్రి, శ్రీ డి.వి.డి.మూర్తి, అనసూర్యమ్మగార్లు నిర్వహించారు. ముందురోజు అనగా 05.03.2011 నాడు సాయంత్రం 108 కలశములతో కలశయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. తరువాత 2400 దీపాలతో దీపయజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నారాకోడూరు గాయత్రి ప్రజ్ఞాపీఠం నుండి శ్రీ రవీంద్రారెడ్డి, గ్రామపెద్దలు సహాయ సహకారాలందించారు. యజ్ఞానంతరం సుమారు 5000 మందికి భోజన ప్రసాదం అందించారు.

## వరంగల్ జిల్లాలో

**వరంగల్‌లో మే నెలలో నిర్వహించిన కార్యక్రమాలు :**

జన్మదిన సంస్కారములు 1, వివాహదిన సంస్కారములు 2, నామకరణ సంస్కారములు 1, పుంసవన సంస్కారములు 1, ఏకకుండి యజ్ఞములు 9, యుగశక్తి గాయత్రి సభ్యత్వం 4, సాహిత్యం అమ్మింది రూ. 1,111/-. ఈ కార్యక్రమాలన్నీ శ్రీ ఎ. రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించబడినాయి.

## ఖమ్మం జిల్లాలో

ఖమ్మం జిల్లాలో శ్రీ చౌదరిగారి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కార్యకర్తల సహాయ సహకారాలతో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం తిర్మలాయపాలెం గ్రామంలోగల కుసుమ హరనాథ్ దేవాలయ ప్రాంగణంలో 08.05.2011న ఉదయం 10 గంటలకు శ్రీ ఎ.రాధాకృష్ణమూర్తిగారు నిర్వహించగా గ్రామ ప్రజలు 100 మందికిపైగా పాల్గొని భక్తి శ్రద్ధలతో యజ్ఞం చేసుకొనుటయే గాక గురుదేవుల సాహిత్యం ఇంటికి తీసుకుని వెళ్ళారు.

తేది 24.05.2011 మంగళవారం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో హనుమత్ జయంతి సందర్భంగా దీక్ష తీసుకున్న హనుమాన్ భక్తులు సంకల్పం మేరకు ఆలయ పూజారి శ్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 12 కుండముల గాయత్రీ మహాయజ్ఞము శ్రీ ఎ. రాధాకృష్ణమూర్తిగారు నిర్వహించగా దాదాపు 200 మంది భక్తులు పాల్గొన్నారు. యజ్ఞము తర్వాత అన్నదానము జరిగింది. గాయత్రీ మంత్ర లేఖనం వ్రాయుటకు కొంతమంది భక్తులు ఆసక్తి తెలిపి పుస్తకములు తీసుకెళ్ళారు.

వరంగల్‌లో సంస్కారములుగాని, యజ్ఞములు చేయించుకొన దలచినవారు శ్రీ ఎ. రాధాకృష్ణమూర్తిగారిని (సెల్: 9395372843) సంప్రదించగలరు. మరియు యుగశక్తి గాయత్రి పత్రిక రెన్యువల్ కొరకు కూడా సంప్రదించవచ్చు.

## ఒంగోలులో

గాయత్రీ జయంతి సందర్భమున ఒంగోలు బాపూజీ గోశాలలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం గోశాల నిర్వాహకులు శ్రీ నాగేశ్వరరావు, శ్రీ సుబ్బారావుగార్ల ఆధ్వర్యంలో శ్రీ మలసాని వెంకటేశ్వర్లు నిర్వహించారు. సుమారు 150 మంది పరిజనులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని శ్రీమతి కోటలక్ష్మి సహకరించారు.

### అశ్విని ఛారిటబుల్ ట్రస్టు వారిచే కుక్క తేలు, పాము కాటుకు ఉచిత హోమియో మందు పంపిణి

*ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి స్వల్ప ఖర్చుతో కూడిన అత్యంత విశ్వసనీయముగా పనిచేయుచున్న హోమియో వైద్య సేవలను అందుబాటులోనికి తేవాలనెడి సత్సంకల్పముతో, అశ్విని ఛారిటబుల్ ట్రస్టు వారి సహకారముతో గాయత్రీ పరివార్ ఈ బృహత్ కార్యక్రమమును చేపట్టుట జరిగింది.*

*29 మే, 2011 ఆదివారమునాడు, దాదాపు 80 గ్రామాల నుండి గాయత్రీ పరివార్ స్వచ్ఛంద కార్యకర్తలు ఉప్పలపాడు గ్రామములోని కళ్యాణమండపంలో సమావేశమైనారు. వీరంతా కుక్క, తేలు మరియు పాము కాటుకు వారి వారి 80 గ్రామాలలో ఉచితంగా హోమియో మందును పంపిణి చేసెడి సేవలనందించగలమని అశ్విని ఛారిటబుల్ ట్రస్టు, హైదరాబాద్ వారికి ఇంతకు పూర్వమే దరఖాస్తు చేయుట జరిగినది. తదనుగుణముగా అశ్విని ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్‌గారైన శ్రీ అశ్విని సుబ్బారావు మరియు వారి ధర్మపత్ని శ్రీమతి మహేశ్వరిగార్లు హోమియో కిట్‌ను తయారు చేయించి ఆయా గ్రామాల కార్యకర్తలకు అందజేయుట జరిగినది. తొలుత శ్రీ సుబ్బారావుగారు, ఆ మందు వాడే విధానాన్ని తెలుపుచూ, ఇంతకు పూర్వము ఇదే కార్యక్రమాన్ని చేపట్టిన వారి అనుభవాలను సభికులకు వివరించారు. శ్రీ పేరిశాస్త్రిగారు కార్యక్రమానికి అనుసంధానకర్తగా వ్యవహరించి కార్యక్రమాన్ని జయప్రదంగావించుటకు తోడ్పడ్డారు.*

**మన వైఫల్యాలకు ఇతరులను నిందించకూడదు మనమే మనను నిందించుకోవాలి.**

అక్షరాల ఆట

# పదగాయత్రి-9

నిర్వహణ : సాధన నరసింహాచార్య

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | | | | 5 |
| 6 | | | | ✕ | ✕ | ✕ | |
| | ✕ | ✕ | ✕ | 7 | 8 | 9 | |
| | 10 | 11 | 12 | | | | 13 |
| ✕ | 14 | | | ✕ | | ✕ | ✕ |
| 15 | | ✕ | | ✕ | 16 | 17 | 18 |
| | ✕ | ✕ | ✕ | 19 | ✕ | 20 | |
| 21 | | ✕ | 22 | | ✕ | 23 | |

## పదగాయత్రి-8 సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మా | 2 తా | 3 భ | 4 గ | వ | తీ | 5 దే | 6 వి |
| 7 వి | ర | జ | ము | ✕ | 8 తం | శా | శ్వ |
| చి | ✕ | 9 రం | జ | న | ✕ | 10 ట | క |
| గు | ✕ | గ | ✕ | ✕ | ము | న | 11 వి |
| రు | ✕ | ద | ✕ | 12 ప | ద్య | ము | ✕ |
| ✕ | ✕ | ళ్ | 13 ద | వా | 14 సే | ✕ | 15 యా |
| 16 ప్రా | స | ✕ | 17 ధీ | రి | ✕ | 18 స | గం |
| నం | 19 యా | ✕ | 20 చి | రం | జీ | వ | ✕ |

పేరు : ..................................................

చిరునామా : ...........................................

..............................................................

...................... పిన్ కోడ్ : ........................

ఫోన్ నెం : ...........................................

## ఆధారాలు

### అడ్డం

1. 'నిదానమే ప్రధానము' అన్న సూక్తికి విరుద్ధం (8)
6. నేత్రము (4)
7. చిరునామా (లేక) గుర్తు (4)
13. "వందే వాల్మీకి కోకిలమ్...." శ్లోకంలోని మొదటి పాదం (అటునుండి ఇటు) (8)
14. దుష్టుడు (3)
15. తరంగం, కెరటం (2)
16. మహాభారతానికి మరోపేరు అపజయం కానిది (3)
20. మాండలికం (2)
21. మాటలు రావడం కోసం పిల్లలకు ఇది పోస్తారు (2)
22. విదుర ..... భారతంలో ప్రధానమైన కథలు (2)
23. నువ్వులు ఏకవచనం (2)

### నిలువు

1. ఒక తరం నుండి ఇంకో తరానికి సంక్రమించేది (ఆస్తులు కావు) ఒక అక్షరం లోపించింది (4)
2. శృతికి తోడు (2)
3. ముక్కుపొడుం (క్రింద నుండి) (2)
4. 'అనంతము' నకు ఆద్యంతాలు (2)
5. ఏ విషయాన్నైనా ఇలా చర్చించాలి (క్రింద నుండి) (4)
7. ఆచూకీ తీయడం (2)
8. అస్తవ్యస్తమైన జలపాతం (4)
9. ఆద్యంతాలు (నీటిలో పుట్టినది) (2)
10. వడ్డాణం (3)
11. 'జవరాలు' లోని ఆఖరి రెండక్షరాలు (2)
12. కాళింది ..... న కాళీయుని పడగన (3)
15. స్త్రీ (3)
17. శర్మిష్ట పేరు వినగానే స్ఫురించేవాడు (3)
18. యాదవ వంశంలో పుట్టినది (3)
19. తీరు (2)

### నిబంధనలు :

1. *సమాధానాలు "కీ"తో సరిపోవాలి.*
2. *కూపన్లు చేరవలసిన చివరి తేది 18-07-2011*
3. *పత్రికలో పైన ఇచ్చిన కూపన్‌నే పంపవలెను.*
4. *దిద్దుబాట్లు / కొట్టివేతలు / తుడుపులు ఉండరాదు.*
5. *తెల్లకాగితాలు / జిరాక్స్ కాపీలు అనుమతించబడవు.*
6. *అన్ని కరెక్టు అయిన ఎంట్రీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నచో లాటరీ ద్వారా ఎంపికచేసి **ప్రథమ బహుమతి రూ.100/-లు, ద్వితీయ బహుమతి రూ.50/-లు** ఇవ్వబడును.*
7. *తపాలశాఖవారి ఆలస్యానికి పత్రిక బాధ్యత వహించదు.*
8. *బహుమతుల విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే. ఎలాంటి వివాదాలకు తావులేదు.*
9. *పేరు, చిరునామాలు స్పష్టంగా, పిన్‌కోడ్‌తో ఫోన్‌నెంబరుతో సహా వ్రాయాలి.*

### పదగాయత్రి-8 విజేతలు

మొదటి బహుమతి : **బి.ఎల్.ఎన్. మూర్తి,** యర్రబాలెం, గుంటూరు జిల్లా

ద్వితీయ బహుమతి : **పి. సీత,** పటేల్‌నగర్, బాపట్ల, గుంటూరు జిల్లా

### ఎంట్రీలు పంపవలసిన చిరునామా

**పదగాయత్రి C/o. యుగశక్తి గాయత్రి,** అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18.